# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక, జులై, 2010 ₹ 20/-



తొలిచూలుకు పువ్వుల ముడుపు

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**
*- Dammapada.*


**సంపుటి 21 జులై 2010 సంచిక 7**



*ప్రధాన సంపాదకుడు*
చెన్నూరు ఆంజనేయరెడ్డి

*సహ సంపాదకుడు*
అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి (బుద్ధఘోషుడు)

*సమాలోచక మండలి*
డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి
డాక్టర్ అబ్బూరి గోపాలకృష్ణ
డాక్టర్ జయధీర్ తిరుమలరావు
కుర్రా జితేంద్రబాబు
ముంగర జాషువా
కాండ్రేగుల నాగేశ్వరరావు
డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

*రెసిడెంట్ ఎడిటర్*
వల్లభనేని అశ్వినీకుమార్

*సంస్థాపక సంపాదకులు*
రవీంద్రనాథ్ ఆలపాటి



*Printed & Published by*

Bapanna Alapati
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, Cell : 94412 74960
E-mail : misimi_monthly@yahoo.in
Visit us at : www.misimi-monthly.com

ప్రతి : రూ. 20/– సంవత్సరానికి : రూ. 200/–
విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25.00


# ఈ నెల...


రవీంద్రనాథ్ టాగూర్ ........................................ 3
– *ఎమ్. శివరామకృష్ణ, బి.వి. రామిరెడ్డి*

తెలుగునాట ఆధునిక చిత్రకళకు
దారి చూపిన దామెర్ల .................................. 9
– *విష్ఫుర్తి కలికావతారం*

నా రచనలే నా స్థితికి ప్రతిబింబం ...................... 16
– *ఆచార్య కొలకలూరి ఇనాక్*

గిరిమల్లెలు ................................................ 21
– *కె. భాను నాయక్*

చంద్రగ్రహణం ............................................ 26
– *హరిమోహన్ ఝా*

కట్టమంచి – రాళ్ళపల్లి.................................. 31
– *కుర్రా జితేంద్ర బాబు*

మౌలిక శక్తులు ........................................... 32
– *డా. సి. నారాయణరెడ్డి*

రవీంద్రుని 'చిత్రం' ........................................ 33
– *పెద్ది సాంబశివరావు*

నేనెరిగిన పుట్టపర్తివారు .................................. 39
– *డా. జానమద్ది హనుమచ్ఛాస్త్రి*

ఆయీ జ్ఞాపకాలు............................................ 41
– *నటరాజ రామకృష్ణ*

జానపద సాహిత్య దార్శనికుడు
ఆచార్య బిరుదురాజు రామరాజు .................... 49
– *ముంగర జాషువా – విద్వాన్ జ్యోతి చంద్రమౌళి*

*రసమయ ప్రకృతి........................................... 53*
– *సూర్యదేవర సంజీవదేవ్*

మహారాజ సన్నిధిలో ..................................... 57
– *సత్యజిత్ రే*

"రసచర్చ – ఆధునికత" ................................... 60
– కాకుమాని శ్రీనివాసరావు


*ముఖచిత్రం* : *రాసలీల*
*రెండవ అట్ట* : తొలిచూలుకు పువ్వుల ముడుపు
*మూడవ అట్ట* : *అమాయిక*
*చివరి అట్ట* : పెండ్లికూతురు

*చిత్రకారుడు:*
**దామెర్ల రామారావు**

**వి**షయ వైవిధ్యాన్ని, మార్పును ఆహ్వానించి ఆదరించిన **మిసిమి** పాఠకులకు ధన్యవాదాలు. రెండు దశాబ్దాల గాథ ముద్రగల సంచికను అందరి అభిరుచులకు తగినట్లుగా మార్పు చేయటం కష్ట సాధ్యమే. ఈ ప్రక్రియలో మా ప్రయత్నాన్ని ప్రోత్సహించిన వినసొంపైన అభినందనలను, వినదగిన సూచనలను, ఆలోచించవలసిన విమర్శలను అన్నీ అందుకున్నాం.

మా ప్రయత్నమంతా ఒక్కమాటలో చెప్పాలంటే ఆలోచనాత్మకమైన సారస్వతాన్ని ఎక్కువ మంది పాఠకుల చెంతకు తీసుకు రావటమే. అందులో భాగంగానే మేము పరిశోధించి వెలికితీసే సమాచారం, రచయితలు ఎంతో ఉత్సాహంతో మాకు పంపే రచనలను పరిశీలించి ఎంపిక చేసినవి, కొన్ని విశిష్టత కలిగిన గతకాలపు రచనలు, సంచికలో చోటు చేసుకుంటాయి.

ఒక పత్రికకు ఉండవలసిన పరిధులు – ఉదాహరణకు ఒక వ్యాసానికి కేటాయించే పుటలు, పాఠకులను చదివింపజేసే ధార, ఆలోచింపజేసే సహేతుకమైన విషయ వివరణ లాంటివి – దృష్టిలో ఉంచుకుని రచనలు పంపవలసినదిగా విజ్ఞులైన రచయితలను కోరుతున్నాం. ఇది పరిశోధనాత్మక పత్రికకాదు కాబట్టి, భాష సరళంగాను, విషయ విశ్లేషణ క్లుప్తంగాను పాఠకులకు అందించవలసి ఉంటుంది.

సామాజిక శాస్త్రం (Sociology), మానవ శాస్త్రం (Anthropology) విషయాలలో – ముఖ్యంగా దక్షిణాదికి చెందినది – తెలియవలసినది ఎంతైనా ఉంది. ఈ దిక్కుగా కూడా రచయితల సహకారాన్ని కోరుతున్నాం.

*ఈ సంచికలో...*

విశ్వకవి రవీంద్రుని 150వ జయంతి సందర్భంగా కొన్ని ప్రత్యేక రచనలు అందిస్తున్నాం.

తెలుగునాట ఆధునికత చిత్రకళకు దారిచూపిన దామెర్ల రామారావు జీవితాన్ని – ఆయన కళావిశిష్టతను తెలిపే సమాచారం కొంతవరకైనా **మిసిమి** పాఠకులకు అందించగలుగుతున్నాం.

**– సంపాదకులు**

## ఆసియాలో ప్రప్రథమ నోబెల్ బహుమతి గ్రహీత

# రవీంద్రనాథ్ టాగూర్

రవీంద్రుని 150వ జయంతి సందర్భంగా, నోబెల్ బహుమతి కమిటీ ఛైర్మన్ హెరాల్డ్ జార్నె 1913వ సంవత్సరపు నోబెల్ సాహితీ పురస్కార ప్రదానోపన్యాసంలోని ముఖ్యమైన భాగాలను; విశ్వకవి, మహాత్ముని పరస్పర గౌరవాభిమానాలను, భేదాభిప్రాయాలను సంక్షిప్తంగా మిసిమి పాఠకులకు అందిస్తున్నాము.

భారతీయ ఆంగ్లకవి రవీంద్రనాథ్ టాగూర్‌కి నోబెల్ సాహిత్య పురస్కారాన్ని బహూకరించటంలో ఎకాడమీకి ఆనందం కలిగించిన అంశం, ఈ పురస్కారం స్థాపించిన ఆల్ఫ్రెడ్ నోబెల్ చివరి వీలునామాకి, నిబంధనలకి అనుగుణంగా ఉండటం. ఆదర్శవంతమైన భావాలు కలిగిన కావ్యాలకి దీన్ని బహూకరించాలని ఆయన అభిమతం. విశదంగా, క్షుణ్ణంగా, నిజాయితీతో ఈ గేయాలని పరిశీలించిన తర్వాత, వీటికి ఈ పురస్కారం లభించటానికి అవసరమయిన స్థాయి ఉన్నది అన్న దృఢమైన అభిప్రాయం కలిగింది. ఈ కారణం వల్ల, కవి నివాస స్థలం సుదూరంగా ఉండటం, ఆయన పేరు యూరప్‌లో అంతగా తెలియక పోవటం అన్న అంశాలు అవరోధాలుగా పరిగణింపబడలేదు. దీనికి మరొక కారణం కూడా ఉన్నది: ఈ నోబెల్ బహుమతిని ఏర్పాటు చేసిన వ్యక్తి, "ఈ పురస్కారాన్ని ప్రదానం చేయటానికి ప్రతిపాదించబడిన వ్యక్తి జాతీయతని పరిగణలోకి తీసుకొనవలిన అవసరం లేదు" అన్న ఆకాంక్షని స్పష్టంగా సూచించటం.

టాగూర్ వ్రాసిన పుస్తకాలలో గీతాంజలి (1912), ఈ పురస్కారాన్ని ఎంపిక చేసిన విమర్శకుల దృష్టిని ఎంతగానో ఆకట్టుకుంది. ఇది ఒక ఆధ్యాత్మ గేయ కావ్య సంపుటి, నిజానికి, పరిపూర్ణమైన అర్థవంతమైన దృక్పథంతో పరిశీలిస్తే ఈ గ్రంథం



ఆంగ్ల సాహిత్యానికి చెందినది. అయితే, విద్యాపరంగా, ఆయన రచనలు ధోరణిని పట్టి చూస్తే టాగూర్ భారతీయ భాషల పరిధికి చెందినవాడే. కాని తన గేయాలకి ఆయన నూతన వస్త్రాలని ధరింపచేసాడు. అందువల్ల కావ్య పరంగా పరిశీలిస్తే, గీతాంజలి సార్వజనీనకమైనది. వ్యక్తి పరమైన ప్రజ్ఞ, ఉద్దీపనల దృష్టిలో మౌలికమైనది. ఆ విధంగా ఇది ఇంగ్లండ్, అమెరికాలకే కాక పాశ్చాత్య ప్రపంచం అంతటికీ అందుబాటులోకి వచ్చింది. ఇంతేకాదు ఇక్కడి వాళ్ళకి నచ్చి, ఆసక్తి కలిగించే ఉన్నతమైన

అనువాదం : ఎమ్. శివరామకృష్ణ, ఫోన్ : 040-27562225, బి.వి. రామిరెడ్డి, సెల్ : 9908856530

స్థాయిని గీతాంజలి అందుకున్నది. బెంగాలి కవిత్వ ధోరణుల గురించిన పరిజ్ఞానం, మతానికి చెందిన విశ్వాసాలు, సాహిత్య సంప్రదాయాలు, వాటికి చెందిన లక్ష్యాలు – వీటిని పరిగణనలోనికి తీసుకొనవలసిన అవసరం లేని విధంగా ఈ కవి అన్ని రంగాల ప్రశంసలని అందుకున్నాడు. ఎలిజబెత్ పరిపాలనా కాలంనుంచి పురోగతి సాధించిన బ్రిటిష్ నాగరికత యొక్క తిరుగులేని ప్రగతిలో ఒక భాగమే ఈ కావ్యం కావటం ఆ ప్రశంసలకి మరొక కారణం.

టాగూర్ గేయాలని చదవగానే ఎంతో ఉత్సాహాన్ని, ఉద్వేగాన్నీ, అభిమానాన్ని కలిగించిన అంశాలు: అపూర్వమైన భావాలు; అన్య భావాలని అంతర్లీనం చేసి, సమన్వయం సాధించిన అపురూప శిల్పం. ఈ సమన్వయం సమగ్రంగా, సమతౌల్యంగా ఉండటం; ఈ సమతౌల్యం ప్రతిబింబించే లయాన్వితమైన శైలి. ఒక ఆంగ్ల విమర్శకుడి దృష్టిలో, టాగూర్ కవిత్వం కోమలమైన లాలిత్యంతో పాటు గద్యానికి ఉన్న పటిష్టమైన శక్తిని కూడా సంతరించుకుంది. ఇంతేకాదు, గ్రాంధికమైన (Classical) కావ్య శబ్దాల ఎంపికలో కూడా ఆయన కవిత్వం అపూర్వం. పైగా, ఐచ్ఛికంగా ఎన్నుకున్న విదేశీ భాషలో (భావ) వ్యక్తీకరణకి చెందిన అంశాలని కూడా చక్కగా ఉపయోగించుకునే ప్రజ్ఞ. క్లుప్తంగా చెపితే, ఇవన్నీ కలిసి గీతాంజలి అపురూపం, మౌలికం అయిన ఒక రచన అన్న ముద్రణని వేసాయి. మరొక భాషలో వీటిని చెప్పటం ఎంతో కష్టం.

టాగూర్ రెండవ గేయ సంపుటి కూడా మాకు చేరింది: The Gardner : Lyrics of Love and Life (1913). పై లక్షణాలు ఇందులో కూడా కనిపిస్తాయి. అయితే ఈ రెండవ సంపుటిలో పద్యాలు పరిష్కరించబడి, తిరిగి వ్రాయటం జరిగిందని రచయితే చెప్పారు. ఇది సహజమైన ఉద్దీపన, స్పందనలద్వారా ఆవిర్భవించినది కాదు. ఈ సందర్భంలో టాగూర్ (కావ్య) వ్యక్తిత్వంలో మరొక అంశం గమనిస్తాం. యవ్వనంలో కనిపించే ఆనందం, శోకం రెండూ (విడదీయరాని) అనుభవాలు. ఒకటి మరొక దానికి దాదాపు పర్యాయం. ఇతర సందర్భాలలో కొన్ని సార్లు జీవితంలోని ఆటుపోట్లు, కల్లోలాలు సృష్టించే వ్యాకులత నిండిన భావాలు ఆనందంతో మిళితమయి కనిపిస్తాయి. వీటిని సమగ్రంగా పరిశీలిస్తే, అవి ఉన్నతమైన ఒక (భావనా) ప్రపంచం యొక్క ఛాయలు ఆ ఉద్వేగాలతో ముడిపడి ఉంటాయి అని స్పష్టమౌతుంది.

టాగూర్ కథలు Glimpses of Bengal Life (1913) అన్న శీర్షికతో వెలవడ్డాయి. కాని ఈ కథలలో స్పష్టమైన, వైయక్తికమైన ఆయన ముద్ర కనిపించదు. దీనికి కారణం మరొకరు వీటిని ఇంగ్లీషులో రూపొందించటం. అయితే, జీవితాన్ని పరిశీలించటంలో వైవిధ్యం, అపారమైన బహుముఖ ప్రజ్ఞ, పాత్రల విభిన్నమైన విధివ్రాతలు, అనుభవాలపట్ల ఆర్ద్రత, హృదయ పూర్వకమైన సహానుభూతి కనిపిస్తాయి. ఇంతేకాదు, కథాకథన శిల్పంలో, కథాంశాన్ని పెంపొందించటంలో ప్రజ్ఞ ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

వీటి తర్వాత మరో రెండు పుస్తకాలు వెలువడ్డాయి. ఒకటి The Crescent Moon (1913). ఇందులో టాగూర్ తన బాల్యాన్ని, కుటుంబ జీవనంలో అనుభవాలని కవితా రూపంలో చెప్పారు. ఇది కాక Sadhana : The Realisation of Life కూడా అదే సమయంలో వెలువడింది. అమెరికా, ఇంగ్లండ్ దేశాలలోని విశ్వవిద్యాలయాలలో టాగూర్ ఇచ్చిన ఉపన్యాసాల సంకలనం ఈ పుస్తకం. ఇందులో ప్రధానమైన విషయం (ఆధ్యాత్మిక) విశ్వాసం. ఎన్ని విధాలుగా ఉంటుందో ఎటువంటి మార్గాల ద్వారా ఆ విశ్వాసాన్ని సాధించగలమో, దాని వల్ల కలిగిన జ్ఞానం ఏ విధంగా జీవించటానికి మనం మలచుకోవాలో టాగూర్ వివరించారు. విశ్వాసం (faith) భావం, ఆలోచన, (thought), రెండింటి మధ్య ఉన్న సంబంధాన్ని కనుగొనే అన్వేషణ యొక్క వివరణ, విశ్లేషణ, టాగూర్ ఎంత ప్రగాఢమైన ప్రజ్ఞగల కవో చూపుతుంది. ఆయన భావనా పటిమ, ఆర్ద్రత, అన్నిటినీ మించి సంకేతపరమైన చిత్రీకరణ వ్యక్తం చేసే భాష (figurative language) – ఇవన్నీ ఆ ప్రజ్ఞకి ఆనవాళ్ళు. వీటి ద్వారా ఒక చైతన్య వంతమైన శక్తి వ్యక్తమవుతుంది. వస్తు వైవిధ్యం ఒక్కటే కాదు. సృజనాత్మక వాఙ్మయంలో అరుదుగా కనిపించే లక్షణాలు టాగూర్‌లో కనిపిస్తాయి. పరమ సత్యం అన్వేషించే ఆత్మ అనుభవించే (అనిర్వచనీయమైన) వ్యాకులతతో మొదలుకొని, ఒక అమాయకమైన శిశువు తన ఆట ద్వారా పొందే ఆనందంతో పొంగి పొరలే వినోదం వరకూ, ఎన్నో భావాలు వ్యక్తీకరించ టంతో (టాగూర్) శ్రావ్యత, లాలిత్యం రెండూ కనిపిస్తాయి.

ఏవిధంగా పరిశీలించినా, వీరి కవిత్వం ఒక పరాయి దేశానికి చెంది విస్మయం కలిగించి, చమత్కారంగా కనిపించేది (exotic) కాదు. మౌలికమైన విలువలలో ఇది సార్వజనీన మైనది. ప్రస్తుతం మన అవగాహనకి అందే విషయాలకి భవిష్యత్తులో మరిన్ని కోణాలు సూచితమవుతాయి. ఒక విషయం మాత్రం స్పష్టం: ఎంతో విడిపోయి ఉన్న రెండు భిన్నమైన నాగరికతలని సమన్వయం చేసి, సామరస్యం కలిగించే ప్రయత్నం ఈ కవిత్వంలో స్పష్టమౌతుంది. నిజానికి ఇది గహనమైన సమస్య, ఒక చిక్కుముడి. ఈ యుగంలో ఇది మరింత ప్రస్ఫుటంగా కనిపించే విషయం.

అతిప్రాచీనమైన ఆంగ్లో – ఇండియన్ ప్రాంతమైన బెంగాల్‌లో, టాగూర్ జన్మించిన 1861 ప్రాంతంలో క్రైస్తవ మతోద్ధరణకు విశేషకృషి చేసిన 'కేరీ' శ్రమవల్ల, ప్రాంతీయ భాష ఉద్ధరింపబడింది. టాగూర్ ఉన్నతమైన, గౌరవనీయ కుటుంబానికి చెందినవాడు. ఎన్నో రంగాల్లో వారిది మేధావుల కుటుంబం. ఆ కుటుంబంలో కళలు, సాహిత్యం మొదలైన వాటిలో మహాజ్ఞానులు వారి పూర్వీకులనుండి ఉన్నారు. వారి పూర్వీకుల భక్తిగీతాలు, వారి కుటుంబాల పూజాగదుల్లో మార్మోగేవి. వాటికి కొత్తగా వచ్చిన సాహితీ సృజన తోడయింది. అలాంటి వాతావరణం మధ్య టాగూర్ పెరిగాడు.

టాగూర్ తండ్రి బ్రహ్మసమాజ స్థాపకుల్లో వొకరు. అది ప్రాచీన హిందూమతంలో భాగం కాదు. అది 19వ శతాబ్ది ప్రారంభంలో క్రైస్తవ మత ప్రవచనాలవల్ల ప్రభావితుడై, ఇంగ్లండులో విద్యనభ్యసించిన వ్యక్తి. ప్రాచీన హిందూమత సిద్ధాంతాలను క్రైస్తవ సిద్ధాంతాలతో కలిపి రూపొందించిన ఒక కొత్త జీవన మతవిధానం. దీనివల్ల ఎందరో మేధావులు ప్రభావితులయ్యారు. వారిలో టాగూర్ వొకడు. వారందరికీ టాగూర్ అంటే అమిత గౌరవం. వారికి ఆయన వొక ప్రవక్త.

తన జీవిత లక్ష్యాన్ని సాధించటానికి, వివిధ కోణాలలో వ్యక్తమవుతున్న సంస్కృతిని టాగూర్ ఆకళింపు చేసుకున్నాడు. యూరోపియన్, భారతీయ సంస్కృతులు రెండూ ఈ లక్ష్య సాధనకి ఉపకరించాయి. విదేశాలలో పర్యటన దీనిని విస్తరింపచేసింది, పరిణతి, ప్రగతి కలిగేలా చేసింది. దీనికి తోడు లండన్‌లో ఉన్నత విద్య, తండ్రిగారితోపాటు స్వదేశంలో విస్తారంగా పర్యటనలు, చిన్నతనంలోనే బెంగాలీ భాషలో వ్రాయటం ప్రారంభించాడు. కవిత్వం, గద్యం, గేయాలు, నాటకాల..... సామాన్య ప్రజల జీవన విధానాలని వివరిస్తూనే, సాహిత్య విమర్శ, తత్వశాస్త్రం, సాంఘిక శాస్త్రం మొదలైనవాటి పైన విశ్లేషణలు చేశాడు.

వాస్తవ జీవితంలోనే కాలాతీత సత్య దర్శనం అన్నిటికీ మూలం. కాలాతీత సత్యం కాలపరిమితులని మ్రింగి వేస్తుంది. తన సాంస్కృతిక వారసత్వంలోని అంశాలు టాగూర్ ఆకళింపు చేసుకున్నా, ఈనాటి వాస్తవాల క్షేత్రంపైననే ఆయన తనని స్థిరీకరించుకున్నాడు. ఈ యుగంలో, ప్రపంచ ప్రజలందర్నీ సమీకరించి, శాంతియుత మార్గాలకి మళ్ళించి, ఏ సంఘర్షణలు ఉన్నా అవి అందరి బాధ్యత అని ప్రబోధిస్తూ తన శుభాకాంక్షలని ప్రపంచ వ్యాప్తంగా పంపుతూ, టాగూర్ తన జీవితం గడిపాడు.

**అనంతకాలాన్ని నీ అధీనంలో ఉంచుకున్నావు**
**నీ కాలగమనాన్ని లెక్కించేందుకు**
**ఎవ్వరున్నారు?**
**దివా రాత్రులు గడిచిపోతుంటాయి**
**యుగాలు పూలలాగ రాలిపోతుంటాయి**
**నీకు నిరీక్షించటం తెలుసు –**
**శతాబ్దాల వరవడిలో ఓ అడవి పూవును**
**తీర్చిదిద్దుతావు**
**అయ్యో, మాకు సమయమే లేదు,**
**ఆగేందుకు అవకాశమే లేదు**
**మా పేదరికం మమ్మల్ని నిలవనీయదు కదా**
**అందుకే నీ పూజకు ఎవ్వరూ రాలేక**
**పోతున్నారు –**
**నా సమయమంతా వృథాగా పోతోంది –**
**నీ పూజా పాత్రలో పూలే లేకుండా పోయాయి**
**ఈ సంధ్యా సమయంలో నీ మందిర ద్వారాలు**
**మూయకముందే రావాలని తొందర**
**పడుతున్నా –**
**ఇంకా నాకు సమయం మిగిలివుందా స్వామీ!**

*(గీతాంజలి, 82)*

గీతాంజలి, 82 : అనువాదం : అశ్వినీకుమార్

# విశ్వకవి - మహాత్ముడు

*- కె. నాగేశ్వరరావు*

ఇద్దరూ మనిషినీ, మానవత్వాన్నీ ప్రేమించినవారే. ఆంగ్లభాషనూ, ఆధునికతను, ఆంగ్లేయ భావజాలం నుంచే స్వీకరించారు.

ఇద్దరూ Liberal Western Thought కు లోనయి ఆ భావాలకు ఆధారంగా దేశ స్వాతంత్ర పోరాటం కోసం ప్రయత్నించినవారు. ఇద్దరూ ఋషితుల్యులే. ఇద్దరి మధ్యా సామ్యం, ఇంతటితో సరి.

ఇద్దరూ రెండు భిన్న ధృవాలు. ఎన్నటికీ కలవని సమాంతర రేఖలు. ఒకరు భారతదేశపు తూర్పు దిక్కయిన బెంగాలులో జన్మిస్తే, మరొకరు పడమర దిక్కులోనున్న పోర్‌బందర్‌లో జన్మించారు. రవీంద్రుడు ఆగర్భ శ్రీమంతుడు. తల్లి ఒడిలో, ప్రకృతి బడిలో చదువు నేర్చుకుని తన జన్మ స్థలమైన కలకత్తాలోనే ఉండి పోయారు. గాంధీజీ మధ్యతరగతి కుటుంబీకుడు. పొట్టచేత బట్టుకొని బ్రతుకు తెరువు అన్వేషణలో ఇంగ్లండ్, దక్షిణ ఆఫ్రికాలాంటి దేశాలకు వలస వెళ్ళాడు.



రవీంద్రుడు అస్తిత్వవాది. దేవునిమీద నమ్మకమున్న వాడు. కానీ అతని దేవుడు సగటు హైందవ దేవుడు కాడు. అతనికి దేవుడు నెచ్చలి, చెలికాడు, మానవహితాన్ని అభిలషించే ఒక తండ్రి. ఒక పెద్దన్న, మీదు మిక్కిలి ప్రాణేశ్వరుడు. గాంధీ సంశయవాది (agnostic), అతనికి God is Truth కాదు Truth is God. రెండు వాక్యాలలోని పదాలు ఒక్కటే కానీ అర్థాలు వేరు. 'సత్యము' ఒక విశేషణం. అది ఒక వాస్తవం. తిరుగులేనిది, దానినే భగవంతుడన్నాడు గాంధీ. రవీంద్రుడు సంగీత, సాహిత్య, చిత్రకళానిధి, భావవాది. గాంధీ సగటు దరిద్రనారాయణుడై కొట్టుమిట్టులాడుతూ, కనీసపు రాజకీయ చైతన్యానికి, సాంఘిక స్పృహకు దూరాన ఉండిపోయిన భారతీయునిలో తన వేషభాషల ద్వారా భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించి, అహింసనే ఆయుధంగా తీసుకుని పోరాటం సాగించేలా స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రజలలో రగిల్చ గల్గిన, మంత్రాంగం నేర్చిన రాజకీయ పరివ్రాజకుడు.

గాంధీ, రవీంద్రనాథ్ టాగూర్‌ను 1916లో కలుసుకున్నారు. టాగూర్ గాంధీని 'మహాత్మా' అని సంబోధిస్తే, గాంధీ, రవీంద్రుని 'విశ్వకవీ' అని పిలిచారు. ఇరువురూ ఒకరి నొకరు గౌరవించుకున్నారు కానీ, పంచుకొన్న భేదాభిప్రాయాలు మిగిలిపోయాయి.

భారతదేశ స్వరాజ్యం కోసం గాంధీ ఎంపిక చేసుకున్న 1) చరఖా తిప్పుతూ నూలువడకటం 2) సహాయ నిరాకరణ 3) విదేశీ వస్తు బహిష్కరణలాంటి మార్గాలు ప్రయోజన శూన్యమైనవని రవీంద్రుడు వాటిని నిరాకరించారు. ఇలా అనేక విషయాలపై తమ అభిప్రాయ భేదాలను 1919 నుంచి 1941 వరకూ కొన సాగించారు.

గాంధీ మార్గాలను తప్పు బడుతూ, రవీంద్రుడు Modern Review లో ప్రత్యేకంగా వ్యాసాలు వ్రాశాడు. దానికి సమాధానంగా గాంధీ తన వ్యాసాలను యంగ్ ఇండియాలో ప్రచురించేవాడు. ఈ ఉత్తరాలు వాళ్ళు ఎన్నడూ వ్యక్తిగతంగా రాసుకోలేదు. సమస్య జటిలమైనది. సామాజిక పరమైనది కావటం వలన ప్రజలకు తెలిసేలా ప్రచురణ చేస్తూ వాటిని ప్రజల ముందు పారదర్శకంగా ఉంచారు.

1925లో ముందుగా గాంధీ సిద్ధాంతాలను ఏ మాత్రం మొహమాటం లేకుండా విమర్శించిన వాడు రవీంద్రుడు: "దేశంలోని ప్రతి వ్యక్తి రోజుకు 30 నిమిషాల పాటు చరఖా తిప్పి నూలు ఒడికితే స్వాతంత్ర్యం సులువుగా వస్తుందని,

త్వరలోనే వస్తుందని చెప్పటం బూటకం. చరఖా తిప్పటం తాను (గాంధీ) చెప్పిన సూత్రాలను త్రికరణ శుద్ధిగా పాటించక పోవటంవలననే స్వాతంత్రం రావటం దూరమవుతుందని చెప్పటం నిజంకాదు. అసలు స్వతంత్రం అంటే ఏమిటి? అది వచ్చిన తరువాత దేశపు స్వరూప స్వభావాలేమిటి? దీనిపై రాజకీయ నాయకులకే సమగ్రమైన అవగాహనలేదు. ఒక పెద్ద ఘనకార్యం సాధించడానికి చరఖా చాలా చిన్న సాధనం. చరఖాను భారతీయులందరూ ఎన్ని రోజులు తిప్పినా, ఎంత నూలు ఒడికినా, అది సొగసులో, నాణ్యతలో మిల్లు బట్టకు సరికాదు. దీనివల్ల వారి ఆదాయం కొంత పెంచుకోవచ్చు. అది అతిపేద దేశమైన మనకు ఎంత మాత్రమూ చాలదు.

"నాగలి దున్నే రైతు చరఖా తిప్పటం ఇష్టపడడు. బెంగాల్లో వరి పండించే రైతు ఖాళీ సమయంలో కాయగూరలు పండించడానికి ఇష్టపడడు. అటువంటప్పుడు చరఖా ఎందుకు తిప్పుతాడు. చాలా మంది గాంధీజీ చెప్పాడు కాబట్టి మారుమాట్లాడకుండా, ఆయనపై గౌరవంతో చరఖా తిప్పుతున్నారు తప్ప, ఇష్టపడి కాదు. వినటం వలన, చదవటం వలన కాక క్రియాత్మకంగా కృషి చేయటం వలన ఎక్కువ ఉపయోగముంటుంది. ప్రతి గ్రామం తమకు తాము స్వతంత్రించుకోవాలి. ఇలా ఒక్క గ్రామం చేస్తే చాలు. వాళ్లు వెలిగించిన దీపం నుంచి మరెన్నో దీపాలు వెలిగించవచ్చు. ఇలా ఒక జ్యోతినుంచి మరొక జ్యోతికి వచ్చే వెలుగువల్ల మన దేశమంతా ప్రకాశవంత మవుతుంది.

"హిందూ, ముస్లింలు తమ అంతరంగ వైషమ్యాలను పక్కన పెట్టి చేయి చేయికలపాలి. హిందువుల దృష్టిలో ముస్లింలు అపరిశుభ్రులు, వారి దృష్టిలో హిందువులు కాఫిర్లు. ఆంగ్లేయుల ప్రభావంతో ఆధునీకరణ చెందినా ముస్లిం చేతి వంటను నోటబెట్టని హిందువులు నాకు తెలుసు.

"స్వరాజ్యం రావాలంటే ముందుగా మనందరం మనస్సులో దానిని ఆకాక్షించాలి. దానికోసం నిరవధికంగా శ్రమించాలి. స్వతంత్రం సాధ్యమనే భావన కలగాలి. అప్పుడే అది సులభతరమవుతుంది తప్ప చరఖా వల్లా, ఖద్దరు వల్లా స్వాతంత్రం రాదు."

అవసరమనిపించినపుడు దేశ స్వాతంత్రం కోసం కవి కూడా కలాన్ని పక్కన పెట్టి కత్తి పట్టాలన్న గాంధీ హితోక్తితో రవీంద్రుడు విభేదించాడు. "కవిత్వమొక దైవకార్యంగా నేను భావిస్తాను. అది నా అంతఃకరణలో ఒక భాగం. దాని నుంచి నేను వేరు కాలేను. అది నా స్వధర్మం, స్వధర్మాన్ని వీడటమంటే నాకు నేను ఆత్మద్రోహం చేసుకోవటమే అవుతుంది."

హిందీని దేశ భాషగా పరిగణించాలన్న గాంధీ అభిప్రాయంతో రవీంద్రుడు కొంత వరకూ ఏకీభవిస్తూ, "దీనికి చాలా సమయం పడుతుంది. నెమ్మదిగా భారతదేశపు ప్రజలందరినీ దీనికి ఒప్పించాలి. ఆ తరువాతనే అది జాతీయ భాష కాగలదు. భారతీయులందరూ దీని నొక జాతీయ బాధ్యతగా తీసుకోవాలి" అని వక్కాణించారు.

రవీంద్రుని వ్యాసానికి ప్రత్యుత్తరంగా గాంధీజీ యంగ్ ఇండియా (నవంబరు, 1905) లో వ్రాస్తూ :

ఇది నా విధానాలపై ఒక నిరసన పత్రం. ఇందులో (చరఖా) ఆర్థికపరమైన అభివృద్ధి కొంతవరకైనా ఉందని రవీంద్రుడు అంగీకరించాడు. తన వ్యాసం నాకు రుచించక పోవచ్చునన్నాడు. ఏకీభవించకపోవటం తప్పుకాదు ప్రపంచంలో ఏ ఇద్దరూ, కవలలైనా కొన్ని విషయాలలో విభేదిస్తారు. అందులో తప్పులేదు. నిజాన్ని నిర్భయంగా చెప్పిన ఆ విధానం నాకు నచ్చింది.

"రవీంద్రుడు కవి. కవి తన భావనా ప్రపంచంలో సమ్రాట్. నాలో కవి లేదు, కవితాత్మకంగా ఒక్క వ్యాసం కూడా వ్రాయలేను. నేను ఎవరో తయారు చేసిన చరఖాకు ప్రాచుర్యం కల్పించదలిచాను. చరఖా రామాయణ కావ్యంలో సీత లాంటిది. అటువంటి సుకుమారిని పది తలలు రావణులైన జపాన్, ఫ్రెంచి, ఆంగ్లేయులు కబళింప చూస్తున్నారు. దానిని నేను సాగనివ్వను.

"రవీంద్రులు ఏనాడు యంగ్ ఇండియా చదివి ఉండక పోవచ్చు. రాజకీయం గురించి ఆయనకు తెలిసినది కచేరీ కబుర్ల నుంచి కావచ్చు. నేను ఎవరినీ స్వధర్మాన్ని విడవమని చెప్పలేదు. స్వధర్మాన్ని ఆచరిస్తూనే చరఖాను కూడా తిప్పి ఆర్థికంగా కుటుంబాన్ని ఆదుకోవచ్చని చెప్పాను. మనం ఆచరించే అన్ని వృత్తులలోనూ, ఒక అంతఃసూత్రం ఉంది. చరఖా, అన్ని వృత్తుల వారు చాలా సులువుగా నేర్చుకోవచ్చు. దీని ద్వారా ఒక రకమైన జాతీయ ఏకీకరణ సాధ్యమని నా నమ్మకం.

"తిండి, బట్ట, నిద్రలాంటివి మానవులందరికీ సమానంగా వర్తించే ధర్మాలు. మన గాలి మనం పీలుస్తున్నాం. మన తిండి మనం పండించుకుంటున్నాం. మన దుస్తులను మనం నేసుకోలేమా? బెంగాల్ వాసులు తమ దుస్తులను బొంబాయి నుంచి తెచ్చుకోవలసిన అవసరం లేదు. యంత్రాలు వుండవలసినదే కానీ అవి చేతి వృత్తులకు ఆటంకం కలిగించి నిరుద్యోగం పెంచరాదు. చేతి వృత్తుల నైపుణ్యాన్ని, ఫలాలను పెంచుతూ ఆసరాగా పనికి వచ్చే ఏ యంత్రాన్నయినా నేను ఆహ్వానిస్తాను.

"ఐరిష్ దేశం నుంచి తీసుకొని వచ్చిన సహకార సేద్య పద్ధతి మనకు పనికి రాకపోవచ్చు. ఇక్కడ ఒక్కరికి కొన్ని వందల ఎకరాలు ఉండవచ్చు. ఒకరికి ఒకటి, రెండు కంటే ఎక్కువ ఉండకపోవచ్చు. కానీ చరఖా తిప్పి నూలు వడకటంలో అంత పెద్ద వ్యత్యాసాలు వుండవు. కాబట్టి మనుష్యులో సహకార పద్ధతి సిద్ధాంతాన్ని దీని ద్వారా మార్గం సులభతరమవుతుంది.

"రవీంద్రుడు, నేను రామ్మోహన్‌రాయ్‌ని కురచ వ్యక్తిత్వం కలవాడుగా పేర్కొన్నాడన్నారు. అది నేనెప్పుడూ అనలేదు. ఆయనొక గొప్ప వ్యక్తి కానీ కటక్‌లో మాటలాడుతున్నపుడు ఆయన ఆంగ్ల వ్యామోహాన్ని మాత్రమే నేను తప్పు పట్టాను. కవుల దృష్టిలో కొన్ని విషయాలలో అతిశయోక్తులు స్వాభావికంగా వచ్చి చేరతాయి. కవి దృష్టినుంచి చరఖాను చూసి మోసపోవద్దు. చివరగా మా భావాలు వేరు" అని గాంధీ ప్రకటించారు. ఇద్దరి మధ్యా భిన్న భావాలు ఎంత తీవ్రంగా వున్నా వారు వాడిన భాష మాత్రం సరళంగా ఉండేది. ఈ రెండు భిన్న ప్రవంతుల మధ్య వారధిగా నిలిచాడు నెహ్రూ.

రవీంద్రుని 80వ పుట్టిన రోజుకు శుభాకాంక్షలు పంపుతూ గాంధీ "80, కాదు నూరు శరత్తులు జరుపుకోవా" లన్నాడు. దానికి రవీంద్రుడు సమాధాన మిస్తూ, "80 వరకు భరించాను. ఇంతకంటే భరించలే"నని సమాధాన మిచ్చాడు. రవీంద్రుడు ఆగస్టు 7, 1941న తన 81వయేట విశ్వభావనలో విలీనమైనాడు.

## విశాఖలో విశ్వకవి

1933లో విశాఖ 'కవితాసమితి' రెండు విశిష్ట కార్యక్రమాలను నిర్వహించింది. ఒకటి "ఆంధ్రకవుల ఛాయాచిత్ర ప్రదర్శనం." పురిపండా అప్పలస్వామి కార్యదర్శిగా ఉన్న 'కవితాసమితి' ఈ ఛాయాచిత్ర ప్రదర్శనకు శ్రీ అబ్బూరి రామకృష్ణారావు, శ్రీ తెన్నేటి విశ్వనాథం, శ్రీ భమిడిపాటి చిన యజ్ఞనారాయణ శర్మలతో ఉపసంఘం ఏర్పరిచింది. తెలుగు సాహిత్య చరిత్రలో ఆంధ్రకవుల ఛాయా చిత్ర ప్రదర్శనలు తొలిసారిగా ఏర్పాటు చేసిన ఖ్యాతి 'కవితాసమితి'కే దక్కింది.

'కవితాసమితి' నిర్వహించిన మరొక విశిష్ట కార్యక్రమం 'విశ్వకవి' రవీంద్రనాథ్ ఠాగూర్‌కి అభినందన కార్యక్రమం. ఆంధ్ర విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం సందర్భంగా ఠాగూర్‌ను ఆహ్వానించి "రెలిజియన్ ఆఫ్ మేన్" అనే అంశంపై ఉపన్యాసం ఏర్పరచారు. ఆ సందర్భంగా 'కవితాసమితి' వారిని ఆహ్వానించి సమావేశం ఏర్పాటు చేసింది. 10-2-1933 నాటి ఆ సమావేశంలో పురిపండా, మారేపల్లికవిగారు, తాపీధర్మారావు, శ్రీశ్రీ, శ్రీరంగం నారాయణబాబు, పూడిపెద్ది వెంకటరమణయ్య, గొబ్బూరు వేంకటనందరాఘవరావు, తెన్నేటి విశ్వనాథం మొదలగువారు పాల్గొన్నారు.

- రాయప్రోలు సుబ్బారావుగారు శాంతినికేతన్‌లో చదువుకున్నారు.
- రవీంద్రుని గీతాంజలిని చలం అనువదించారు.
- కొంగర జగ్గయ్య 'రవీంద్రగీత' కావ్యం రాశారు.
- రవీంద్రుని రచనలను తెలుగులోకి ఎక్కువగా అనువదించిన వారు శ్రీ బెజవాడ గోపాలరెడ్డి.
- "జనగణమన" గీతం రవీంద్రుడు మదనపల్లెలో వ్రాశాడు.
- సంజీవదేవ్ తన 16వ ఏట శాంతినికేతన్‌లో రవీంద్రునితో సంభాషించాడు.

**హైదరాబాదులో రవీంద్రభారతి:**

రవీంద్రుని 'శతజయంతి' సందర్భంగా శతజయంతి ఉత్సవ సంఘం వారు, హైదరాబాద్, మద్రాస్, బెంగుళూరు, ఢిల్లీ మొదలగు రాష్ట్రరాజధానుల్లో కళాప్రదర్శన కేంద్రాలు నిర్మించారు. ఆయా రాష్ట్రప్రభుత్వాలు స్థలం కేటాయించగా పైసంఘంవారు, తమ వనరులతో, ప్రత్యేక నమూనాలతో కళాకేంద్రాలను నిర్మించారు. వాటన్నిటికి 'రవీంద్రభారతి' అని పేరుపెట్టారు.

**- ద్వా.నా.**



దామెర్ల రామారావు

## తెలుగునాట ఆధునిక చిత్రకళకు

# దారి చూపిన దామెర్ల

- విప్పర్తి కలికావతారం

అప్పుడు ప్రకృతి పులకరించింది. మోడువారి – బీడుపడి మరుభూమివలెనున్న ఆంధ్రచిత్ర కళాక్షేత్రానికి వసంత సూచనలు పొడగట్టాయి. గౌతమీ తీరాన ఒక అపూర్వమైన దివ్యపుష్పం ఆవిర్భవించి సుందరతరమైన తన సుకుమార పత్రరేఖలను విప్పుకుంటూ నలుదెసలా పరిమళాన్ని వెదజల్లుతూంది. చిత్రకళాంబర ప్రాగ్దిశన భాస్కరుడు స్వర్ణ కాంతులలో ఉదయించాడు. పావన గోదావరి మహోత్సాహంతో పరుగు లెత్తింది.

దామెర్ల రామారావు 8 మార్చి 1897న రాజమండ్రిలో జన్మించాడు. తండ్రి వేంకటరామారావు, ఆయుర్వేద వైద్యులు, తల్లి లక్ష్మీదేవి.

చిన్నతనంలో చదువుపైనా, ఆటలపైనా శ్రద్ధ చూపే వాడు కాదు. సమయం దొరికినపుడల్లా ఏవేవో బొమ్మలు గీస్తుంటే వాడు. వాటిని మేనమామ గాడిచర్ల రామమూర్తికి చూపిస్తుండేవాడు. ఆయన నేషనల్ స్కూల్‌లో డ్రాయింగు మాష్టారు. రామారావుకు చిత్రాలు గీయటంలో మెలుకువలు చెబుతుండేవారు. 1908లో ఏ.ఎస్. రామ్ అనే బెంగుళూరు చిత్రకారుడు రాజమండ్రిలో జరగనున్న డ్రామాలకు నేపథ్య దృశ్యాల బొమ్మలు వేయడానికి వచ్చాడు. ఆయన చిత్రిస్తున్న పద్ధతిని ఎంతో దీక్షగా పరిశీలించే వాడు రామారావు.

1909లో రాజమండ్రిలో ప్రభుత్వం చిత్ర కళాశాల ను స్థాపించింది. రామారావు అన్న వెంకటరావు అక్కడ జూనియర్ లెక్చరర్‌గా పనిచేసేవాడు. కాలేజీ ప్రిన్సిపాలు ఓ.జె. కూల్డ్రేకి రామారావుని ఒక రోజున పరిచయం చేశాడు. కూల్డ్రే ఒక చిత్రకారుడు. చక్కని రచయిత. రామారావు గీసిన బొమ్మలను చూసి అతనిలో చక్కని కళ దాగి ఉన్నదని గ్రహించాడు. రోజూ సాయంత్రం రామారావును తన బంగళాకు పిలచి చిత్ర రచన సాధన చేయించేవాడు. రామారావుతో పాటు వరదా వెంకటరత్నం, భమిడిపాటి కామేశ్వరరావు, కవికొండల వెంకటరావు. అంకాల వెంకట సుబ్బారావు, అడవి బాపిరాజులకు చిత్రకళ, కవితా రచనలలో ప్రోత్సాహం యిస్తుండేవాడు కూల్డ్రే. సెలవు రోజుల్లో చుట్టుపట్ల గ్రామాలకు విద్యార్థులను తీసుకువెళ్లి చిత్ర రచన చేయిస్తుండేవాడు.

అజంతా, ఎల్లోరాల గుహలలో చక్కని కళ ఉందని రెండు వారాలపాటు శిష్యులను అక్కడికి తీసుకు వెళ్ళాడు కూల్డ్రే. గురువు, శిష్యులు ఎంతో శ్రద్ధగా అజంతా, ఎల్లోరా శిల్పాలను, చిత్రాలను చూసి ఎన్నో స్కెచ్‌లను గీశారు.

"నాకు తెలిసిన చిత్ర కళను నేర్పాను, కాని రామారావు యింకా ఎంతో నేర్చుకోవాల్సినది ఉన్నద"ని, బొంబాయిలోని జె.జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్సుకు పంపించాలని ప్రతిపాదన చేశాడు

విప్పర్తి కలికావతారం, సెల్ : 9848047227

కూల్డ్రే. రామారావు తలిదండ్రులు దానికి సుముఖంగా లేరు. వారిని ఒప్పించి, 1916లో రామారావును బొంబాయి పంపించే ఏర్పాట్లు చేశాడు. కూల్డ్రే తన మిత్రుడయిన జె.జె. స్కూల్ ప్రిన్సిపాల్ సిసిల్ బర్న్స్‌కు ఒక పరిచయలేఖ వ్రాశాడు. ఆయన రామారావు కూల్డ్రే మార్గదర్శనంలో వేసిన చిత్రాలను పరిశీలించాడు. "నీవు యిప్పటికే చాల నేర్చుకున్నావు కూల్డ్రే శిక్షణలో. నీ కాలం వృథాపర్చడం నాకిష్టం లేదు. ఇది 5 సంవత్సరాల కోర్సు. నిన్ను తిన్నగా 3వ సంవత్సరంలోకి చేర్చుకుంటున్నాను'' అని జె.జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చేర్చుకున్నారు.

రామారావు కేవలం స్కూలు శిక్షణతో తృప్తిపడలేదు. సమయం దొరికినపుడల్లా క్రాఫర్డ్ మార్కెట్, ఫ్లోరా ఫౌన్‌టేన్ వంటి ప్రదేశాలకు వెళ్ళి, స్కెచెస్ వేస్తుండేవాడు. డిగ్రీ కోర్సు పూర్తయినది. 'బెస్ట్ స్టూడెంట్'గా 'మాయో స్వర్ణపతకం'ను అందుకున్నాడు. మరో ఏడాది పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సు చేసి 1920లో జె.జె. స్కూల్‌ను వదిలాడు.

1919లో సత్యవాణితో వివాహం అయింది. అప్పటికి ఆమె వయస్సు 13 సం॥లు. సత్యవాణిని చిత్రకళకు పరిచయం చేశాడు రామారావు. సత్యవాణి కూడా చక్కని చిత్రకారిణి అయింది. రామారావు చిత్రాలు చాల వాటికి ఆమె మోడల్‌గా ఉండేది. రామారావు సోదరి బుచ్చి కృష్ణమ్మ కూడా అన్న నుండి చిత్రకళ నేర్చుకుని, చక్కని చిత్రకారిణి అయింది.



రామారావు దామేర్ల వేసిన టాగూర్ చిత్రం

జె.జె. స్కూల్ వదిలినాక రామారావు 6 నెలల పాటు గుజరాత్‌లో గడిపాడు. ఎన్నో ప్రదేశాలు తిరిగి పల్లె జీవనాన్ని ప్రతిబింబించే ఎన్నో చిత్రాలు వేశాడు. అహ్మదాబాద్‌లో తన చిత్రాలను ప్రదర్శించాడు. అది చక్కని ప్రజాదరణ పొందింది. భావనగర్ సంస్థానం, రాజ వంశీయులు చిత్రాలను వేయడానికి రామారావును ఆహ్వానించారు. అదే సమయంలో అక్కడ క్రొత్తగా నిర్మించిన 'దక్షిణామూర్తి విద్యాలయం'ని ప్రారంభించడానికి రవీంద్రనాథ్ ఠాగోర్ వచ్చారు. దర్బారులో కూర్చున్న ఠాగోర్ చిత్రాన్ని పెన్సిలుతో వేగంగా చిత్రం వేశాడు రామారావు. ఠాగోర్ దానిని చూసి ఆనందించి "ఈ చిత్రాన్ని నాకిస్తున్నావా?" అని అడిగారు. "దీనిని మీ శుభాకాంక్షలతో నాకిస్తే నాకు ఎంతో ఆనందం కలుగుతుంద"ని అన్నాడు రామారావు. ఠాగోర్ ఆ చిత్రంపై సంతకం చేసి రామారావుకు నవ్వుతూ యిచ్చారు.

1921లో కలకత్తాలోని 'సొసైటీ ఆఫ్ ఓరియంటల్ ఆర్ట్స్' నిర్వహించిన చిత్ర కళా ప్రదర్శనలో పాల్గొన్నాడు రామారావు. 'నందలాల్‌బోస్' వంటి ప్రముఖ చిత్రకారులతో పరిచయం కలిగింది. రామారావు చిత్రించిన 'ఋష్యశృంగ' చిత్రానికి 'వైస్‌రాయ్ బహుమతి'ని యిచ్చారు. వైస్‌రాయ్ లార్డ్ రీడింగ్స్ స్వయంగా ఆ ప్రదర్శనను తిలకించారు. రామారావు చిత్రం "తూర్పు కనుమల్లో గోదావరి"ని కొనుక్కొని ఒక చిన్న ఛలోక్తి విసిరాడు. "చూశారా! భారతదేశం విదేశీ వస్తువులను బహిష్కరిస్తున్న నేపథ్యంలో, బ్రిటిషు వాడినయిన నేను స్వదేశీ చిత్రాన్ని కొనుక్కున్నాను."

రామారావు తన నమ్మకాలను గట్టిగా పాటించే వాడు. జె.జె. స్కూల్‌లో చదివే రోజుల్లో విద్యార్థులను ఢిల్లీ యాత్రకు తీసుకు వెళ్ళారు. సెక్రటేరియట్ భవనాన్ని సర్ ఎడ్విన్ లట్యన్స్ అనే వాస్తు శిల్పి నిర్మిస్తున్న రోజులవి. నిర్మాణ వివరాలను దర్శించి లట్యన్స్‌ను కలుసుకునే ఏర్పాటు చేశారు. విద్యార్థులతో వెళ్ళిన ఉపాధ్యాయుడు, 'లట్యన్స్ దొరను చూడటానికి మీరందరు ప్యాంటు, కోటు వేసుకురావల'ని ఆదేశించాడు. రామారావు మాత్రం పంచె, కుర్తాలో వచ్చాడు. ఇదేమయ్యా అని ఉపాధ్యాయుడంటే "నాదగ్గర కోటు లేద"న్నాడు. "అయితే ఆయన నిన్ను చూడడు'' అని రామారావును బయట టాంగాలోనే వదిలి మిగతా విద్యార్థులను లోపలకు తీసుకువెళ్ళాడు. ఉపాధ్యాయుడు లట్యన్స్‌తో విద్యార్థులను పరిచయం చేశాడు. "మీలో రామారావు అనే విద్యార్థి ఉండాలి కదా ఏడీ?" అని అడిగాడు లట్యన్స్. ఉపాధ్యాయుడు గబాలున బయటకు వచ్చి టాంగాలో ఉన్న రామారావు లోపలకు తీసుకు వచ్చాడు. "ఏమి రామారావు! బయటే ఉన్నావ"ని లట్యన్స్ అడిగాడు. "నేను సరయిన డ్రస్‌లో లేను

రామారావుకు 1919వ సం॥లో సత్యవాణితో వివాహం జరిగింది. అప్పుడు ఆమెకు 12-13 సంవత్సరాల వయస్సు మాత్రమే. రామారావు ఎంతో క్రమశిక్షణగల వ్యక్తి. దుర్బలుడైన వాడు జీవితంలో ఏమీ సాధించలేడని నమ్మినవాడు. నిత్యమూ వ్యాయామం చేసేవాడు.



సత్యవాణి

వివాహం తరువాత ఎంతో ఉత్సాహంతో చిత్రాలను వేయడం మొదలుపెట్టాడు. ఒకవైపు కళాసాధన, మరొకవైపు శిక్షణా వ్యాసంగం సంతృప్తికరంగా సాగుతుండగా, భార్యతో వైవాహిక జీవితం మధురంగా అనుభవిస్తున్నాడు. సత్యవాణి అతనికి ఆదర్శస్త్రీ. ఆమెను రూపస్ఫూర్తిని పెన్సిల్‌తోనూ, రంగులలోనూ చిత్రించేవాడు. తన భావ చిత్రాల నాయికకు తన భార్యరూపమే ఇచ్చేవాడు. ఆ సమయంలోనే వారికి ఒక కొడుకు పుట్టాడు. రామారావు ఎంతో ఆనందంగా "నేను పరిపూర్ణ చిత్రకారుణ్ణి కాగలనో లేనో గానీ, నా పుత్రుడు మాత్రం సంపూర్ణ కళాకారుడు అవుతాడు. నాకీ ప్రసాదాన్నిచ్చినా పరమేశ్వరునికి కృతజ్ఞత తెలుపుకుంటున్నాను" అనేవాడు. విధి చూపు మరోవిధంగా వుంది. వారి దాంపత్యఫలం పిందెగానే రాలిపోయింది. ఆ దుఃఖాన్ని భరించేందుకు మరింతగా కళాసృష్టి చేశాడు రామారావు. దురదృష్టవశాత్తు రామారావు తన 29వ ఏటనే పంచభూతాలలో కలిసిపోగా, ఆయనతో కేవలం 4-5 సంవత్సరాలు కాపురం చేసిన సత్యవాణి 80 ఏళ్ళపైగా జీవించి భాగ్యనగరంలోనే తుదిశ్వాస విడిచింది.

కదండి" అని జవాబిచ్చాడు రామారావు. 'నీ డ్రస్ కేమి? చక్కని జాతీయ పద్ధతిలోనే ఉంది. కదా!' అని అన్నాడు లట్యన్స్. తర్వాత "పార్లమెంటు భవనం పూర్తయ్యాక నీవు మ్యూరల్స్ వేయటానికి తప్పక రావాలి" అన్నాడు.

రామారావు చిత్ర కళాశైలి ఒక ప్రత్యేకమైనది. ఒక రకంగా, పాశ్చాత్య శైలి, భారతీయ శైలిల మధ్య వారధి అనవచ్చు. చిత్రాల అందం మాత్రం పూర్తి భారతీయ శైలి. మనసులో నిలచి ఉన్న చిత్రాలను ఊహించి వేసేవాడు కాదు. కళ్ళతో చూస్తూ వాస్తవ చిత్రాలను చేసే పద్ధతికి ప్రాధాన్యత యిచ్చే వాడు. ఆయన పెన్సిల్‌తో వేసిన చిత్రాలు జీవం ఉట్టిపడుతూ ఉంటాయి. ఉదాహరణకు భావనగర్ సితార్ విద్వాంసుడు 'అబ్దుల్ రహమాన్ ఖాన్' చిత్రం. రామారావు చిత్రాలు చాల వరకు నీటి వర్ణాలతో వేసినవి. తైలవర్ణ చిత్రాలు తక్కువ వేశాడు. 'విష్ణు ప్రియ' ఒక చక్కని చిత్రం. చిత్రాన్ని వేసేముందు ఎన్నో వాస్తవ చిత్రాలను పెన్సిల్‌తో వేసి, వాటిని మేళవించి చిత్రాన్ని వేసేవాడు. ఉదాహరణకు "పుష్పాలంకరణ' (రెండవ అట్ట) చిత్రం వేయడానికి పదికి పైగా చిత్రణలను వేసి, పెద్ద చిత్రాన్ని కూర్పు చేశాడు.

1922-1925 సం॥ల మధ్య గడచిన, ఈ మూడు సంవత్సరాలు రామారావు జీవితంలో స్వర్ణ కాలం అని చెప్పవచ్చు. రామారావు యిల్లు ఒక చిన్న చిత్రకళాశాలలా ఉండేది. రాజమండ్రిలో 'ఆంధ్ర సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆర్ట్స్'ను స్థాపించాడు. సోదరి బుచ్చి కృష్ణమ్మ, వరదా వేంకటరత్నం, చామకూర సత్యనారాయణ సహచరులుగా ఉండి, ఈ సంస్థను చక్కగా నడిపాడు. కేవలం రాష్ట్రంలోనే గాక, దేశ విదేశాలలో కూడా రామారావు చిత్రకళా వైభవం ప్రయాణం చేసింది.

1923-24లో రామారావు చిత్రాలు కొన్ని ఇంగ్లండ్‌లోని వెంబ్లేలో జరిగిన ఆంగ్ల రాచరికపు ప్రదర్శన శాలలో ప్రదర్శించబడ్డాయి. తర్వాత వాటిని టోరాంటోలో జరిగిన 'కెనడా జాతీయ ప్రదర్శన'లో ప్రదర్శించారు.

చేతిలో చేయవలసినవి ఎంతో ఉంది. ఎన్నో ఊహలు, భావాలూ వెన్నాడుతున్నాయి. ఎప్పటి కవుతుంది. యీ పని? అనే ఆందోళన కాలం చాలటంలేదే అనే ఆతృతలో క్షణం వ్యర్థ చేయకుండా సాధన చేస్తున్నాడు.

"అతను మిత భాషి. అతన్ని సంభాషణలోకి దింపడం నాకు సాధ్యమయ్యేదిగాదు. మేడపై అంతస్తులోనున్న అతని స్టూడియోలో అనేక చిత్రాల మధ్య కూర్చుని నాకు వాటిని చూపిస్తూ యిదే నా ప్రపంచం అనేవాడు'' అంటాడు హరీంద్రనాథ్. ఆనాటి స్మృతులను తలుచుకుంటూ, ఇంటివద్ద నిరంతర కృషి సాగిస్తూనే దృశ్య చిత్రాలకు బాహ్య ప్రదేశాలకు




భావనగర్
యువరాజు

వెళ్తుండేవాడు. ఒక్కొక్కసారి బొమ్మూరు కొండలపై రాత్రుళ్ళు కూడా గడిపి వెన్నెల్లో ప్రకృతిని చిత్రించేవాడు.

"పైగా ఎవరైనా నీవు విదేశాలకు వెళ్ళి మరింతగా రాణించవచ్చుని" సలహా ఇస్తే "ఏ యూరోపియన్ చిత్రకారుడు దేశం వదిలి ప్రసిద్ధుడైనాడు?" అని తోసిపుచ్చాడు. మళ్ళీ ఇంకా "నా చిత్రాలను చూడటానికి వారినే ఇక్కడకు రప్పిస్తాను" అని ఆత్మవిశ్వాసంతో అనేవాడు.

1924 డిసెంబర్ గడుస్తూంది. అంతవరకు చేసిన కృషి సమీక్షించి నూతన సంవత్సర కార్యక్రమం నిర్ణయం చేసుకున్నాడు.

1925వ సం॥వం జనవరిలో రామారావు తిరుపతి పయనమైనాడు. వెంట తన రచనా సామాగ్రి తీసుకుని నల్లమలకొండలు - అడవులు - ఆ ప్రకృతి శోభకు పులకరించిన రామారావు అనేక స్కెచ్‌లు వేసుకున్నాడు. తిరుమలపై స్వామి పుష్కరిణి - ఆ దేవాలయ స్థంభాలూ శిల్పాలు పరిసర దృశ్యాలతో వొక పెద్ద స్కెచ్ బుక్కే నిండిపోయింది. ఆలోచనా తరంగిత మానసంలో నిర్దేశితమైన భావి కార్యక్రమ పరిపూర్తికై భావనా స్రవంతిలో వోలలాడుతూ తిరుపతినుండి తిరుగు ప్రయాణం చేశాడు. రాజమంద్రికి. బెజవాడ సమీపిస్తుండగానే స్వల్పంగా జ్వరం తగిలింది. ఆ జ్వరమే రాజమంద్రి చేరేసరికి మశూచిగా పరిణమించింది. రామారావు నిర్వేదంతో కృంగిపోయాడు. నియమబద్ధ జీవనం చేస్తున్న తనలాంటి, సౌందర్యారాధకుడికి భయంకర మహమ్మారా? ఉపశమించినా పర్యవసానం ఎలా ఉంటుందో? అయితే ఆ మహామ్మారి తిరుగు ముఖం పట్టలేదు. తన జీవిత చరమాంకం సమీపించిందని గ్రహించాడు. తన ఆశయాలు, ధ్యేయం నెరవేరలేదు. తను కన్న మధుర స్వప్నాలు ఫలించలేదు. తన సహచరిణికి పదహారేండ్లు అయినా నిండలేదు. ఎన్నో ఆశలు నిరాశలైపోతున్నాయి. చెంతనే దీన వదనుడై కూర్చున్న సోదరుడు వెంకట్రావుతో "అన్నా! నే నిక జీవించనా? ఎవరూ నన్ను బ్రతికించలేరా?" అని వేదనా భరిత హృదయంతో ప్రశ్నించాడు. విధి నిర్ణయం ఎవరేం చేయగలరు?

విధి వంచితుడై - 1925 వ సం॥రం ఫిబ్రవరి 6వ తేదీని - నిండు యవ్వనంలో - 28 ఏండ్లు నిండకనే సిద్ధహస్తుడు దామెర్ల రామారావు పరలోక గతుడైనాడు. ఆయన మరణవార్త విని ఆయన మిత్రుడు ప్రముఖ బెంగాలీ రచయిత హరీంద్రనాథ్ చట్టోపాధ్యాయ ఇలా అన్నాడు:

*"దివ్యామృత చిత్రాలు సృష్టించిన*
*తూలిక ఇక కదలదా?*
*అయ్యో ఏదోమాయ బాణం గుచ్చినట్లు ఆ కనులు -*
*ఒకప్పుడు సృష్టి సౌందర్యాన్ని ఆస్వాదించి*
*తన కనురెప్పల చాటునుంచి అపూర్వ కళనందించిన*
*ఆ కనులు - ఇక తెరచుకోవా?*
*ఆయన గుండె చప్పుడు ఇప్పుడు బాధామయ నిశ్శబ్దంగా*
*ఏ దూర తారనో - ఏ గులాబి రంగులోనో చేరిందా?*
*హుష్! అశ్రువులు రాల్చకండి.*
*ఇప్పుడు ఆయన అనంత స్వప్న వీధిలో ఒక రంగుల కల*
*ఒక కాంతిరేఖ - విశ్వభాషకు మరణ మేమిటి?*
*మనకోసం అమృతకాంతి ధారలు నింపి దివ్య చిత్రాలు*
*సృష్టించిన ఆయనకు మరణ మేమిటి?*
*ఏకాంతంగా తన గుండె లోతుల వెలుగు నీడల్ని*
*నిశ్శబ్ద స్వప్న ధూళిగా ప్రపంచానికద్దిన*
*ఆయన అమర సృష్టికి మరణమేమిటి?*
*వద్దు - దుఃఖించకండి.*[1]

1. హరీంద్రనాథ్ ఆంగ్లానికి భావానువాదం : అశ్వినీకుమార్

రామారావు చిత్రించిన కళా ఖండాలను, రాజమండ్రిలో 'దామెర్ల రామారావు మెమోరియల్ ఆర్ట్ గ్యాలరీ'లో భద్రపరిచారు. ఈ గ్యాలరీని శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రారంభం చేశారు. గ్యాలరీ నిర్మాణం జరుగుతున్న సమయంలో మహాత్మాగాంధీ దర్శించడం జరిగింది.

రాజమహేంద్రవరంలోని రామరాయ స్మారక కళామందిరంలో నొకనిలువెత్తు ధవళ వర్ణ చిత్రమొకటి ఉంది. రామారావు బొంబాయిలోని స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతున్న ప్రారంభ దినాల్లో అత్యంత ప్రతిభావంతంగా ఇటాలియన్ పునర్వికాస కాలపు శైలిలో చిత్రించిన యీ చిత్రం పేరు "మృత్యుదేవత."

అది హేమంత సంధ్యాసమయం దయావిహీన – కర్కశ హృదయ, అంధురాలైన మృత్యువు, శ్మశాన ప్రాంగణంలో – తన రెండు చేతుల్లోనూ నిర్జీవమైన కళేబరాల్ని ధరించి – క్రూర దరహాసంతో నిలుచుని ఉంటుందా చిత్రంలో. సూర్యాస్తమయ అరుణవర్ణపు అంబరం – మోడువారిన చెట్లపై నిరీక్షిస్తున్న రాబందులు నేపథ్యంలో చిత్రతమైనాయి. సృష్టిలో ప్రతీ జీవిని విచక్షణా రహితంగా వయస్సు, సంపద, ప్రజ్ఞ కీర్తి వేటినీ లెక్కచేయకుండా నిర్దాక్షిణ్యంగా తన కరాళ హస్తాన్ని ఏ విధంగా సారిస్తుందో చూపబడినగొప్ప ప్రతీకవాద చిత్రమిది.

చిత్రం! చిత్రంగానే ఆ చిత్రాన్ని సృష్టించిన కర్తనూ – ఆంధ్రచిత్ర కళకు భవ్య భావిని వాగ్దానం చేసిన సిద్ధహస్తుడ్ని, కళాసాధనలో కీర్తి శిఖరాల్ని అధిరోహిస్తున్న – అత్యంత ప్రతిభావంతుడ్ని – లేప్రాయంలోనే తన పొట్టన బెట్టుకుంది మృత్యువు.

దామెర్ల రామారావు జీవించినది అతి స్వల్పమైన కాలం. గట్టిగా చేసిన కృషి బొంబాయి వదలి స్థిరపడిన తరువాత రాజమండ్రిలో జీవించినది మూడేండ్లు మాత్రమే ఈ స్వల్పకాలంలో అతను చేసిన సాధన, వెలయించిన కృతులు పరికిస్తే ఒక వ్యక్తి జీవితకాలంలో ఇది సాధ్యమా అనిపిస్తుంది.

అనేక చిత్రాలు ప్రదర్శనలో బయట అమ్మగా – ఇతరులకు బహుమతి ఇవ్వగా కొన్ని చెదిరిపోగా మిగిలిన చిత్రాలు – 34 తైల వర్ణాల్లో – 129 నీటిరంగుల్లో – 250 పెన్సిల్ స్కెచ్‌లో ఇంకా 28 స్కెచ్ బుక్కులు – ట్రేసులు



**ఓ.జె. కూల్డ్రే**

రాజమండ్రిలోని దామెర్ల రామరావు ప్రభుత్వ ఆర్ట్ గేలరీలో పదిలపరచబడి యున్నాయి.

తనను మృత్యువు తరుముతుందా అన్నట్లుగానే జీవించిన స్వల్ప కాలంలోనే పుంఖానుపుంఖంగా చిత్రరచన సాగించి – తన ఆశయాలు – మధుర స్వప్నాలు – ఫలించకనే లక్ష్యసాధన నెరవేరకనే అకాల మృత్యువాత బడ్డాడు – కళాతపస్వి – యశస్వి దామెర్ల రామారావు.

**మృదుల సుమవల్లి పొదలియు బొదలకుండ**
**దొగరు చిగురాకు తోచియు దోపకుండ**
**దొడగు నునుమొగ్గ తొడిగియు దొడగకుండ**
**సురుచిర సుమంబు విరిసియు విరియకుండ**
**బూవ పిందియు పుట్టియు బుట్టకుండ**
**మధుర మాసంబునే గ్రీష్మంబుదోవ**
**దాకు వడగాలి చేత నా తపము చేత**
**గాలి వశమున వసివాడి తూలిపోయె"**

*– శ్రీ వేంకట పార్వతీశ కవులు*

### దామెర్ల రామారావు సృష్టించిన కళా ఖండాలు :

'బావి చెంత', 'కుంజవనం,' 'గొల్లభామలు'
'ఋష్య శృంగ బంధనం', 'తూర్పు కనుమలలో గోదావరి'
'గోదావరి సౌందర్యం', 'సిద్ధార్థ రాగోదయం'
'కృష్ణ లీలలు', 'అజంతా విహార్',
'కపోతాలు', 'నందిపూజ', 'రామ వివసం'
'కైకేయి దురాలోచన', 'కార్తీక పౌర్ణమి'
'పుష్పాలంకారం', 'గ్రీష్మ చంద్రుడు'
ఎన్నో అనాచ్ఛాదిత అచ్చరల చిత్రాలను సృజించారు.
అందులో విశిష్టమైనది 'అమాయిక'.
'అర్జున ఊర్వశి,' 'ద్రోణాచార్య అభిమన్య పతనం' లాంటి
పౌరాణిక వస్తు చిత్రాలు ఉన్నాయి. ఇవేకాక మరెన్నో
అమర చిత్రాలను మనకందించారు.
రామారావు మొదలు పెట్టిన 'ఆంధ్రశైలి'కి పరిపూర్ణత
రాకమునుపే ఆయన తనువు చాలించారు.



భావనగర్ సితార వాద్యుడు, *అబ్దుర్ రహమాన్ ఖాన్*

## దామెర్ల శైలి

దామెర్ల రామారావు నిస్సందేహంగా ప్రథమశ్రేణికి చెందిన చిత్రకారుడు. అతని చిత్రాలు ఏ శైలికి చెందుతాయి? రామారావు చిత్రకళను అభ్యసించే సమయమొక సంధియుగం. భారతదేశం స్వతంత్రదేశం కాదు. అది బ్రిటిష్ పాలిత దేశం. ప్రజలు భారతీయులు, పాలకులు ఆంగ్లేయులు. ఎవరి జీవన విధానాలు వాళ్ళకు వున్నాయి. ఆ రోజుల్లో స్వాతంత్ర ఉద్యమం ముమ్మరంగా సాగుతుంది. దానిని ముందుకు నడిపించే నాయకులు, 'జాతీయత' అనే భావాన్ని ప్రజల్లో రగిలించారు. దాన్ని ఊతంగా తీసుకొని స్వాతంత్ర్య నడకసాగింది. మా సంస్కృతి, మా మతం, మా ఆచార్య వ్యవహారాలు అంటూ ప్రజలు కొత్త నినాదాన్ని ఎత్తుకున్నారు.

అలానే చిత్రకారులు బొంబాయి, బెంగాల్ స్కూలుగా రెండుగా విడిపోయారు.

మొదటిదైన పాశ్చాత్య శైలి యధాతథ వాస్తవ చిత్రీకరణకు చెందినది. ఇవి ఆయిల్ పెయింటింగ్స్‌గా కాన్వాస్ గుడ్డపై వేయబడ్డ చిత్రాలు. ఇవి పరిణామంలో పెద్దవి. ఈ చిత్రాలు వేయాలంటే చిత్రకారుని ముందు ఏదో ఒక సజీవ, నిర్జీవ వస్తువో మోడల్‌గా ఉండితీరాలి. మోడల్ లేకుండా ఇలాంటి చిత్రాలు వేయటం సాధ్యం కాదు. భారతీయులు ఈ శైలి పట్ల ఎక్కువగా ఆకర్షితులు కావడానికి ముఖ్య కారకుడు రాజారవివర్మ. భారత పురాణ గాథలను తను భారతీయకట్టు, బొట్టుతో చిత్రాలుగా మలచి అద్వితీయమైన నైపుణ్యంతో రాజు, పేదా అని తేడా లేకుండా దేశంలో అందరినీ ఆకర్షించారు.

రెండవది, దీన్ని నిరసిస్తూ వచ్చిన బెంగాల్ శైలి. ఇందులో చిత్రాలు కాగితంపై వేయబడ్డ జలవర్ణ చిత్రాలు. ఇందులో వాస్తవ వాదానికంటే భావవాదమే ముఖ్యం. ఇందులో చిత్రించబడే వ్యక్తులు, వ్యక్తీకరణలు లలిత కోమలంగా వుంటాయి. ప్రాచీన అజంతా కుడ్య చిత్రాలు, జనపద శైలుల మిశ్రమంగా బెంగాలీలు సృష్టించిన ఒక నవ్య భారత శైలిది. ఈ చిత్రాలు పరిమాణంలో చిన్నవి.

ఇక రామారావు విషయానికొస్తే అతను ముందుగా కూల్డ్రే వద్ద పాశ్చాత్య శైలిలోనే చిత్రకళను నేర్చుకున్నాడు. ఆ తరువాత రామారావు బొంబాయిలో అభ్యసించిన విద్య, ఈ శైలికి



ఆలోచనలో కైకేయి

కొనసాగింపే. అతను వేసుకున్న చిత్తు ప్రతులను చూపినపుడు మనకా విషయం బోధ పడుతాయి. ఇంత వరకూ ఎటువంటి అస్పష్టతా లేదు. తరువాత కాలంలో ముఖ్యంగా 1922 తరువాత ఆయిల్ మీడియాను పక్కకు పెట్టి జలవర్ణ చిత్రాలను వేశాడు. అలా వేసినపుడు తన చిత్రాలలో పాశ్చాత్య వాస్తవ ధోరణిని తగ్గిస్తూ లోతుపై (3rd Dimension) దృష్టిని నిలపలేదు. చిత్రాలు ఎక్కువగా ఫ్లాట్ గానే ఉంటాయి. అతని చిత్రాలకు మోడల్ ఉన్నా యధాతథంగా కాక కొంత కల్పన చేస్తూ లలితంగా చిత్రించాడు. ఇదే అతని ప్రత్యేకత.

ఒక చిత్రకారుని శైలిని నిర్ణయించేటపుడు అతని యొక్క రేఖలను, రంగులనే కాక మొత్తం చిత్రం యొక్క కంపోజిషన్ కూడా తీసుకోవలసి వుంటుంది. ఆ విధంగా చూసినపుడు రామారావు వేసిన చిత్రాలలో బృంద చిత్రాలు (group composition) ఎక్కువ. కొన్ని చిత్రాలలో 15 మంది వరకూ చిత్రించబడ్డారు. ఇటువంటి చిత్రాలలో సెంట్రల్ ఫోకస్ అంటూ ప్రత్యేకించి వుండదు. వ్యక్తులందరూ కాన్వాస్ అంతా విస్తృతంగా చిత్రించబడతారు.

ఇది 1850 సంవత్సరంలో ఇంగ్లండ్ దేశంలో రాఫెల్ స్థిరపరిచిన నియమాలను ఉల్లంఘిస్తూ అప్పటి యువతరానికి చెందిన మిలేస్ స్థాపించిన 'ప్రీ రాఫిలిజం' అన్న శైలికి చెందినది. రామారావుది ఈ శైలేనని ఆ కాలంలోనే నిర్ణయించబడింది. అతని రేఖలలోని బెంగాలు లాలిత్యం, రంగులలోని లేత దనంతో దీనిని ఒక ప్రత్యేక శైలిగా భావించవలసి ఉంటుంది.

ఒక్కమాటలో చెప్పాలంటే దానిని దామెర్లవారి శైలి అనాలి.

*ఈ రచనకు సహకరించిన*
*శీలా వీర్రాజు,*
*కాండ్రేగుల నాగేశ్వరరావుగార్లకు ధన్యవాదాలు*
*- 'మిసిమి'*

మి



# నా రచనలే నా స్థితికి ప్రతిబింబం

- కొలకలూరి ఇనాక్

'పరిణతవాణి' ఒక విశిష్టమైన ప్రసంగ పరంపర. 'ఆంధ్రసారస్వత పరిషత్తు' ఆంధ్రదేశంలోని అరవై అయిదేండ్లు పైబడిన ప్రముఖులను ఆహ్వానించి, సాహితీ వేత్తలతో వారికి ఉన్న పరిచయం, ఉద్యమాలతో గల సంబంధం. సాంస్కృతిక భాషా రంగాల్లో వారు చేసిన కృషిని గురించి ఆత్మకథా ప్రసంగాలను చేయించారు. ఆయా ప్రసంగ కర్తల అంతర్మథనం – జీవనయానంలోని కొన్ని కోణాలను మనం దర్శించే అవకాశం కలిగించారు.

కవిగా, కథకునిగా వ్యాసకర్తగా పరిశోధకునిగా వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఖ్యాతిగాంచిన ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారి ప్రసంగంలో కొన్ని భాగాలను ఆంధ్రసారస్వత పరిషత్తు వారి సౌజన్యంతో, సి.పి. బ్రౌన్ అకాడెమి వారి విశిష్ట పురస్కారం లభించిన సందర్భంగా అందిస్తున్నాము.

నా మొదటి కథ 'ఉత్తరం' 1954లో, మునసబు కొడితే చనిపోయిన మా తాతను గూర్చి వచ్చిన ఉత్తరం ఆధారంగా రాసిన కథ. 'గాసట బీసటగానున్న భాషకు దారి చూపిన మహోద్ధారులేరి?' పద్యం 1954. ఇప్పుడు దొరకటం లేదు. సీసపద్యం, ఐదు పద్యాలు. ఇంటర్ మీడియేట్, ఏ.సి. కాలేజి మేగజైను దొరికితే బాగుణ్ణు.

మూడో తరగతి చదువు. సంవత్సరం గొడ్లకాడ జీతం. స్వాతంత్ర్యం రాకపూర్వం చదువు మానేశాను, వస్తుండగానే స్కూల్లో చేరాను. 1954 స్కూలు ఫైనల్. 1956 ఇంటర్. 1959 ఆనర్సు. జూన్‌లో లెక్చరరు, ఇంకా ఇరవై ఏళ్లు నిండలేదు.

ఎంట్రన్సు పరీక్ష మొదటి రోజు బాగా రాశాను. పాసయితే ఫస్టు ఫారంలో చేరవచ్చు. రెండో రోజు పరీక్షకు పోవాలి. రైలులో ప్రయాణం టికెట్టు లేదు. స్క్వాడ్ వచ్చింది. టికెట్టుకు డబ్బులేదు. రైలు వెళ్లిపోయింది. రైలు కట్ట పట్టుకొని, ఉదయం ఏడింటికి పరుగు తీశాను. ఎనిమిది మైళ్లు ఎనిమిదేళ్ల వాణ్ణి గుంటూరు స్టేషన్ దాకా రైలు కట్టతోవ, స్టేషన్ నుంచి రోడ్డు తోవ తెలుసు. ఫస్టు బెల్‌కి స్కూలుకు చేరాను. 'వచ్చేవంటరా' అని సారు వాటేసుకొని 'ఎట్టా వచ్చావురా' అన్నాడు. నా రూం నాకు తెలుసు నిన్నటిదే. బోర్డు మీద సారు లెక్కల ప్రశ్నలు వ్రాస్తున్నారు. కూర్చున్నాను.

నేను ఫోర్తు ఫారం పాసయినప్పుడు మానాన్న చనిపోయాడు. నేను, అమ్మ, తమ్ముడు, మా మధ్య నాలుగేళ్లు ఎడం. అమ్మకు ముప్పై ఏళ్లు లేవు. మా కోసం మళ్లీ పెళ్లి చేసుకోలేదు. కష్టజీవి. కూలీ నాలీ జీవనం. పిల్లలు చదవాలి. ఉద్యోగాలు చేయాలి. అదీ ఆమె పట్టుదల. ఆమె మమ్మల్ని అన్నం వడ్డించి పెంచలేదు. పట్టుదల వడ్డించి పెంచింది. ఆమె పిల్లల పెరుగుదల, పిల్లల పిల్లల పెరుగుదల చూచింది. తృప్తిగా జీవించింది. కష్టాలు ఆమె నేమీ చేయలేదు. ఆమె పట్టుదల ముందు మేం ప్రణమిల్లాం.

వేజండ్ల గుంటూరు స్కూలుకు రాకపోకలు. జంపన, కొవ్వలి నవలలు రైల్లో అమ్మే అన్న చదువు కోవడానికి ఒకటి ఇచ్చేవాడు. వాళ్ళ నవలలన్నీ చదివేశాను. అన్నదాసు జాషువా పద్యాలు పాడుతూ, పుస్తకాలు అమ్ముతూ రైల్లో వస్తూ పోతూ ఉండేవాడు. పద్యం అద్భుతంగా పాడేవాడు. క్లాసు పుస్తకాల పద్యాలకు అర్థతాత్పర్యాలు కావాలి. జాషువా పద్యాలకు అదేం

అక్కరలేదు. అర్థమయ్యేవి. ఇంటర్‌లో మనుచరిత్ర, వసుచరిత్ర కొంత తెలిశాయి. ఆముక్తమాల్యద అంతా తెలియలేదు. యెంకి పాటలు, కృష్ణ పక్షం, బసవరాజు అప్పారావు గీతాలు, పేర్లు తెలియని పెద్దవాళ్ల పుస్తకాలు చాలా చదివాను. తిమ్మిరిగా ఉండేది. విశాలాంధ్ర పుస్తకాల జోరు పెరిగింది. కనపడ్డదల్లా చదివాను. మహాప్రస్థానం తీవ్రంగా చదివాను. తిక్కబుట్టింది.

ఆనర్సు చదువుతున్నప్పుడు (1956-59) ఊపిరి ఆడుతున్నట్లుండేది కాదు. గుండెలు పట్టేసేది. 'మీ కెందుకోయ్ తెలుగు?' అనే వాడొక మేష్టరు, 'ఈ నక్కా' అని మరో సారు పిలిచేవాడు. క్లాసురూం సొంతంలా అనిపించేది కాదు. అయ్యవార్లు పరాయి వాళ్లులాగా ఉండేవాళ్లు. ఆరోగ్యమయిన శరీరం. వయస్సు పెరుగుతూ ఉంది. ఆకర్షణలూ పెరగ సాగాయి. స్నేహాలు, ప్రేమలు, విరహాలగోల కూడా మొదలైంది.

ఆ రోజుల్లో లైబ్రరీలో ఒక అమ్మాయి. ఎవరో తెలియదు, చాలా అందంగా ఉంది. దీక్షగా చదువుకొంటూ ఉంది. ఎదురుగా కూర్చున్నాను. నేను చదవటం లేదు ఆమెనే చూస్తూ ఉన్నాను. మంచి రంగు, మంచి మెరుపు, మంచి పొందిక, కళ్ల జోడు, షోడాబుడ్డి గ్లాసులు, చాలామందం. గుండె కలుక్కుమంది. ఆమె నన్ను చూడలేదు. ఇంత అందమైన అమ్మాయికి చూపు పోతే పెళ్ళవుతుందా? ఇదీ బాధ. వారం రోజులు ఇదే గుర్రు. అదే ఆలోచన నాటికగా మారింది. నా మొదటి నాటిక 'దృష్టి' (1957). ఆలిండియా రేడియో భారతీయ భాషల్లో యూనివర్సిటీ విద్యార్థులకు గంట నాటిక రచన పోటీ ప్రకటించింది. 'దృష్టి' పంపాను. తెలుగులో ఒక ద్వితీయ బహుమతి, ఒక తృతీయ బహుమతి వచ్చాయి. నాకు ద్వితీయ బహుమతి, మొత్తం 5 ప్రథమ, 8 ద్వితీయ, 16 తృతీయ బహుమతులు భారతీయ భాషలన్నింటికి కలిపి ప్రకటించారు. స్థానం నరసింహారావు గారు దర్శకత్వం. బుచ్చిబాబు గారు నిర్వహణ. దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు నా అయిదు నిమిషాల ప్రసంగానికి - రేడియోలో మొదటి ప్రసంగం - గొంతులేని తాను నాకు గొంతిచ్చారు. నాటికలో తురగా జానకీరాణి గారు హేమలత పాత్రధారిణి. నాటినుంచి నేటిదాకా ఆత్మీయురాలు.

పిల్లలకు పాలు లేకుండా నువ్వు తాగుతున్నావా అని అడిగినవాళ్లు లేకపోలేదు. శృంగారం ప్రేమ, విరహం జీవితంలో ఏమో కాని సాహిత్యంలోకి నేను తేలేక పోయాను. నా కన్నీళ్లకే సమయం చాలకుండా వచ్చింది. ఇంక శృంగారం ఎక్కడ? జీవనం దుఃఖమే. శృంగారం కాదు.

నా భార్య శ్రీమతి భాగీరథిగారు అద్భుతమైన స్త్రీమూర్తి. అంతటి ఉదాత్తమూర్తి నన్ను కోరుకోవటం నా అదృష్టం. ఆమె నా నలుగురు పిల్లలకే కాదు, నాకూ తల్లి. మౌనం ఆమె వ్యక్తిత్వం. మౌనమహర్షి. ఏది అడిగినా అవును తప్ప మరో మాట లేదు. నవ్వు తప్ప కన్నీరు కనబడనీయలేదు. దౌర్జన్య పరుణ్ణయిన నాకు భార్యగా ఉండటమే ఎక్కువ. నలుగురు పిల్లల్ని పెంచటం కష్టం. నన్ను నా యిష్టం వచ్చిన పనిచేయ నీయటం అందరికీ చేతకాదు. అన్నింటితో పాటు జిల్లా స్త్రీ శిశుసంక్షేమ శాఖాధికారిణిగా ప్రేమ పంచి ప్రేమను పొందా రామె. ఇన్ని పనులు చేస్తూ అలసిపోయేది కాదు. అలా కనిపించేది కాదు. ఆమె నవ్వు చెదిరేది కాదు. జీతం అంతా నాకు ఇచ్చేసేది. వద్దన్నా ఇచ్చేది. పైన ఉంచుకొనేది కాదు. ఇప్పుడు ఒంటరివాణ్ణి చేసింది. స్వర్గంలో ఉంది. మధురమైన జ్ఞాపకాలు కన్నీరు తెప్పిస్తాయి. కన్నీటి మసకలో కూడా ఆమెరూపం, హృదయం దయ, ప్రేమ మసకబారి పోవు.

మాకు నలుగురు పిల్లలు. బెంగుళూరు విశ్వ విద్యాలయంలో పెద్దతల్లి ఆశాజ్యోతి అసోసియేట్ ప్రొఫెసరు. భర్త ప్రొఫెసరు. ఇద్దరు పిల్లలు. సొంతయిల్లు. రెండో సంతానం కొడుకు శ్రీ కిరణ్. విశాఖ స్టీలు ప్లాంటు హైదరాబాదు ఆఫీసులో ఉన్నతోద్యోగి. భార్య డి.యల్. ఆర్.ఎల్.లో సైంటిస్టు - ఇద్దరు పిల్లలు. సొంతయిల్లు. నాకు వాళ్లే పెంపుడు తల్లి దండ్రులు. రెండో తల్లి మధుజ్యోతి. మహిళా విశ్వవిద్యాలయంలో అసోసియేటు ప్రొఫెసరు. అల్లుడు సీనియర్ లెక్చరరు. ఇద్దరు పిల్లలు. సొంతయిల్లు. చివరివాడు ముద్దుల తండ్రి సుమకిరణ్ శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో, భార్య యూనివర్సిటీ ఇంజనీరింగు కాలేజీలో ఉపన్యాసకులు. ఇద్దరు పిల్లలు. సొంత అపార్టుమెంటు. వీళ్ళ అభివృద్ధి మా కందరికీ తల్లి అయిన భాగీరథి గారు చూచి, తృప్తిగా రెండేళ్ళ క్రితం స్వర్గానికి చేరారు. నేను నా భార్యను 'అమ్మా' అని పిలిచే వాణ్ణి. అందరికీ అసహనం. మా పిల్లలకు అనందం.

నా కొక చిన్న గర్వం. మీరు అనుమతి ఇస్తే చెబుతాను. తెలుగు కవులైన మా దళితులు గుర్రం జాషువా గారికి, బోయి

భీమ్మన్నగారికి, జ్ఞానానందకవి గారికి ముగ్గరికి ఒక్కొక్క కుమార్తె తెలుగులో ప్రఖ్యాతి పొందారు. తెలుగు ఆచార్యులయిన దివాకర్ల వేంకటావధాని గారికి, బిరుదురాజు రామరాజుగారికి, కేతవరపు రామకోటి శాస్త్రి గారికి ఒక్కొక్క కూతురు విశ్వవిద్యాలయ తెలుగుశాఖలో ఆచార్యులుగా ఉన్నారు. తెలుగు కవుల, రచయితల కోవలో దళితుడుగా ఉన్న నాకు, విశ్వవిద్యాలయ ఆచార్యుల క్రమంలో ప్రసిద్ధుడిగా ఉన్న నాకు ఒక్క కూతురు కాదు ఇద్దరు కూతుళ్ళు. తెలుగు సాహిత్యంలో విశ్వవిద్యాలయాలలో రాటు దేలి ఉన్నారు. పెద్ద వాళ్ళకు కూతుళ్లంటే గర్వముంటే నాది రెండింతల గర్వం.

యూనివర్సిటీలో, తెలుగు డిపార్టుమెంటులో మాదిగ మహాశయుడు మొదటి సారిగా లెక్చరరుగా చేరాలంటే ఎంతకష్టమో నాకు తెలుసు. మీకెవరికీ తెలియదు.

నేను పిహెచ్.డి చేయటానికి ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆచార్యులు రేపు మాపంటూ మూడేళ్లు గడిపారు. ముఖ్యమంత్రి సంజీవయ్యగారు బోయి భీమ్మన్నగారి ద్వారా చెప్పిస్తే దివాకర్ల వెంకటావధాని గారు అదుగో ఇదిగో అంటూ అరి చేతిలో స్వర్గం చూపించారు. నన్ను ఆదరంగా చూసే కాకర్ల వెంకట రామనరసింహంగారు ఆంధ్ర యూనివర్సిటీపై ఆశ పెట్టుకోవద్దన్నారు. రామరాజుగారు ఉస్మానియా చుట్టూ తిరగవద్దన్నారు. వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 1962 ప్రాంతంలో పింగళి లక్ష్మీకాంతంగారు "లెక్చరరుగా ఉన్నావు, ఉద్యోగం చేసుకో. డాక్టరేటు గోల వద్ద"న్నారు. మర్యాదగా చెప్పారు.

దీనికి ముందొక సంగతి వివరించాలి. నా సిద్ధాంత గ్రంథ పరీక్షలు కాకర్ల వెంకటరామనరసింహంగారు, తూమాటి దొణప్పగారు, సి. నారాయణరెడ్డిగారు పర్యవేక్షించారు. నా సిద్ధాంత గ్రంథం పేరు తెలుగు వ్యాసపరిణామం. తెలుగు నాటకం, కవిత్వం, నవల మీద ముందే పరిశోధనలు వచ్చాయి. రాని ప్రక్రియలు వ్యాసం, కథానిక, వ్యాసం మీద పరిశోధన చేస్తానన్నాను. 1968 నాటిమాట: కథానిక మీద ఎందుకు వద్దు? "కథానిక మీద నాకు చాల విషయాలు తెలుసు" ఆ పొగరు చూడండి! "వ్యాసం నాకు తెలియదు, తెలుసు కొంటాను," తెలిసిందాని మీదనా? తెలియనిదాని మీదనా? "తెలియని దానిమీదే." రసహీనంగా ఉంటుంది. "అయినా సరే!" పుణ్యాత్ములు ఇద్దరూ అంగీకరించారు. సంతకాలు నాకంటె ముందు ఈ కాగితాల మీద పెట్టేవాళ్ళు.

జి.యన్. రెడ్డిగారు, సి. నారాయణరెడ్డిగారు సాహిత్య అకాడమీ సభ్యులు. బెజవాడ గోపాల్‌రెడ్డిగారు అధ్యక్షులు. కార్యదర్శి రామానుజరావు గారు. ఆ ఏటి ప్రసంగాంశం తెలుగు వ్యాసం. ముగ్గురు వక్తలు. తిరుమల రామచంద్ర గారు, మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారు, నేను స్వాతంత్ర్యం తరువాత వ్యాస పరిణామం గూర్చి నేను పత్రం చదవాలి. అంగీకరించాను. పత్రం రాసుకొన్నాను.

నా సమయం ఇరవై నిమిషాలు. అర్ధగంట అయింది. మాట్లాడమన్నారు. గోపాల్‌రెడ్డి గారు తన పూలమాల నాకు వేశారు. తన టిఏ. డిఏ నాకు ఇచ్చారు. మర్నాడు సాహిత్య అకాడమీ ఆధునిక సాహిత్యం ఎడ్వయిజరీ కమిటిలో సభ్యుడిగా చేశారు. ఇంత చేసింది, సి. నారాయణరెడ్డిగారు, జియస్ రెడ్డిగారు, బెజవాడ గోపాలరెడ్డి గారు కలిసి ఎవరి పాత్ర ఎంతో ఊహించుకోవవటమే. సి. నారాయణరెడ్డి గారిని నేను మరువలేను.

అప్పటినుంచి 15 సంవత్సరాలు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీలో ఉన్నాను. అయిదేళ్లు జనరల్ బాడీ, పదేళ్లు ఎడ్వయిజరీ బోర్డులో, సభ్యుడిగా నేను కేంద్ర సాహిత్య అకాడమీలో ఉండే అదృష్టం కలిగింది. నేను కేంద్ర సాహిత్య అకాడమీ ప్రవేశం వెనుక భద్రిరాజు కృష్ణమూర్తి గారి ప్రమేయం ఉంది. మూలం నాయని కృష్ణకుమారిగారు.

మా వాళ్లకు నేనొక పండగ. సాహిత్యోత్సవం. వాళ్ళలో మా అమ్మకూడా ఉంది. "కవి" కథలో, కవి భావనా శిఖరాల నుంచి వాస్తవాల లోయలోకి పడిపోతూ అమ్మా అని అరుస్తాడు. నేను అమ్మా అని అరిచాను. రేడియో కథ వింటున్న మా అమ్మ 'కొడుకా' అని ఏడవటం ప్రారంభించింది. పడిపోయింది నేనే అనుకొని ఉంటుంది. నన్ను మర్నాడు చూచిందాకా ఏడుపు ఆపలేదు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పక్షాన మలేషియా, సింగపూరు, మారిషస్ వెళ్ళి వచ్చాను. విశ్వవిద్యాలయం నుంచి కెనడా, అమెరికా దర్శించాను. కేంద్ర సాహిత్య అకాడమీ పంపగా జోర్డాన్, ఇజ్రాయేలు వెళ్ళాను. బాగీరథి గారి కోసం మళ్లీ సింగపూరు వెళ్ళి విశ్రాంత జీవితంలో మంచి సమయం గడిపి

వచ్చాను. ఇన్ని విదేశాలలో నేను నాటక రచయితను, కవిని, నవలా కర్తను, కథా రచయితను, విమర్శకుణ్ణి, పరిశోధకుణ్ణి అని చెబుతుంటే వాళ్ళు తెల్లవాళ్ళు కదా – తెల్లముఖం వేసుకుని చూసేవాళ్ళు. అందువల్ల ఇంగ్లీషులో ఉన్న నాటకం, కథలు విమర్శన గ్రంథం చూపితే వాళ్ళు చూసి తిప్పి, తిరగేసి ఊరుకొనేవాళ్ళు.

పీడితులు నాకు సన్నిహితులు. పీడన నా వేదన. ప్రతిఘటన నా లక్ష్యం. నా సాహిత్యం నా ఈ స్థితికి ప్రతిబింబం. నా రచనలు నా కన్నీళ్ళు. అందువల్ల కమ్యూనిస్టు అన్నారు. మార్క్సిస్టు నన్నారు. ధన్యుణ్ణి నక్సలైటు అనలేదు. కానీ 'తల లేనోడు' కథను ఏ విప్లవ రచయితా రాయలేక పోయాడు అని ఆర్.యస్. సుదర్శనంగారు ప్రకటించారు.

ఒక కావ్యానికి 'చెప్పులు' అని పేరు పెడితే జనం ఆశ్చర్యంగా చూశారు. నేను 'చెప్పులకు నమస్కరిస్తున్నాను' అని కవిత రాస్తే బిత్తర పోయారు. నా ఆంతర్యం నగ్నంగా ప్రదర్శించినప్పుడు జనం ఆశ్చర్య పోసాగారు.

ఈ డెబ్బై ఏళ్ళలో నేను చాలా దూరం ప్రయాణం చేశాను. ఏమిలేని నేను ఎంతో వెనక నుంచి బయలుదేరి అన్నీ ఉన్న అందరితో కలవటానికి ఎంత కష్టపడ్డానో ఊహించండి. చాలా వేగంగా ప్రయాణం చేశాను. ఇంకా పరుగు ఆగదు. ఈ సాధన సామాన్యం కాదు. నేను కులాన్ని జయించాను. అయినా లోకాన్ని ప్రేమిస్తున్నాను. నన్ను ద్వేషించినా, ధూషించినా ప్రేమిస్తాను. విజేతకు గర్వముంటుంది. నేను విజేతను, కాని నాకు గర్వం లేదు. దీనుడు గర్వించడు. నేను దీనుణ్ణి. గర్వించాను. నా దేవత పెట్టుబడిగా గర్వంతో విజయం సాధించాను. నన్నిప్పుడు మీరు అంచనా వేయలేరు. నేను మీకింకా తెలియలేదు. మీకింకా పూర్తిగా తెలియటానికి సమయం అవసరం. నన్ను మరవలేరు. నేను మీకు తెలుస్తాను. చాలా కాలం కావాలి. అప్పటికి నేనుండను. చాలా మంది పుణ్యాత్ములు తమ జీవిత కాలంలో నిరాశాదగ్ధ చేతస్కులయ్యారు. నేనే మాత్రం?

మీకూ, మీ సాహిత్యానికీ, రావలసినంత గుర్తింపు రాలేదని మిత్రులు అంటుంటారు. ఈ గుర్తింపు చాలనిపిస్తుంది. ఇంకా గుర్తింపు అనుగ్రహిస్తామంటే నాకు సంతోషమే కదా. నాకు ఏ కుల సంఘం, మత సంఘం లేదు. ఏ కులం వాళ్ళు ఆ కులం వాళ్ళని, ఏ మతం వాళ్ళు ఆ మతం వాళ్ళని ప్రోత్సహిస్తారు. నాకు ఆ అవకాశం లేదు.

నేను ఏ రచయితల సంఘంలోనూ సభ్యుణ్ణి కాను. ఆ సంఘం సభ్యులు ఆ సంఘ కవుల్ని, రచయితల్ని, విమర్శకుల్ని అభిమానించి, అండదండలిచ్చి ఆదరించినట్లుగా నాకు ప్రోత్సాహం లభించదు.

నా ఆలోచనలు నావి. నా ఆరాటం నాది. ఏ కొందరి కోసమో నేను జీవించటం లేదు. నేను పీడితులనుకొన్న వాళ్ళ పక్షాన నా పోరాటం. అదే సాహిత్య రూపం. వాళ్ళకోసం నేను రాస్తున్నా, వాళ్ళు నా కోసం శ్రమించాలని, కృషి చేయాలని, నా జెండా మోయాలని నేను అనుకోను. వాళ్ళు విముక్తులైతే చాలు. సాహిత్యం నన్ను విముక్తుణ్ణి చేసింది. దళితులు, స్త్రీలు, గిరిజనులు, వెనుకబడిన తరగతుల వాళ్ళు, పేదలు నా పరిధి వాళ్ళు, నా ప్రమేయం వాళ్ళు. వాళ్ళకు నా సాహిత్య ప్రోత్సాహం నా లక్ష్యం. వాళ్ళు అండదండ లందీయగలరు. వాళ్ళ సహాయ సహకారాలు నేను కోరుకోను. ఇదీ ఈ వ్యవస్థలో నా స్థితి.

వీళ్ళనుంచే కాక, వీళ్ళు కాని వాళ్ళ నుంచి నాకు విశేష ప్రోత్సాహం లభిస్తూ ఉంది. ఆదరణ దొరుకుతుంది. అనురాగం అందుతుంది. నా సాహిత్యం వర్ధిల్లుతుంది. ఒక కులం, ఒక మతం పరిధిలోనో, ఒక సాహిత్య సంఘం లక్ష్యాల పరిధిలోనో చిక్కుబడి పోకుండా అందరికోసం రాయటం నేను బాల్యంలోనే నేర్చుకొన్నాను. రాసేది నా అనుభవమే నా చుట్టూ ఉన్న జీవితమే! మా కష్ట సుఖాలే! మా కోసం కాదు – నలుగురి కోసం. మీ కోసం, జన సామాన్యం కోసం.

డెబ్బై ఏళ్ళ జీవితం 55 ఏళ్ళ సాహిత్య జీవితం, గంటలో చెప్పాలి. ఏం చెప్పగలను. కొండ అద్దంలో కొంతకనిపిస్తుంది. హైదరాబాదులో ఆంధ్ర సారస్వత పరిషత్తు సుప్రసిద్ధ వ్యవస్థిత సంస్థ. గొప్పగా తెలుగు సాహిత్య సేవ చేసింది. పరిణతవాణిలో నన్ను మాట్లాడించటమే నాకు పరమ గౌరవం. ఈ సందర్భం వల్ల నాకు స్వీయ జీవిత చరిత్ర రాయాలన్న సంకల్పం కలిగింది. నాకు వందన సమర్పణ సమయం ఇచ్చినందుకు సి.నారాయణరెడ్డి గారికి, ఆంధ్రసారస్వత పరిషత్తుకు ధన్యవాదాలు.

**సి.పి. బ్రౌన్ అకాడెమీ వారి విశిష్ట పురస్కారం లభించిన సందర్భంగా ద్వానా శాస్త్రి - ఆచార్య ఇనాక్‌ల మధ్య మాట కచ్చేరి.**

**ద్వానా : మిమ్మల్ని 'దళిత రచయిత'గా అనటంపై ఏమంటారు?**

**ఇనాక్ :** నేను రాస్తున్న రోజుల్లో ఈ దళిత పదంలేదు. నేను రాసిన పుస్తకాలు ఇప్పుడు దళిత వాదానికి అనుకూలంగా ఉన్నాయన్నారు. అందుకని నన్ను దళిత రచయిత అని అంటున్నారు. నన్ను అభ్యుదయ రచయితగా అరసం అర్ధ శతాబ్ది ఉత్సవంలో సన్మానించారు. మాలో లేకున్నా 'మావాడు' అని 'తలలేనోడు' కథ చదివి విరసం వాళ్ళు అన్నారు. మేము చెప్పని, చెప్పలేని విషయాలను కూడా ఈయన కథల్లో, నవలల్లో చెప్తున్నాడని స్త్రీవాదులు భావిస్తున్నారు. నాకు మనిషి అంటే ఉన్న ప్రేమ అచంచలమైనది. దానికి ఏ పరిధులూ లేవు. నేను దళితుడ్ని కాబట్టి, దళిత జీవితం నాకు బాగా తెలుసు కాబట్టి, దళిత దృక్పథం నా రచనలలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది కాబట్టి – నన్ను దళిత రచయిత అంటున్నారు. అయితే నన్ను "తెలుగు రచయిత" అని అంటే ఆనందిస్తాను.

**ద్వానా : దాదాపు ఏభై అయిదేళ్ళుగా రచనలు చేస్తున్నారుగదా! మిమ్మల్ని "ఆధునిక సాహిత్యాత్మ అన్వేషి" అనాలనిపిస్తోంది.**

**ఇనాక్ :** చాలా ఆనందిస్తాను. అవును ఇప్పటికీ రాస్తూనే వున్నాను. మీరన్నట్టు ఆధునిక సాహిత్యాత్మను అన్వేషించే కృషిలోనే వున్నాను.

**ద్వానా : మీరు ఏది రాసినా, ఏ ఉపన్యాసమిచ్చినా ఏదో ఒక కొత్త అంశం లేదా ఒక చర్చనీయాంశమైన అంశం వుంటుంది. ఇది కావాలనా లేక సంచలనం కోసమా?**

**ఇనాక్ :** నా దృష్టి సంచలనం కాదు. ఏ విషయం రాసినా, మాట్లాడినా పాతగా వుండకూడదనీ కొత్తగా వుండాలనీ ఇష్టపడతాను. కొత్తగా ఉన్నందువల్ల వెంటనే అంతుబట్టక చర్చ జరుగుతుంది. చర్చ జరగటం నాకు ఇష్టం, జనం ఆలోచించటం నాకు ఇష్టం. చర్చ జరుగుతోంది. అంటే నన్ను గుర్తించినట్లే భావిస్తాను.

**ద్వానా : కొత్త అంశమో, చర్చనీయాంశమో ఎట్లా వస్తోందంటారు?**

**ఇనాక్ :** నా వాక్కుకి బలమైన పునాది, స్థానం "క్లాస్‌రూమ్." నేనక్కడ పాఠం చెప్పినప్పుడు నాకు పరమానందం కలిగి ఈ విషయం నేను కొత్తగా చెప్పాను అనిపించి, బయటకు వచ్చి ఆ అంశంపై జరిగిన పరిశోధనలు పరిశీలించి, ఇది ఎవరూ చెప్పలేదని గుర్తించి వ్యాసం రాయటం ప్రారంభించాను. నేను 'జానపద సాహిత్య విమర్శ" పరిశోధన గ్రంథం రాయటానికి క్లాసురూమే కారణం. నా విమర్శకి, పరిశోధనకి ఈ బోధన, సెమినార్లు, ఉపన్యాసాలే ప్రేరణ అయ్యాయి.

**ద్వానా : ప్రస్తుతం అన్ని ఉద్యమాలూ బలహీనపడ్డాయనీ, ఆయా ఉద్యమ లక్ష్యాలూ అనుకున్నంతగా సాధించబడలేదనీ విమర్శకులు అనటంపై మీ అభిప్రాయం?**

**ఇనాక్ :** ఇప్పుడు చాలా ఉద్యమాలూ ధోరణులూ, దృక్పథాలూ వున్నాయి. ఇవన్నీ వేర్వేరు కుంపట్లుగా ఉండడటంవల్ల ఉత్పత్తి అవుతున్న ఆహారం ఎక్కువగానే వుంది. అయితే మునుపు ఒక వాదంలో వచ్చినంత సాహిత్యం ఇప్పుడు రావటం లేదు కాబట్టి బలహీనపడిందని ఎవరైనా అనుకొనే అవకాశం ఉంది. మొత్తంమీద భిన్న సామాజిక వర్గాల నుంచి వస్తున్నటువంటి సాహిత్యం దాని లక్ష్యాన్ని కచ్చితంగా చేరుకొంటూ వుంది. అన్ని ధోరణులూ ఉద్యమాలకు సంబంధించిన సాహిత్యం అనుకున్నంత స్థాయిలో రాలేదనో, అసలు రావటం లేదనో అనుకోవటం జరుగుతోంది.

**ద్వానా : ఇప్పుడు తెలుగు సాహిత్య విమర్శ ఏ స్థితిలో వుందంటారు?**

**ఇనాక్ :** లాక్షణిక గ్రంథ విమర్శ చేసేవారు ఒక పద్ధతిలో చేస్తూ వున్నారు. పాశ్చాత్య విమర్శ పద్ధతిలో విమర్శ చేస్తూ ఉన్న వారున్నారు. వామపక్ష భావజాలంతో పరిశీలించి విమర్శ చేస్తూన్నారు. ఈ మూడు విమర్శా ధోరణుల్ని సమన్వయించు కొని సాహిత్య విమర్శ చేస్తున్నవాళ్ళు వున్నారు. అయితే దళిత, స్త్రీవాద, బహుజన వాద, మైనార్టీ గిరిజన, ప్రాంతీయ వాద తత్వాలకు పునాదులు గుర్తించడం కానీ, వాటి మౌలికాంశాలను గ్రహించి – ఆ గ్రహింపు ద్వారా ఆ సాహిత్యాన్ని విమర్శించడం గానీ చెయ్యలేకుండా ఉన్నారు. మార్క్సిస్టు విమర్శనా సిద్ధాంతాలే అన్ని రకాల రచనలకు పనికి రావని గ్రహించాలి. అంబేద్కర్ ఆలోచనావిధానంతో విమర్శించడం సముచితమే గానీ, దానికీ పరిమితులున్నాయన్నది మర్చిపోకూడదు. వాస్తవానికి ఒక సృజన సాహిత్యం వచ్చిన తర్వాత దాని ఆత్మాన్వేషణ చేసి, అటువంటి సాహిత్యం ఏ మౌలికమైన లక్షణాలను కలిగివుందో గుర్తించటం ముందు జరగవలసిన పని. ఏ సాహిత్య వాదానికి చెందిన వాళ్ళు ఆ సాహిత్యవాదన విమర్శ చేస్తూ మిగత సాహిత్యాలను పట్టించుకోకుండా ఉంటున్నారు. ఇది సాహిత్యానికి ప్రమాదం. అత్యాధునిక సాహిత్యాన్ని దాని అంతరాత్మను చూడకలిగివుండాలి. అందుకే మీరన్న "ఆధునిక సాహిత్యాత్మ అన్వేషణ" అనేది నాకు ఇష్టం అనటం!



# గిరిమల్లెలు

- కె. భాను నాయక్

## పరిచయం:

నల్లమల అటవీప్రాంతం ప్రకాశం, కర్నూలు, గుంటూరు, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలలో వ్యాపించి ఉంది. ఈ ప్రాంతం $16^0$ నుండి $16.3^0$ వరకు ఉత్తర రేఖాంశాలు, $78^0.30'$ నుండి 79 నుండి $15'$ తూర్పు అక్షాంశాల మధ్య ఉన్నది. ఈ ప్రాంతం దట్టమైన అడవులు, కొండలు కలిగి ఉన్నది. వేసవి కాలంలో విపరీతమైన ఎండలు కలిగి ఉష్ణోగ్రత అత్యధికంగా ఉంటుంది. శీతాకాల, వర్షకాలాల్లో ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. అత్యధిక ఉష్ణోగ్రత ఏప్రిల్ – మే నెలలోనూ, అత్యల్ప ఉష్ణోగ్రత నవంబరు – డిసెంబరు నెలలోనూ ఉంటుంది.

మనరాష్ట్రంలో చెంచులు ప్రధానంగా ప్రకాశం, కర్నూలు, గుంటూరు, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలలో విస్తరించి వున్నారు. వీరు దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో వేల సంవత్సరాలుగా నివసిస్తున్నారు. వీరు పూర్తిగా ఆదివాసీలు. చెంచు తెగ ప్రాచీన సంచార తెగలలో ఒకటి. నల్లమల్ల అటవీ ప్రాంతంలోనే కొండలు, గుట్టలు వీరి నివాసస్థలాలు. 2001 జనాభా లెక్కల ప్రకారం మన రాష్ట్రంలో 49.232 మంది చెంచులు నివసిస్తున్నారు. వీరి మొత్తం అక్షరాస్యతా శాతం 32.28. అందులో పురుషుల అక్షరాస్యతా శాతం 40.87 కాగా స్త్రీలది 23.48. వీరి మాతృభాష తెలుగు.

చెంచువారిని నాలుగు రకాలుగా విభజించవచ్చు. 1) అడవి చెంచులు 2) దేవ చెంచులు 3) బొంత చెంచులు 4) కృష్ణ చెంచులు.

వీరిలో అడవి చెంచులు, దేవ చెంచులు నల్లమల అడవులలో నివసిస్తారు. బొంత చెంచులు, కృష్ణ చెంచులు మైదాన ప్రాంతాలలో నివసిస్తున్నారు. అడవి చెంచులు, దేవ చెంచుల సాంఘిక జీవనం, గోత్రం, కులకట్టుబాట్లు, ఆచార సంప్రదాయాలు మొదలగు పద్ధతులు ఒకే విధంగా ఉంటాయి. ఈ రెండు వర్గాల మధ్య వివాహ సంబంధాలు కలిగి ఉంటాయి. వీరు అడవులలో లభించే వివిధ రకాల పండ్లు, దుంపలు, వెలగకాయలు, చిల్లిగింజలు, కుంకుడు కాయలు, చింతపండు, బంక, ముష్టిగింజలు, ఉసిరికాయలు మొదలగువాటిని సేకరించి, వాళ్ళ అవసరాలకు ఉపయోగించు కోగా మిగిలిన వాటిని 'గిరిజన సహకార స్టోర్స్'లో విక్రయించి, వారి వద్ద నుండి తమకు అవసరమైన నిత్యావసర వస్తువులను తీసుకుంటారు.

## చెంచుల కుటుంబ వ్యవస్థ :

చెంచుల కుటుంబాలలో ఎక్కువగా ఉమ్మడి కుటుంబాలు ఉండవు. అన్ని చిన్న కుటుంబాలే. ఎందుకంటే వివాహం జరిగిన వెంటనే విడిగా కాపురం పెట్టుకుంటారు. చాలా కుటుంబాలలో వివాహానికి ముందే మగవాడు ఒక గుడిసెను ఏర్పాటు చేసుకొనే ఆచారం ఇప్పటికీ ఉంది. చెంచులు స్వేచ్ఛను కోరుకునే మనస్తత్వం కలిగిన వారు. అయితే వీరి వస్త్రధారణ విషయంలో మగవాళ్ళు 'గోచీ'ని మాత్రమే ధరిస్తారు. స్త్రీలు రవిక, చీర కట్టుకుంటారు. విల్లంబులు, ఒక కత్తి, గొడ్డలి, ఒక కర్ర. కొన్ని కుండలు, బుట్టలు, చినిగిన పాత బట్టలు ఇవే చెంచుల ఆస్తిపాస్తులు. నల్లమల అటవీ ప్రాంతంలోని ప్రతి గూడెం చెంచులకు "తేనె" ముఖ్యమైన జీవనాధారం. తేనె సేకరణకు వెళ్ళేటప్పుడు బావమరుదుల్నే తీసుకొని వెళ్తారు. అన్నదమ్ములను తీసుకొని వెళ్ళరు. ఎందుకంటే వీరు అన్న చనిపోయినప్పుడు అన్న భార్యను తమ్ముడు వివాహం చేసుకొనే ఆచారం వీరిలో ఉంది. చెంచులు

శ్రీ కె. భాను నాయక్, సెల్ : 9951459841

అడవిలో ఎక్కడ తిరిగినా వారి వద్ద తప్పని సరిగా 'కత్తి' ఉంటుంది. దానితోపాటు 'గొడ్డలి' భుజాన ఉంటుంది. వీటితోపాటు డబ్బు, అంబులు మరియు పట్టుడు కర్ర ఉంటాయి. చెంచులకు తోడు ఎప్పుడు 'భార్య' ఉంటుంది. భర్త మాంసం కోసం వేటచేస్తే, భార్య పండ్లు, గడ్డలు, ఆకు కూరలు, పంటకు అవసరమైన కర్రలు సేకరిస్తుంది. ఎంత నట్టడవిలోనైనా భర్తవెంట భార్య ఉండాల్సిందే. సాధారణంగా చెంచులకు రేపు మీద ఆశ ఉండదు. అందుకే ఏ పనిలో కూడా అంతగా శ్రద్ధ పెట్టరు. మిగతా జాతులకు వీరికీ ఇదే ప్రధానమైన తేడా.

## చెంచుల ఇంటి పేర్లు :

1) కుడుముల 2) దంసాని 3) మండ్లి 4) జల్ల 5) చెవుల 6) తోకల 7) ఉడతల 8) నిమ్మల 9) పిట్ట 10) చిగుర్ల 11) మెఖల 12) భూమని 13) దాసరి 14) పులిచెర్ల 15) ఆర్తి 16) పిట్టల 17) గడ్డమోళ్ళు.... మొదలగునవి గోత్ర నామాలు వుంటాయి.

## చెంచుల దైవారాధన :

చెంచులు పూర్తిగా ప్రకృతి మీద ఆధారపడి అడవులలో జీవిస్తున్నారు. కావున వీరికి నమ్మకం కలిగిన దేవుళ్ళను భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. వీరు వేటనూ, అడవి పండ్లనూ ప్రసాదిస్తుందని విశ్వసించే ఒక దేవతను పూజిస్తారు. 'హిందువులు పరమాత్మగా పూజించే భగవంతుడిలో కొన్ని లక్షణాలలో సారూప్యం ఉన్న ఒక 'ఆకాశవాణి'ని కూడా చెంచులు పూజిస్తారు. జీవితం దేవుడి వరప్రసాదం అనీ, మరణించిన జీవుడు దేవుడిలో కలిసి పోతాడనీ చెంచులు బలంగా నమ్ముతారు. వీరి నమ్మకాలపై ఎక్కువ విశ్వాసం కలిగి ఉంటారు. దేవుళ్ళతో పాటు కంటికి కనిపించే అభూత శక్తులు అన్నా, అపార విశ్వాసం వీటికై పూజలు జరిపిస్తారు. వీరు పూజించే దేవుళ్ళు ప్రధానంగా – 'అంకాలమ్మ, పోతరాజు, భయన్న, గురవయ్య, ఈదమ్మ, పోలేరమ్మ, మంతనాలమ్మ, లింగయ్య, మల్లమ్మ, గౌలుసమ్మ, ఎల్లమ్మ మొదలగునవి చెంచుల ఆరాధ్య దైవాలు. ఈ దేవుళ్ళతోపాటు చెంచుల ఇలవేల్పులైన 'శ్రీశైలం మల్లిఖార్జునస్వామి, శ్రీశైలం భ్రమరాంబ, అహోబిలం నరసింహస్వామిని' ముఖ్య దేవుళ్ళుగా పూజిస్తారు. నరసింహస్వామి వారి సతీమణి అయిన 'చెంచులక్ష్మి'ని చెంచు తెగకు సంబంధించిందని చెంచుల విశ్వాసం.

చెంచులు పాటలలో 'నరసింహస్వామి మరియు చెంచులక్ష్మి'కి సంబంధించిన కథలు వీరు పాడుతారు. కానీ ఇటీవల కాలంలో ఎక్కువమంది చెంచులు భద్రాచలం శ్రీరాముడు, ఆంజనేయస్వామి మరియు శ్రీవెంకటేశ్వర స్వాముల ఫోటోలను వారు నివాసం ఉంటున్న గుడిసెలలో ఒక మూలన పెట్టుకొని వాళ్ళ పద్ధతిలో పూజిస్తున్నారు. వీటిని బట్టి చూస్తే వీరు అధిక శాతాన్ని హిందుమతాన్ని పాటిస్తున్నట్లుగా కనిపిస్తుంది. కాని క్రైస్తవ మిషనరీల ప్రచారం కారణంగా కొంతమంది చెంచులు క్రైస్తవ మతాన్ని పాటిస్తున్నట్లుగా తెలుస్తుంది. చెంచులకు పుట్టిన పిల్లలకు ఎక్కువ శాతం వారి సొంత దేవుళ్ళ పేర్లును పెట్టుకుంటున్నారు. ఉదా: మల్లయ్య, పోతయ్య, వీరయ్య, నరసయ్య, చెంచులక్ష్మి భయన్న, పోతరాజు, హనుమయ్య, వెంకటయ్య మొదలగునవి.

వీరు ఉగాది, మహాశివరాత్రి, సంక్రాంతి, దీపావళి మొదలైన పండుగలను భక్తి శ్రద్ధలతో జరుపుకొంటారు. దైవంపట్ల కృతజ్ఞత భావం కలిగి ఉంటారు. దైవ ప్రార్థన తర్వాతే ఆహారాన్ని భుజించడం వీరి అలవాటు. తేనె కోసం చెట్లు ఎక్కేముందు కానీ, కొండలపై ఎగబాకేటప్పుడు కానీ 'దేవతలను' ప్రార్థిస్తారు. తమకు ఆహారం, వేట విజయవంతంగా ముగిస్తే తాము సేకరించిన పదార్థాలలో కొంత భాగం దేవుడికి నైవేద్యంగా ప్రసాదం పెడతారు. తేనె టీగలను 'దైవ సమానంగా' భావిస్తారు.

1. చెంచులు వారి నమ్మకాలను, విశ్వాసాలను ఆరాధ్య దైవాలపై ప్రగాఢ విశ్వాసం ఉంచుతారు. వీరి సాంఘిక జీవనంలో ఒక భాగం దేవతారాధన చేస్తారు.
2. స్త్రీలు గర్భవతులు కాని యెడల కుటుంబ దైవాలు ఆగ్రహించాయని వాటికై పూజలు చేస్తారు.
3. ప్రతియేట పెద్దలు పండగనాడు పూర్వీకులను పూజిస్తారు.
4. వీరు ఏదైన పనిని ప్రారంభించినపుడు దేవతలను పూజించి, ఆ పని చేస్తారు.
5. వీరు కుల పెద్దలను కూడా గౌరవిస్తారు.

పూర్వం శ్రీశైల క్షేత్రానికి రవాణా సౌకర్యం లేనపుడు చెంచులే శివరాత్రి, ఉగాది పండుగలలో ధూప, దీప, నైవేద్యాలు పెట్టి పూజలు జరిపించేవారు. దీనికి నిదర్శనం 'నేడు శ్రీశైల క్షేత్రంలో చెంచులకు ఉద్యోగావకాశాలు కూడా కల్పించ బడినవి.'

### చెంచుల దైవ ప్రార్థన

"దేవ్డ్...స్యామ్ తల్లీ!.... / ఓ దేవ్డ్! స్యామ్ తండ్రీ!
నీవు పిలిస్తే పల్క ద్వాపర్యంట / చూడాల నీ సత్తము
బంగార్వోడా! / పుట్టచ్చేడ్వి నివ్వె! గిటిచ్చుట్టేన్వి నివ్వే!
ఇంతకాలమ్ కాపాడ్నవ్! / ముందు కాలం నీదే
అందర్ని చల్లంగ కాపాడ్
ఈ అడ్వంతా చల్లగా కాపాడ్ తండ్రీ!...
ముందు ఈ అడ్విలేని అన్ని పానలని కాపాడ్ తండ్రీ...!
దిక్కూ మొక్కూ లేనోల్లకి తల్లీ! తండ్రీ! నీవే స్వామీ!...
దిక్! ముక్ లేని మండ్లని
మా అడ్విని ఈ అడ్విలేని పతోక్క జీవి
చల్లంగా కాపాడ్ తల్లీ! తండ్రీ!...
మీమ్ బత్కడేంకి అడ్విలేని గెడ్డి, గాదం
పతొక్కటి మా ఈప్న మోప్న ఉండ్యాల తల్లీ!
మా ముందెన్కా జర్గే అన్నాంట్లనా కన్పిట్టి కాపాడ్
స్వామ్! తండ్రీ! నిన్నే నమ్మామ్ రా!



ఫోటో : తమ్మా శ్రీనివాసరెడ్డి

దైవమా!.... తండ్రీ!... భగవంతుడా!...
బత్కునేర్పినోడా!... / ఒల్లంతా కండ్లిండ్ టోడా!
ఈ లోకాన్నంతా కాపాడ్ టోడా!...
ముందు నీవ్! అంకమేమ్...
నమ్మేని చెర్పకురా! తండ్రీ!
ఓ తల్లి దైవమా! మేమొకట్తలిస్తే
నీవొకట్త ల్చకురా! అన్కినది
అన్కినట్ జర్గాల తండ్రీ!

చెప్పింది చెప్‌నట్ చెయ్ తండ్రీ!
మీమ్ ఈ లోకంలా దార్ తప్ నడుస్తుండమ్ తండ్రీ!
మాక్ దార్చూప్ మా దైవమా!
బాధలను తెల్గిపెయ్ మాక్ బత్కు నేర్పు మా తండ్రీ!
మాకేద్మంచో ఏద్చెడ్డో! తెలియటం లేదు
తెల్సీ తెల్వక చేసే తప్పొప్పులన్నీ నీకెత్తెల్సు
తల్లీ! దైవమా! మీమ్ తెల్సీ తెల్వక
చేసే తప్పన్నింట్కి నీవే! సత్తమింటే చూడాలి
కొండంత ఆపదైనా నీల్లల్లో తెప్పలా తేల్పొవాల
నీకు ఏన్గంత సత్వ గుర్రమంత లగ్వు ఉందటా
ఓ తల్లీ!...తండ్రీ!...దైవమా!...చూడాల నీ సత్తం!"

*(పుట vii గిరిగింజ గిరిమల్లెలు)*

**భావం:** అడవి చెంచులమైన మాకు ఏ కష్టము వచ్చినా, నష్టము వచ్చినా, సంతోషము కలిగినా మా కులదేవతలు దగ్గరగా ఉన్నా లేకపోయినా ఎక్కడిక్కడ క్రిందపడి ఉన్న రాళ్ళనే దైవాలుగా, మట్టినీ, మట్టి పుట్టలను, చెట్లను, ఎండిన కొయ్యలనూ, తేనె, ఆహారాది పదార్థాలను మరియు ఇతర ఫలాలను కూడా దైవాలుగా తలుస్తాము. అడవి తల్లి పచ్చగా ఉండాలి. నీ బిడ్డలమైన మేము చల్లగా ఉండాలి. ఈ లోకంలో పుట్టిన ప్రతి ప్రాణిని కాపాడాలనీ ఏదీ తరిగి పోకుండా చూడాలనీ మా కులదావర్ణకు చెంచులమైన మేము ప్రార్థనలు చేస్తాము.

ఆదిమ చెంచు బిడ్డలుగా పుట్టిన మాకు చెంచు దైవప్రార్థనలు చాలా పురాతన కాలం నుండి తెలుసు. అయితే ఇవి మా పెద్దల ద్వారా తరతరాలుగా మాకు సంక్రమించినవి. ఇవి ఇప్పటికి నల్లమలలోని ప్రతిచోట, నట్టడవిలో ఉండే ప్రతి చెంచు చేసే ప్రార్థనలు. ఈ ప్రార్థనలు ఎన్నో రకాలుగా చేస్తారు.

చెంచులకు ఇష్టమైన దేవుడు అయిన 'శ్రీశైలం మల్లిఖార్జునస్వామి. ఈ దేవుని కోసం చెంచులు ఇలా భక్తి విశ్వాసంతో పాటను ఇలా పాడుతారు.

*ఉదా:* "శివో శివో ల్యాలి, పార్వతిచ్చింది నల్లనే దండ శివో శివో ల్యాలి
పార్వతిచ్చింది నల్లనే దండ శివో శివో ల్యాలి
పార్వతిచ్చింది చుట్ మెట్టల్ శివో శివో ల్యాలి
పార్వతిచ్చింది నడ్మెడ్డానం శివో శివో ల్యాలి
పార్వతిచ్చింది కాల్గొల్సులు శివో శివో ల్యాలి
పార్వతిచ్చింది కాల్గోల్సులు శివో శివో ల్యాలి
పార్వతిచ్చింది తెల్లన్ రైక శివో శివో ల్యాలి
పార్వతిచ్చింది తెల్లన్ రైక శివో శివో ల్యాలి
పార్వతిచ్చింది తెల్లన్ కోక శివో శివో ల్యాలి
పార్వతిచ్చింది తెల్లన్ కోక శివో శివో ల్యాలి
పార్వతిచ్చింది చేత్కడాలిచ్చింది శివో శివో ల్యాలి
పార్వతిచ్చింది చేత్కడాలిచ్చింది శివో శివో ల్యాలి
పార్వతిచ్చింది కమ్మలిచ్చింది శివో శివో ల్యాలి
పార్వతిచ్చింది కమ్మలిచ్చింది శివో శివో ల్యాలి
పార్వతిచ్చింది మొన్నే గంట శివో శివో ల్యాలి
పార్వతిచ్చింది మొన్నే గంట శివో శివో ల్యాలి
పార్వతిచ్చింది ముక్‌నే బేస్ర శివో శివో ల్యాలి
పార్వతిచ్చింది ముక్‌నే బేస్ర శివో శివో ల్యాలి
పార్వతిచ్చింది కాల్గజ్జల్ శివో శివో ల్యాలి
పార్వతిచ్చింది కాల్గజ్జల్ శివో శివో ల్యాలి

*(పుట 155, గిరిగింజ గిరిమల్లెలు)*

**భావం:** శివపార్వతులను నిత్యం పూజించే ఒక చెంచు యువతికి ఒక రోజు పార్వతి ప్రత్యక్షమౌతుంది. అప్పుడు ఆ యువత భక్తికి పార్వతీదేవి మెచ్చి పెండ్లికోసమని కుంకుమ, పసుపు, వనమూలికలు, తీగలు మొదలగు వానితో వెండి బంగారములతో తయారు చేయబడిన ఆభరణాలు, నల్లదండ, చుట్టూ మెట్టలు, నడుమ వడ్డాణము, కాళ్ళ గొలుసులు మొదలగునవి ఆడపడుచులకు పంపేలాగా పార్వతీదేవి, మల్లిఖార్జున స్వామి ప్రత్యక్షమైన ఆ యువతికి పంపుతారని భక్తితో పెండ్లి చేసేటప్పుడు పెండ్లి కూతురుని అలంకరించే టప్పుడు చెంచు సాంప్రదాయ పద్ధతులలో ఈ పాటను చెంచు యువతీ, యువకులు పాడుకుంటారు.

చెంచులు మలికార్జున స్వామికి పూజలు చేసేటప్పుడు యువతీ యువకులు భక్తి పారవశ్యంతో పాడుకొనే పాటలు ఈ విధంగా ఉంటాయి.

*ఉదా:* "మల్లయ్య గిడి చుట్టూ – ఇయ్యాలో
మంచినే మల్లెలే – ఇయ్యాలో
కెయ్, కెయ్ చెల్లమ్మ – ఇయ్యాలో
పూలనే కెయ్యమ్మ – ఇయ్యాలో
పూలనే కేసినాను – ఇయ్యాలో
నా పెద్ద అన్నయ్య – ఇయ్యాలో
పంపవే చెల్లెలా – ఇయ్యాలో
మల్లయ్య పూజకే – ఇయ్యాలో
మల్లయ్య పూజకే – ఇయ్యాలో
త్యాసల కడవలే – ఇయ్యాలో
పంపవా చెల్లెలా – ఇయ్యాలో
నా చిన్న చెల్లెలా – ఇయ్యాలో
మల్లయ్య పూజకే – ఇయ్యాలో
పాలనే కడవలె – ఇయ్యాలో
పంపవా చెల్లెలా – ఇయ్యాలో
నా చిన్ని చెల్లాలా – ఇయ్యాలో

**భావం:** పూర్వకాలమందు చెంచులు శ్రీశైలం మల్లికార్జునస్వామి వారికి పూజలు చేసేవారు. ఈ పాటలోని అన్నకు ఒక దినమున మల్లయ్య పూజకు పూలు అవసరమయితే అతని చెల్లెలు గుడి చుట్టూ ఉన్న మల్లెపూలను తెంపిస్తుంది. అయితే అన్న మల్లికార్జునస్వామికి అభిషేకం చేయాలి అని అను కుంటున్నాడు. అప్పుడు తేనెతో అభిషేకం చేస్తే మంచిది అని తలంచి అభిషేకంనకు 101 కడవల తేనె తెప్పించి అభిషేకం చేస్తాడు. తేనెతో అభిషేకం చేసిన తర్వాత ఆవు పాలతో అభిషేకం చేసి పూజలు జరుపుతారు. అపుడు వారికి మల్లికార్జున స్వామి ప్రత్యక్షమై మళ్లీ జన్మంటూ ఉండకుండా చేస్తాడని మా చెంచు పెద్దలు గతంలో రకరకాల కథలు చెప్పుకొనేవారని ఈ పాటలోని భావం.

**ముగింపు :**

మనరాష్ట్ర ప్రభుత్వం 1975 సంవత్సరంలో చెంచులను ఆదిమ గిరిజ తెగగా గుర్తించింది. వీరికై ప్రత్యేకించి శ్రీశైలం I.T.D.A. (సమీకృతి గిరిజనాభివృద్ధి సంస్థ) ను ఏర్పాటు చేసింది. ఈ సంస్థ ద్వారా ప్రధానంగా ఆయా ప్రాంతాలల్లో చెంచుల కొరకు విద్య, వైద్య, ఆరోగ్య, వ్యవసాయ, మంచి నీటి సరఫరా నీటిపారుదల, రహదార్ల నిర్మాణం, ఇళ్ళ నిర్మాణం మొదలైన విషయాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తూ .... వారి సర్వతోముఖాభివృద్ధికై తోడ్పడుతుంది. మి

---

# చరిత్ర....

ఎక్కడివీ ఈ పర్వత శ్రేణులు...
ఎక్కడివీ ఈ మహా సాగరాలు.
ఇవి మరకత మణులా
తొలి తొలి చినుకుల ముత్యాల రాశులా?
లేక మహసాహసికుల సమాధిరాళ్ళా
కాలాంతర దూరాల్లో నదుల గుండెల ఏడ్పు నీళ్ళా...

సిలువల ఎండిన నెత్తురు... వధ్యశిలల చిమ్మిన రవ్వలు...
యుద్ధభూములు రాలిన వీరులు
పుడమితల్లికి ఎప్పుడూ పరగడుపే...

పలకని దేవుళ్ళకయి ప్రార్థనలు
దిగిరాని దేవతలకై నిత్యార్చనలు.
మనిషిదెప్పుడు మతమౌఢ్యమే!
నాగరకతదెప్పుడు నరమేధమే!!

తెగలు తెగలుగా తెగిన మానవగణాలు..
తెరలు తెరలుగా చిరిగినా చరిత్రపుటలు.
ఈ మహారణ్యంలో, ఈ అయోమయంలో...
నీ సాంగత్యం, నీ సాన్నిహిత్యం...
అదే తూరుపు వెలుగు...

**- ఎ.కె.**



# చంద్రగ్రహణం

- హరిమోహన్ ఝా

సంప్రదాయంతో మీకు ఏ అసంతృప్తి, వివాదం లేకపోతే వర్తమాన కాలంలో మీకెలాంటి సృజనశీలత లేనట్లే!

సంప్రదాయ మూర్ఖ విశ్వాసాల్ని తూర్పారబట్టే వికటకవిని సృష్టించిన హరిమోహన్ ఝా (బీహార్‌లోని వైశాలి జిల్లాలో జన్మించారు, పాట్నా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. 20కి పైగా విశిష్ట రచనలు చేశారు) వ్యంగ్యరచనకు లక్ష్మిరెడ్డి అనువాదం ఆనందించండి.

ఆ రోజు చంద్రగ్రహణం. రాత్రి గ్రామవాసులు నదిలో స్నానం చేస్తూ ఉన్నారు. ఇక్కడ మా వికటకవి చిన్నాన్న పెరడులో కూర్చొని చలి కాచుకుంటూ ఉన్నాడు. నేను వెళ్ళి అన్నాను: చిన్నాన్నా, గ్రహణస్నానం చేయరా మీరు?

చిన్నాన్న : అరే, ఇది చలికాలం! మంచు కురుస్తూ ఉంది. ఈ అర్ధరాత్రి వేళ నేను స్నానానికి పోవాలా? నన్నేమైనా పిచ్చికుక్క కరిచిందా?

నేను : చూడండి రేవుదగ్గర ఎంత జనసమ్మర్దం కనిపిస్తూందో!

చిన్నాన్న : వణుకుతూ – ఓరి దేవుడా! రివ్వున వీచే ఈ చలి గాలి! ఈ చల్లని నీళ్ళు! రవంత ముట్టుకుంటే వేళ్ళు మంచు గడ్డలా అయిపోతున్నాయి! అయినా వేలమంది స్త్రీలు, పురుషులు రొమ్ము బంటి నీళ్ళలో నిలబడి ఉన్నారు. పిల్లలు వణికి పోతున్నారు. మగవాళ్ళు గడ్డకట్టుకు పోతున్నారు. కోమలాంగులు కొంకర్లు తిరిగి పోతున్నారు. తూర్పుగాలికి లేచిన అలలు తడిసిన పైటల్లో బాణాల్లాగా ప్రవేశించి వారి రొమ్ముల్ని ఛేదిస్తున్నాయి. అయినా పుణ్యం ఆశతో ఒకరిని చూసి ఒకరు స్నానానికి ఎగబడుతున్నారు.

నేను : అయితే మీరు స్నానం చేయరా?

చిన్నాన్న : అరే అబ్బాయి, చంద్రుని పైన భూమి నీడ పడుతూ ఉంది, అంతే, కొంత సేపట్లో అదే తొలగి పోతుంది. అంతమాత్రానికి నేను నీళ్ళలో ఎందుకు మునగాలి? ఊరు–ఊరితో పాటు నన్ను కూడా పిచ్చివాణ్ణి కమ్మంటావా?

నేను : అక్కడ చూడండి, ఆ పురోహితుడు కళ్ళు మూసుకొని ఎట్లా జపం చేస్తున్నాడో! ఈసారి ఆయన గ్రహణం చూడకూడదట. అందువల్ల పైకి చూడడు.

చిన్నాన్న : చూస్తే ఏమవుతుంది?

నేను : మరణం.

చిన్నాన్న : మరణం తప్పదు ఎవరికైనా. కళ్ళు మూసుకుంటే, లేదా 'ఓం సోమాయ నమః' అని జపిస్తే అది తొలగి పోతుందా?

నేను : ఈసారి ఆయనకు మృత్యుయోగం ఉందట.

చిన్నాన్న : అరే, చిన్నప్పటి నుండీ నేను ఎన్ని మృత్యుయోగాలు దాటి వచ్చానో, చెప్పలేను. ఏనాడూ 'ఓం సూం సః' జపించలేదు. అయినా మృత్యుయోగం నా ఒక్క వెంట్రుక కూడా పీకలేకపోయింది. గ్రహశాంతి చేయనందువల్ల నిజంగానే చావు వచ్చేట్లయితే ఇంగ్లాండు, తుర్కిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బలూచిస్తాన్ మొదలైన దేశాలన్నీ ఎప్పుడో శ్మశానాలయి పోయి ఉండేవి. ఈ పురోహితుడి లాంటి పరమ బుద్ధిమంతులు కొందరు మాత్రమే జంబూద్వీపంలోని ఈ భరత ఖండాన్ని శోభాయమానం చేస్తూ ఉండేవారు.

---

హరిమోహన్ ఝా (1908-1984) అనువాదం : జె. లక్ష్మిరెడ్డి, సెల్ : 09811589430

నేను : అయితే రాశిఫలాలు, గ్రహశాంతులు నిరుపయోగమైనవనేనా మీరనేది?

చిన్నాన్న : నీవే ఆలోచించి చూడు. ఈసారి మీ పిన్నమ్మ రాశిఫలంలో, 'భార్య మరణం' అని రాసి ఉంది. స్త్రీలకు, పిల్లలకు, అవివాహితులకు ఈ ఫలితం ఎలా వర్తిస్తుంది, అని కూడా రాశిఫలం తయారుచేసిన పెద్దమనిషి ఆలోచించలేదు. బుద్ధిపూర్వకంగానే రాశిఫలాలు చాలా వరకు చెడ్డగానే ఉంచబడ్డాయి. చింత, దిగులు, గాయాలు, మానహాని ఇలాంటివి రాయకపోతే అరిష్ట పరిహారం పేరుతో ఈ ప్రబుద్ధులు తమ అవసరాలెలా తీర్చుకోగలరు? ఈ గ్రహణం చంద్రునికి కాదు, మనకే వస్తుందనుకో.

నేను : అదెట్లా చిన్నాన్నా?

చిన్నాన్న : చెప్తా విను, గ్రహణం రాగానే మనకు సూతకం అంటుకుంటుంది. జన్మ సూతకం, మరణ సూతకం లాగే గ్రహణ సూతకం కూడా. ఒక గంట ముందు నుంచే తిండి, నీళ్ళు బంద్. మట్టి కుండలు బయట పారేయ్. స్నానం చెయ్యి, జపం చెయ్యి, శాంతి చేయించు, పురోహితులకు దాన-దక్షిణలు ఇవ్వు. ఈ ధూర్తులు గ్రహణాన్ని కూడా ధనం సంగ్రహించడానికి మంచి మార్గంగా తయారు చేసుకున్నారు!

ఇంతలో 'గ్రహణ దానం చెయ్యండి', 'గ్రహణ దానం చెయ్యండి' అనే కేకలు మొదలయ్యాయి.

చిన్నాన్న : అటు చూడు, ఈ రాహువు బంధువులు తమ లంచం రాబట్టుకొనే ఆరాటంలో ఎంతగా గోల చేస్తున్నారో! లంచం చేతిలో పడిన తరువాత వీళ్ళు రాహువుకు సిఫారసు చేసి చంద్రుణ్ణి విడిపిస్తారట! అంతవరకు ఆ రాక్షసుడు చంద్రునిపైన కోరలు బిగించి పట్టుకొనే ఉంటాడు! చూస్తున్నావా, డబ్బుల వర్షం ఎలా కురుస్తూందో! ఏం తెలివి! ఏం తెలివి!!

నేను : చిన్నాన్నా, ఇదంతా గుడ్డినమ్మకమే నంటారా?

చిన్నాన్న : అందులో కూడా నీకు సందేహమా? ఈ రోజు దేశమంతటా తిరునాళ్ళు జరుగుతూ ఉంటాయి. కాశీ, ప్రయాగలో అయితే మానవ శిరస్సుల సముద్రమే తరంగాయితమై ఉంటుంది. అందులో ఎందరు పిల్లలు పోగొట్టుకు పోతారో, ఎందరు ముసలమ్మలు తొక్కిడిలో బలి అయిపోతారో, ఎందరు యువతులు వత్తిడిలో నలిపివేయబడతారో లెక్కించడం కష్టం. ఇలాంటి ధార్మిక పిచ్చి తొక్కిసలాట మరెక్కడైనా ఉందా? ఇతర దేశాల్లో ఇలాంటి సందర్భంలో ఒక్క పైసా కూడా ఖర్చుకాదు. మన దేశంలో మాత్రం కోట్ల రూపాయలు నీళ్ళ పాలు అయిపోతాయి. ఈ రూపాయలు గట్టి నేలపైన ఖర్చుపెడితే విదేశాల నుండి ధాన్యం తెప్పించుకోవలసిన అవసరం ఉండదు. కానీ మనం భూమి నీడపైన డబ్బు కురిపిస్తాం. కడుపుకు కూడులేదు, రొండిలో రొఖ్ఖంలేదు, అయినా ధర్మం పేరుతో నీళ్ళలో మునకలు వేయడంలో అందరికంటే ముందు ఉంటాం! ఈ ధర్మోన్మాదం వల్లనే గంగాస్నానం చేసేప్పుడు ఎందరికో పరమపద ప్రాప్తి (మరణం) కూడా కలుగుతూ ఉంటుంది.

నేను: చిన్నాన్నా, ఇలాంటి మూర్ఖత్వం ఎందుకు వచ్చిందో?

చిన్నాన్న : ఈ దేశంలో మూర్ఖత్వానికి ముఖ్య కారణం పురోహితులు.

నేను : పొడుపు కథలు చెప్పకండి! పురోహితులు మన మూర్ఖత్వానికి కారణం ఎలా అవుతారు?

చిన్నాన్న : చెప్తా విను. వాళ్ళ చేతికి ఒక విద్య చిక్కింది. అదే, గ్రహణాల గురించి తెలుసుకునే విద్య! ఈరోజు ఒక మామూలు విద్యార్థి కూడా గణితం ద్వారా ఈ విషయం తెలుసుకో గలుగుతాడు. కాని ఆ యుగంలో ఈ విద్యే వారికి కామధేనువయింది. సూర్యుడు, చంద్రుడు వారికి వెండి, బంగారం అయిపోయారు. ప్రజల మనసులో ఈ గుడ్డి నమ్మకం బలపడి పోయింది – 'ఈ పురోహితులు ఆకాశంలో ఏమి జరిగేది తెలుసుకో గలిగినప్పుడు భూమి పైన జరిగే విషయాలు ఎందుకు తెలుసుకోలేరు?' ఇక పురోహితులు కూడా తాము సర్వజ్ఞులైనట్లు నాటకమాడసాగారు. చంద్రగ్రహణంతో పాటు 'పాణిగ్రహణ' ముహూర్తం కూడా చెప్పడం మొదలు పెట్టారు. మెల్లమెల్లగా వాళ్ళు అన్ని గ్రహాలకూ కంట్రాక్టర్లు అయి కూర్చున్నారు. తర్వాత ఆ గ్రహాల పేరుతో ద్రవ్యగ్రహణం (సొమ్ము చేసుకోవడం) చేయడం మెదలుపెట్టారు. ఇంద్రజాలం ఎప్పుడూ అట్టహాసంగానే ఉంటుంది కదా! చూడు, ఎలాంటి నాటకీయ ఫక్కీలో వీరు దానం తీసుకుంటారో! చంద్రుని పేరుతో తెలుపురంగు వస్తువులు! వెండి, ముత్యాలు, శంఖాలు,

బియ్యం, పెరుగు, నెయ్యి, కర్పూరం, చందనం, తెల్లని బట్టలు, తెల్లని ఎద్దులు! శనిపేరుతో నల్లని వస్తువులు తీసుకుంటారు. నీల మణులు, నల్లని బట్టలు, ఇనుము, నువ్వులు, మినుములు, బర్రెలు, నల్ల ఆవు, ఇలాంటివి. సూర్యుని పేరుతో ఎరుపు రంగు వస్తువులు : బంగారం, రాగి, మణులు, పగడాలు, గోధుమలు, బెల్లము, కుంకుమ పువ్వు, ఎర్రని బట్టలు, ఎరుపు రంగు దూడ, ఇలాంటివి! ఎంత గొప్ప కవిత్వం అల్లారు! గృహస్థుకు ఇదంతా అతి ఖర్చుతో కూడిన వ్యవహారంగా ఉండవచ్చు. కానీ ఈ కవిత్వం అల్లిన వారికి మాత్రం అది 'అర్థకరీ' (ధనార్జనోపాయం)గా రూపొందింది. ఇదే విధంగా అన్ని గ్రహాలకు సంబంధించిన పద్దు పుస్తకాలు తెరిచేశారు. ఈ నవగ్రహాల కృపాకటాక్షం వల్ల పురోహితుల వేళ్ళలో అష్టధాతు ఉంగరాలు వచ్చి చేరసాగాయి. వారి ఆడవాళ్ళ బాహువుల్లో వంకీలు మెరవ సాగాయి. జ్యోతిష్యం ఇతరులకు ఫలించినా, ఫలించకపోయినా ఈ పురోహితులకు మాత్రం మహా బాగా ఫలించింది!

నేను : చిన్నాన్నా, అటు చూడండి. అక్కడ చౌదరిగారి భార్య నెయ్యి కుండ దానం చేస్తూంది.

చిన్నాన్న : మామూలుగా అయితే ఒక తులం నెయ్యి కూడా ఎవరికీ రాల్చదు. కాని, మన టక్కరి పురోహితులు తాము సృష్టించిన మాయాజాలంతో పూర్తి నెయ్యికుండనే కైవసం చేసుకుంటున్నారు. ఎలాంటి వచనం అల్లారోచూడు–

*'ఘృతకుంభోపరినిహితం శంఖం నవనీతపూరితం దద్యాత్*
*నాడ్యాదిదోషశాంత్యై ద్విజాయ దోషాకరగ్రహణే'*

(కృత్యమంజరి)

నాడీ దోషం పోవాలంటే చంద్రగ్రహణ సమయంలో నెయ్యి కుండ పైన వెన్నతో నింపిన శంఖం ఉంచి బ్రాహ్మణునికి దానం చేయాలట!

ఈ పురోహితులు గృహస్థుల 'నాడి' ఏవిధంగా పట్టుకున్నారంటే వాళ్ళను పూర్తిగా 'అనాడీలు' (అమాయకులు) గానే చేసేశారు. లోకుల 'నాడి' మాత్రమే కాదు, వాళ్ళ 'నారి' (స్త్రీ) కూడా ఈ పురోహితుల పిడికిట్లోకి వచ్చేసింది!

నేను : చిన్నాన్నా, మీరు అలంకారంలేకుండా మాట్లాడరు కదా!

చిన్నాన్న : అలంకారం కాదురా అబ్బీ, వాస్తవమే చెప్తున్నాను. పురోహితులు గృహస్థు భార్య జుట్టు కూడా తమ చేతుల్లో చిక్కించుకున్నారు.

నా ముఖంలో ఆశ్చర్యం చూసి చిన్నాన్న గూట్లో నుంచి మిథిలా రాజ్య పంచాంగం తీసి అన్నాడు, నీవే చూడు :

*'స్త్రీణాం కేశబంధన ముహూర్తాః*
*అశ్వినీ, ఆర్ద్రా, పుష్య, పునర్వసు నక్షత్రేషు'*

(స్త్రీలు జడవేసుకోడానికి, లేక కొప్పు కట్టుకోడానికి ముహూర్తాలు అశ్విని, ఆర్ద్రా, పుష్య, పునర్వసులు.)

'భరణి, కృత్తిక, రోహిణి, మృగశిర నక్షత్రేషు' ఎందుకు కాకూడదు? హరిణేక్షణ ఎవరైనా మృగశిర నక్షత్రంలో కొప్పుకట్టుకుంటే జ్యోతిష్యుని కొంప ఏమి మునుగుతుంది? వాళ్ళు పంచాంగం చూసి తమ పిలక ముడుచుకోవడం లేదు కదా, అలాంటప్పుడు ఆడవాళ్ళు పంచాంగం చూసే ఎందుకు కేశబంధనం చేసుకోవాలి?

నేను : పంచాంగంలో ఇలాంటివి కూడా ఉన్నట్లు నాకు తెలియదు చిన్నాన్నా!

పంచాంగం నా వైపుకు నెట్టుతూ చిన్నాన్న అన్నాడు: కావాలంటే చూడు. ఎంతెంత లావు అక్షరాల్లో శీర్షికలు ఇచ్చారో:

*'నవవధ్వాః పాకారంభః!' / 'ప్రసూతీనాం నఖచ్ఛేదనమ్!'*
*'స్త్రీణాం లాక్షాభరణ ధారణమ్!' / 'శిశుముఖే స్తనదానమ్!'*

('కొత్త కోడలు వంటింట్లోకి ఎప్పుడు వెళ్ళాలి? ప్రసవించిన స్త్రీ ఎప్పుడు గోర్లు కత్తిరించుకోవాలి? స్త్రీలు ఎప్పుడు లక్కగాజులు వేసుకోవాలి? శిశువు నోట్లో ఎప్పుడు స్తనం ఉంచాలి?') ఇలాంటి వాటన్నింటికీ కూడా ముహూర్తాలు నిర్ణయించడం జరిగింది. పెద్ద–పెద్ద మహామహోపాధ్యాయులు ఈ పంచాంగం పైన తమ ఆమోద ముద్ర వేశారు. చూడు, ఎలాంటి ప్రసిద్ధులైన పండితుల పేర్లు దీని పైన ముద్రించబడి ఉన్నాయో!

నేను : చిన్నాన్నా, పెద్ద–పెద్ద పండితులు ఇలాంటి క్షుద్ర విషయాల్లో ఎందుకు కలగ చేసుకుంటారు? వాళ్ళు ఎంతో ప్రాముఖ్యత ఉండే విషయాలకే తమ బుద్ధిని వెచ్చించాలి కదా!

చిన్నాన్న : మన దేశ పండితులు అలాంటి వార్రై ఉంటే ఈ ఏడుపంతా ఎందుకుండేది? కాని, వారంతా 'స్త్రీణాం అంగ స్ఫురణఫలమ్' (స్త్రీల అంగాలు అదరడం వల్ల కలిగే ఫలితాలు) లాంటి విషయాల్లోనే తమ పాండిత్యాన్ని ప్రదర్శిస్తారు. 'స్త్రీ తొడ అదిరితే ప్రేమ చూరగొంటుంది. నడుము అదిరితే నీచుణ్ణి ప్రేమిస్తుంది. నాభి అదిరితే పతి మరణిస్తాడు...' ఇలా ఎలాంటి పంచాంగం తయారు చేసి పడేశారంటే స్త్రీల పంచేంద్రియాలూ వీళ్ళ గుప్పిట్లో బందీ అయిపోయాయి!

నేను : కాని, పంచాంగంలో ముఖ్యమైన విషయాలు కూడా ఉన్నాయి కదా! ఉదాహరణకు వృష్టి యోగం, సంవత్సర ఫలితం.

పంచాంగం తెరుస్తూ చిన్నాన్న అన్నాడు : అది కూడా చూడు మరి. ఈ సారి 'పరాభవ' నామ సంవత్సరం, దాని ఫలితం ఇలా రాసి ఉంది :

*'పండితాశ్చ ప్రజాః సర్వే భయభీతాః పరాభవే'*

అంటే, పరాభవ నామ సంవత్సరంలో ప్రజలు పీడింపబడుతారు, అందరూ భయభ్రాంతులతో ఉంటారు, అని.

నేను : అయితే ఈ సంవత్సర ఫలితం బాగా లేదన్నమాట!

చిన్నాన్న : కానీ, ఈ సంవత్సరానికి అధిపతి బృహస్పతి. దాని ఫలితం ఇలా రాసి ఉంది :

*'విప్రా యజ్ఞరతా భవంతి తపసా శస్యైః క్షితిర్వ్యాపితా*
*రాజా మంత్రియుతో గణైశ్చ మహిపైర్దేశః సమృద్ధాలయః*
*రోగం ధ్వంతి సువృష్టయః ప్రతిదినం కౄరా వినశ్యంతి వై*
*చౌరవ్యాఘ్ర భుజంగమాశ్చ బహుధా నశ్యంతి జీవేఽబ్దపే*

అంటే, ధన ధాన్యాలతో, పశుగణాలతో దేశం సమృద్ధి కలిగి ఉంటుంది, వర్షాలు పుష్కలంగా కురుస్తాయి, రోగాలు నశిస్తాయి, రాజులు, బ్రాహ్మణులు తమ పనుల్లో లీనమై ఉంటారు, దొంగలు, పులులు, సర్పాలు, వీటి ఉపద్రవం ఉండదు.

నేను : అయితే సంవత్సర ఫలితం బాగుందన్నమాట! ప్రజలకు కష్టాలు ఉండవు.

చిన్నాన్న : ఆగు, కొంచెమాగు. ఈసారి సంవాహకుడనే పేరుగల సూర్యుదున్నాడు. దాని ఫలితం ఇలా రాసి ఉంది :

*'ఆదిత్యే బహువిత్తనాశనపరా లోకా జ్వరవ్యాకులాః*
*మేఘానాం జలహానిరేవ మహతీ శస్యస్య నాశో ధృవమ్'*

అంటే, ఈ సంవత్సరం ధననాశం జరుగుతుంది. ప్రజలు రోగగ్రస్తులై ఉంటారు. మేఘాలు వర్షించవు. ధాన్యం పండదు.

నేను : అలా అయితే కరువు కాటకాలతో ప్రజలు సర్వనాశనమై పోతారు!

చిన్నాన్న : ఆగు, కొంచెం ఆగు. ఈసారి ఉన్న మేఘం పేరు సంవర్తకం. దాని ఫలితం ఇలా రాసి ఉంది :

*'సంవర్తకే మహావృష్టిః శస్యవృద్ధికరీ శుభా*
*జలపూర్ణా మహీ నిత్యం జలదైర్వేష్టితం నభః'*

అంటే, ఈ సంవత్సరం బాగా వర్షాలు పడతాయి. ధాన్యం బాగా పండుతుంది, భూమి జలమగ్నం అయి ఉంటుంది, ఆకాశం ఎల్లప్పుడూ మేఘావృతమై ఉంటుంది.

నేను : చిన్నాన్నా, పంచాంగంలో ఇలాంటి పరస్పర విరుద్ధమైన మాటలు ఎందుకు రాసి ఉన్నాయి?

చిన్నాన్న : ఇందులోనే కదా ఉంది వారి టక్కరితనం! ఎలాంటి వల అల్లారంటే ఎట్టి పరిస్థితిలోనూ ఫలితం పంచాంగానికి విరుద్ధంగా వెళ్ళడానికి వీలే లేదు. వర్షం కురిస్తే సంవర్తకం అనే మేఘ ఫలితం. అనావృష్టి అయితే సంవాహకుడనే సూర్యుని ఫలితం. ఒకచోట అతివృష్టి, మరోచోట అనావృష్టి అయితే రెండింటి ఫలితం. అబ్బాయ్, వీళ్ళ జిత్తులు తెలుసు కోవడం సాధ్యం కాదు.

నేను : చిన్నాన్నా, వారఫలాలు, మాసఫలాలు లాంటివి పత్రికల్లో అచ్చు అవుతూ ఉంటాయే, అవీ ఇంతేనా?

చిన్నాన్న : పూర్తిగా. నీవే ఆలోచించు, ఆదాయము-ఖర్చు, దిగులు-సంతోషం, సుఖం-దుఃఖం ఇవన్నీ రోజూ కలిగేవే. మేషరాశి వానికయినా, వృషభరాశి వానికయినా. ఇలాంటి వాటినే అటు కలిపి, ఇటు కలిపి, ఎక్కువలు-తక్కువలు చేసి ఈ ధూర్తులు భవిష్యత్తు పేరుతో అమాయక ప్రజలను మోసపుచ్చుతూ ఉంటారు. మోసపుచ్చే వాళ్ళను మకరమని (మొసలి) మోసపోయే వాళ్ళను వృషభమని (ఎద్దు) అనుకో.

నా ముఖంలో ఆశ్చర్యం చూసి చిన్నాన్న అన్నాడు : చూడు, నేను పుట్టింది సింహరాశిలో. దాన్ననుసరించి ఈ

వారంలో ఫలితం, సుభోజనం. ఇక నీవే చూడు, మా ఇంట్లో వండిన భోజనం అందరూ తిన్నారు. వారిలో కుంభరాశి వారున్నారు, మిథునరాశి వాళ్ళూ ఉన్నారు. మరి వాళ్ళకు 'సుభోజనం' అని ఎందుకు రాయలేదు? ప్రపంచంలో సింహరాశి వాళ్ళు కోట్లకొలది ఉంటారు. వాళ్ళలో ఎందరో బిచ్చగాళ్ళు కూడా ఉంటారు. వాళ్ళకు 'కుభోజనం' కూడా సరిగా దొరికి ఉండదు. ఎందరో రోగులు ఉంటారు. పాపం! వాళ్ళు అన్నమే తిని ఉండరు. కాని, ఫలితం రాసేవాళ్ళు అలాంటి వాళ్ళ గురించి ఎందుకు ఆలోచిస్తారు? ఎవరికి ఎలాంటి భోజనం దొరికినా దొరకక పోయినా ఈ జ్యోతిష్యులు తమకు మాత్రం మంచి భోజనం ఏర్పాటు చేసుకున్నారు.

నేను : అయితే ఈ రాశిఫలాలన్నీ మిడుతంభొట్ల జోస్యం లాంటివేనంటారా?

చిన్నాన్న : మరేమనుకున్నావ్? ఎవరైనా జ్యోతిష్యుడు నా దగ్గరికి వస్తే ఒక్క నిముషంలో అతని బండారం బయటపెట్టేస్తాను!

నేను : ఏవిధంగా చిన్నాన్నా?

చిన్నాన్న : ఒక చిన్న ప్రశ్న అడుగుతాను, నా చేతిలో ఈ ఎలక్కాయ ఉంది. దీన్ని నేను నోట్లో వేసుకుంటానా, లేదా? దీనితోనే అతనికి ముచ్చెమటలు పోస్తాయి. వాళ్ళ బండారం బయట పడుతుందనే భయంతోనే కదా జ్యోతిష్యులు, తాంత్రికులు నా ఎదుటికి రారు!

నేను : కానీ చిన్నాన్నా, పంచాంగంలో పాశ్చాత్య శాస్త్రవిజ్ఞానం కూడా ఆశ్చర్యపోయే విషయాలు ఎన్నో ఉన్నాయట కదా!

చిరునవ్వు నవ్వుతూ చిన్నాన్న : అందులో ఏమీ సందేహం లేదు. ఎట్లాంటి విషయాలున్నాయంటే అందరు వైజ్ఞానికుల తల తిరిగి పోతుంది. ఉదాహరణకు: భూమి ఎప్పుడు శయనిస్తుంది? ఎప్పుడు మేల్కొని ఉంటుంది? అగ్ని ఎప్పుడు ఆకాశంలో ఉంటుంది? ఎప్పుడు పాతాళంలో ఉంటుంది? దుర్గ ఏ సంవత్సరం ఏనుగునెక్కి వస్తుంది? ఏ సంవత్సరం పల్లకీలో కూర్చొని వస్తుంది? శివుడు ఎప్పుడు నంది పైన సవారీ చేస్తాడు? ఎప్పుడు పార్వతితో పాటు విహరిస్తాడు? ఇది చూడు, శ్రావణ కృష్ణ చతుర్దశి గురించి ఏమి రాశారో : *'కామవిద్ధో హర్ష పూజ్యః !'* అంటే ఆరోజు మన్మథుని బాణంతో గాయపడిన శివుని పూజించాలి! నీవే చెప్పు, ఏ దేశం క్యాలెండరు లోనైనా ఇలాంటి మాటలుంటాయా?

నేను : చిన్నాన్నా, మీ మాటలకు జవాబు ఏమీ తోచదు.

చిన్నాన్న : అబ్బాయీ, ఇక్కడి జ్యోతిష్యులే పెద్ద దండం పెట్టవలసిన దేవతలు. ***'జామాతా దశమోగ్రహః'*** (అల్లుడు దశమ గ్రహం) అని నానుడి. కాని, నేను మాత్రం ***'జ్యోతిషీ దశమో గ్రహః'*** అని అంటాను. ఇతర దేశాల జ్యోతిషాచార్యులు టెలిస్కోపు సహాయంతో గ్రహ-నక్షత్రాల సూక్ష్మాతి సూక్ష్మపరిశీలన చేస్తూ ఉండగా మన జ్యోతిష్యులు ఇల్లు కదలకుండా లాభనష్టాల లెక్కలు వేసుకుంటూ ఉంటారు :

*'సమ్ముఖే చార్థలాభశ్చ వామే చంద్రే ధనక్షయః'*

('చంద్రుడు ఎదురుగా ఉంటే ఆదాయం ఉంటుంది, ఎడమగా ఉంటే నష్టం వస్తుంది.') అందువల్లనే అమెరికా వాళ్ళు చంద్రలోకం చేరుకొని అక్కడి నుండి చంద్రశిలలు కూడా తీసుకురాగా, మన మాత్రం ఇంకా *'చతుర్థీ చంద్రాయ నమః'* అంటూ ఇక్కడి నుండే చంద్రునికి అరటిపండ్లు చూపిస్తూ ఉన్నాం.

నేను : చిన్నాన్నా, ఇది నిజంగా సిగ్గుపడవలసిన విషయం.

చిన్నాన్న : అబ్బాయీ, చంద్రుణ్ణి మనం 'చంద్రకాంత' నవలలోని ఇంద్రజాలం లాగా తయారు చేసి వదలిపెట్టేశాం. మునుపు కృష్ణుని బాల లీలల్లో వినిపించే 'అమ్మా, చంద్రుడి బొమ్మ నాకు కావాలి' లాంటి మాటలు, కవిత్వంలో కనిపించే 'పిచ్చి చకోర పక్షి పాపం చంద్రుణ్ణి ప్రేమిస్తుంది', 'చంద్రుణ్ణి తాకాలి!' లాంటి మాటలు అసంభవ కల్పనలుగా ఉండేవి. ఇప్పుడు శాస్త్రవిజ్ఞానం ఆ అసంభవాలను సంభవం చేసేసింది. ఇప్పుడు పిల్లవానికి చంద్రుణ్ణి ఆటబొమ్మగా ఇవ్వవచ్చు. చకోరం చంద్రునితో కలుసుకునేట్లు చేయవచ్చు. ఇప్పుడు సుందరీమణులు చంద్రముఖులుగా కాక చంద్రాభిముఖులుగా ఉంటారు. 'చంద్రునిపైన ఉమియడం సాధ్యమా?' అనే సామెతలోని అసంభవ కల్పనను సార్థకం చేస్తూ వారు చంద్రునిపైన ఉమియగలరు కూడా!

నేను : చంద్రగ్రహణం జరిగేప్పుడు మీరు ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారా?

***(మిగతాది 52వ పుటలో...)***



# కట్టమంచి - రాళ్ళపల్లి

- కుర్రా జితేంద్రబాబు

**ఇ**ద్దరు ప్రతిభావంతుల స్నేహం భాషకు, జాతికి ఎంత మేలు చేస్తుందో - వారు సమాజాన్ని ఎలా సుసంపన్నం చేయగలరో తెలియజేసే వ్యాసం ఇది. స్నేహం ఇద్దరి వ్యక్తులకే పరిమితం కావలసిన విషయం కాదని, వారున్న కాలానికీ చెందిన సమాజానికే కాక ముందుతరాలను కూడా ప్రభావితం చేయగలదని గుర్తించగలం

**క**ట్టమంచి - రాళ్ళపల్లి అనునవి రాయలసీమలోని రెండు గ్రామాల పేర్లు. కట్టమంచి గ్రామం చిత్తూరు సమీపంలోను, రాళ్ళపల్లి గ్రామం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం తాలూకాలోను వున్నవి. ఈ రెండు గ్రామాల పేర్లే ఇంటిపేర్లుగా కలిగి కట్టమంచి రామలింగారెడ్డి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మలు తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధులైనారు. రామలింగారెడ్డి ఆంధ్రాంగ్ల సాహిత్య ప్రజ్ఞతోపాటు, సాహిత్యంలో కొత్త విమర్శనా ప్రక్రియకు ఆద్యుడు, వాగ్మి, ప్రజాస్వామ్యవాది, చతురవచనుడు, భాషాసేవకుడిగా, అపారశేముషీ సంపన్నుడైతే, అనంతకృష్ణశర్మ సంస్కృత ప్రాకృతాంధ్ర కర్ణాట భాషామహాప్రవాహముల కూడలి. వీరి సాహిత్యచర్చలు తెలుగు సాహిత్య విమర్శకు మేలుకొలుపు.

కట్టమంచి రామలింగారెడ్డి క్రీ.శ. 1880 డిసెంబరు 10వ తేదీన కట్టమంచి గ్రామంలో జన్మించారు. వీరి తండ్రి సుబ్రమణ్యరెడ్డి ఫస్టుక్లాసు ప్లీడరుగా వుండి వీరు 'మహాభారత సారరత్నావళి' మరియు 'భాగవత సారముక్తావళి' అను గ్రంథాలను రచించారు. రామలింగారెడ్డి తమ తండ్రిగారిని గూర్చి ఈ కృతుల పీఠికలో "వీరి యింగ్లీషు లా లైబ్రరీ యంత భండాగారమును చిత్తూరు B.A. B.L.లు ఎవ్వరు సేకరించలేదు. తెనుగున వీరు చేసిన కృతులే వీరి రసికత్వమునకును వివేచనకును సాక్ష్యములు. తొలుత మా తండ్రిగారు పిత్రాచారమును బట్టి గుమాస్తాపనిలో దిగిరి. కొన్ని యేండ్లకు జిల్లా కోర్టులో రికార్డుకీపరైరి. త్వరలో నాపనికి రాజీనామా యిచ్చి కార్వేటి నగర సంస్థానములో మేనేజరుగా జేరిరి. అక్కడి రాజుల విపరీత రాజసము తనకు సరిపడ నందున దానిని వదలి ఫస్టుగ్రేడు ప్లీడరుసన్నదును సంపాదించుకొని వకీలు వృత్తి నాశ్రయించి దానికిని దనకును నసాధారణమైన కీర్తిందెచ్చిరి." అని పేర్కొన్నారు.

రామలింగారెడ్డి కట్టమంచి గ్రామ వీధిబడిలో ప్రాథమిక విద్య ప్రారంభించి, చిత్తూరు హైస్కూల్లో 1890లో మొదటి ఫారంలో ప్రవేశించి, 1896 లో ఉన్నత పాఠశాల పరీక్షలలో ఉత్తీర్ణులయినారు. 1897 నుండి 1902 వరకు మద్రాసు క్రైస్తవ కళాశాలలో విద్యనభ్యసించి బి.ఏ. తత్వశాస్త్రంతోను, అర్థశాస్త్రంతోనూ ఉత్తీర్ణుడై, బంగారు పతకాలను సాధించారు. 1899 లో క్రైస్తవ కళాశాల విద్యార్థిగా 'ముసలమ్మ మరణము' అను లఘు కావ్యాన్ని రచించారు. ఈ క్రైస్తవ కళాశాలలో శ్రీమదాంధ్ర భాషాభిరంజనీ సమాజపోషకులగు సమర్థి రంగయ్యశెట్టి నవ్యకావ్య రచయితలకు ప్రోత్సాహాన్నిచ్చుటకై నిర్వహించిన పోటీలో రామలింగారెడ్డి 'ముసలమ్మ మరణం' రచనకు న్యాయనిర్ణేతలైన వేదం వెంకటరాయశాస్త్రి మొదటి బహుమతిని ప్రకటించారు. ఆ తరువాత రామలింగారెడ్డి

*(మిగతాది 34వ పుటలో...)*

కట్టమంచి రామలింగారెడ్డి (1880-1951)      రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ (1893-1979)



# మౌలిక శక్తులు

సృష్టికి మూలాధారం వాయువు.
దాని గమనానికి ఎన్నెన్ని రీతులో
గణనాతీతం.
అది సుతిమెత్తగా కదిలితే పిల్లగాలి అవుతుంది
శ్రుతి మించి సాగితే సుడిగాలి అవుతుంది.
మండుటెండల్లో సలసల కాగుతూ
గుప్పున విసిరికొడితే వడగాలి అవుతుంది
ప్రకృతిలో వివిధ గతుల్లో
తన అస్తిత్వాన్ని ప్రదర్శించే వాయువే
మనిషి మనుగడకు మూలశక్తిగా రూపొందుతుంది.
ప్రాణి పసికందుగా కన్ను విప్పిన నాటి నుంచి
శాశ్వతంగా కన్నుమూసే వరకు
శ్వాసగా కదలాడేది వాయువే.
మానవుని నిద్రావస్థలో
నిరంతర జాగృతంగా వుండే సహచరి శ్వాస.
మనిషి మనసుకుండే అవస్థా భేదాలన్నీ
శ్వాసకుంటాయి.
మనసు ప్రశాంతంగా వున్నప్పుడు
శ్వాసగతి నిదానంగా నిర్వికల్పంగా వుంటుంది.
ఆ మనసే ఉద్రిక్తతకు లోనైతే
అదే శ్వాసలో
కోడెతాచుల బుసబుసలు వినిపిస్తాయి.
నియమబద్ధంగా నిగ్రహించుకోగలిగితే
శ్వాస యోగమవుతుంది.
పెదవుల అంచుల పైనుంచి లేచి
వెదురు రంధ్రాల్లోంచి స్వరబద్ధంగా వెలువడితే
అది రాగమవుతుంది.
ప్రకృతినీ మానవ ప్రకృతినీ
వాయురూపంలో శ్వాసరూపంలో నడిపించే
ఆ అదృశ్య జీవశక్తికి
అక్షరాత్మకంగా అర్పించే నివాళులివే.



(డా. సి. నారాయణరెడ్డి)



# రవీంద్రుని 'చిత్రం'

ఓ చిత్రమా!
నీవు నిశ్శబ్దపు లోతుల్లో నిద్రిస్తుంటే
నా కుంచె రేఖలతో
నిన్ను మేల్కొల్పాను -
అనురాగాలూ, ద్వేషాలు అలుముకున్న
ఈ ప్రపంచంలోకి అడుగు పెట్టించాను
ఒకప్పుడు నీకు రూపమే లేదు,
నిన్ను త్వరగా చేజిక్కించుకొని
రంగుల, రేఖల పరిధుల్లో బంధించగల
నిపుణ చిత్రకారుని కోసం
మౌన భాషణతో ఎదురుతెన్నులు చూస్తున్నావు
నా దారిన నేను వెళ్తుంటే
నీ విన్నపం
అస్తిత్వం లేని శూన్యాన్ని ఛేదించుకొని
అస్పష్ట స్వప్నంలా
నా నుదుటిని స్పృశించింది
అనంత నైరూప్య సాగరంలోనుంచి
రేఖ ప్రపంచంలోని నిన్ను తీసుకు వచ్చాను
నా లోపం వల్ల నీ సౌందర్యానికి కళంకం గల్గిందా?
నీ రూప హృదయంలో బాధ ప్రతిధ్వనిస్తుందా?
యదార్థమైన అస్తిత్వాన్ని గౌరవించవా?
నా కృషి అంత అవమానకరమై పోవలసిందేనా?!
రూపంలో దోషమేదైనా వున్నా
అది చిరకాలం వుండదు కదా!
దాని భారంతో అదీ నశిస్తుంది
అవ్యక్తమైన నైరూప్య సాగరంలో కలిసిపోతుంది
నీవు మరలా స్వేచ్ఛ పొందుతావు -

---

ఆంగ్లం నుంచి అనువాదం : పెద్ది సాంబశివరావు, సెల్ : 9441065414

*(31వ పుట తరువాయి...)*

## కట్టమంచి - రాళ్ళపల్లి

రచించిన 'కవిత్వతత్త్వ విచారం' అను పేర కళాపూర్ణోదయ విమర్శనా వ్యాసాన్ని సావధానంగా విని గుణదోషాలను వివరించి 'అత్యుక్తిదోషమును సవరించుకొన్న నీవు మంచి విమర్శకుడ వగుదు'వని ప్రోత్సహించారు.

రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ ఈ 'కవిత్వతత్వ విచార' గ్రంథాన్ని గూర్చి పేర్కొంటూ "కావ్య నాటకాదులను శాస్త్రీయమగు పారిభాషిక దృష్టితో చూచి తూచుట యొకదారి. దానియందు తెలిసియో తెలియకయో ప్రతిబింబించిన ఆయా కాలపు సాంఘిక రాజకీయాది విషయముల నెఱుగు కంటితో మూలముట్టుగ పరిశోధించుట రెండవ దారి. ఇది గాక గ్రంథకర్త యొక్క ఆశలు, అభిమానములు, రాగద్వేషములు మొదలగు జీవన సూత్రములను గమనించి, వాని యావిష్కరణ పద్ధతులు, అందుచే మన హృదయమందు గలుగు సంవాద వివాదములును బైలు పఱచుట మూడవది. మొదటిరెండు మార్గములను ఎంత యుపయోగకరము లైనను గుమాస్తా పనికి చేరినవి కేవలం విషయసంగ్రహం మాత్రమే. మూడవది అనుభవ సంగ్రహము. ఒక్క కావ్యమును విషయీకరించుకొని వ్రాసిన మఱొక కావ్యమనవచ్చును. ఇట్టి రచనలు తెలుగులో రావడానికి దారి తీసినవారిలో అగ్రేసరులు నే నెఱిగినంత వరకు కట్టమంచి రామలింగారెడ్డి గారే.. ఇట్టి విమర్శనములను గూర్చియే 'ప్రతి విమర్శనమును ఒక ఆత్మకథ' (Every Criticism is an autobiography) అను మాట పుట్టినది. ఇది శాస్త్రము కాదు, చర్వణము. బంధము గాదు, బ్రతుకు".. (ప్రబంధనాయికలు, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ పేజి 1, 2) ఈ గ్రంథం ప్రథమంగా 1914లో ముద్రణమై ఆ తర్వాత అనేక ముద్రణలు వెలువడినది.

బి.ఏ. పరీక్షలో అత్యుత్తమ బంగారు పతకాలను అందుకొన్న రామలింగారెడ్డి భారత ప్రభుత్వం రెండువందల పౌనుల విద్యార్థివేతనాన్ని ఇవ్వటంతో కేంబ్రిడ్జిలోని సెయింట్‌జోన్స్ కళాశాలలో 1903 సంవత్సరంలో ప్రవేశించారు. 1904 వ సంవత్సరంలో ఆ కళాశాలలో Foundation Scholar of St. John's College గా ఎన్నికైనాడు. 1905 వ సంవత్సరంలో కేంబ్రిడ్జి యూనివర్సిటీ లిబరల్‌క్లబ్ కార్యదర్శిగా ఎన్నికై 100 సభలను ఏర్పాటుజేసి లిబరల్ పార్టీకి అనుకూలంగా ఆ సంవత్సరం జరిగిన పార్లమెంటు ఎన్నికలలో బ్రహ్మాండమైన ఉపన్యాసాలు ఇచ్చాడు. 1907 వ సంవత్సరంలో బరోడా కళాశాలలో ప్రిన్సిపల్‌గావున్న అరవిందో, కలకత్తాలోని జాతీయ కళాశాలకు ప్రిన్సిపల్‌గా వెళ్ళడంతో రామలింగారెడ్డి ఆ కళాశాలకు ప్రిన్సిపల్‌గా నియమితులై 1909 వరకు పనిచేసారు. 1910 వ సం॥లో మైసూరు మహారాజ ఆహ్వానంతో సంస్థానంలో విద్యా విధానంలో రావల్సిన మార్పులగురించి మూడు ఉపన్యాసాలు ఇచ్చారు. 1921 వరకు మైసూరులో విద్యా శాఖాధికారిగా ఉద్యోగం నిర్వహించి, విద్యారంగంలో అనేక మార్పులు తీసుకువచ్చారు. 1911-1912 సం॥లో 'అర్థశాస్త్రం' అను గ్రంథాన్ని రచించగా వీటిని రెండు సంపుటాలుగా విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి ప్రచురించింది. మైసూరులో విశ్వవిద్యాలయం స్థాపింపదలచి మైసూరు రాజైన కృష్ణరాజ ఒడయారు వివిధ దేశాల విద్యా విధానమును పరిశీలించుటకు 1914వ సం॥న రామలింగారెడ్డిని విదేశాలకు పంపినారు. ఆయన కెనడా, జపాన్, ఫిలిప్పైన్ దీవులు, హాంకాంగ్ మొదలగు దేశాలలో పర్యటించి "Deputation Studies in Education" అను ఒక రిపోర్టును సమర్పించారు. 1916వ సం॥ జూలై నెలలో రామలింగారెడ్డి కృషితో మైసూరు విశ్వ విద్యాలయం ప్రారంభమైంది. 1915 నుండి 1917 వరకు మైసూరు మహారాజా కళాశాల ప్రిన్సిపాలుగా ఉన్నారు. 1921లో మైసూరులో విద్యాశాఖాధికారిగా పదవీ విరమణజేసి మద్రాసువచ్చి రాజకీయాలలో ప్రవేశించి, యూనివర్సిటీ నియోజకవర్గానికి ప్రతినిధిగా ఎన్నికైనాడు. మద్రాసు విశ్వ విద్యాలయ పునఃనిర్మాణ బిల్లును 22 నవంబర్ 1922 సం॥లో శాసనసభలో ప్రవేశపెట్టినారు. అనేక సమస్యలపై శాసనసభలో అద్భుతమైన ప్రసంగాలుచేసి గొప్ప వక్తగా పేరుగాంచారు. ఆంధ్రవిశ్వవిద్యాలయ ఏర్పాటుకు విశేషమైన కృషి చేసారు. మద్రాసు శాసనసభకు కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికైన తరువాత, చిత్తూరు జిల్లా బోర్డుమెంబర్‌గా పోటీచేసి 1935లో గెలిచి, 1936లో దానికి రాజీనామాచేసి, ఆంధ్రవిశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడిగా నియమింపబడినారు. విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడుగా 1936వ సంవత్సరంనుండి 1949వ సం॥వరకు పనిచేసారు. 1949వ సం॥లో మైసూరు తిరిగివచ్చి అచ్చటి విద్యాపద్ధతుల్ని సమగ్రంగా పరిశీలించి, ఆధునిక పరిస్థితులకనుగుణంగా విద్యావిధానపు ఆవశ్యకతను సూచిస్తూ ఒక రిపోర్టును మైసూరు ముఖ్యమంత్రికి అందజేసాడు.

1950లో ఆరోగ్యం దెబ్బతినడంతో ఉద్యోగానికి రాజీనామాచేసి విశ్రాంతి తీసుకుంటూ 24 ఫిబ్రవరి, 1951లో కన్నుమూశారు.

అనంతకృష్ణశర్మ క్రీ.శ. 1893 జనవరి 23వ తేది అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం తాలూకా రాళ్ళపల్లి అనుగ్రామంలో అలివేలు మంగమ్మ, కర్నమడకల కృష్ణమాచార్యుల దంపతులకు జన్మించారు. కృష్ణమాచార్యుల పూర్వీకులు అనంతపురం జిల్లా రాయదుర్గం సంస్థాన పండితులుగా ఉండేవారు. కృష్ణమాచార్యుల వివాహం తిరుమల అనంతాచార్యులు, లక్ష్మమ్మల ఏకైక పుత్రికయైన అలివేలుమంగమ్మతో జరుగుటవలన ఆనాటికి ఇరువురి తండ్రులు గతించివుండటంవలన వివాహానంతరం కృష్ణమాచార్యులు తన తల్లిగారైన లక్ష్మమ్మతో చెన్నంపల్లి గ్రామాన్ని వదలి రాళ్ళపల్లిలో అత్తగారింటిలో స్థిరపడినారు. కృష్ణమాచార్యులకు భార్యవైపు నుండి, రాయదుర్గం, కళ్యాణదుర్గం, హిందూపురం తాలూకాల్లో శ్రోత్రియ ఇనాము భూములు, సుమారు 2800 ఎకరాలు తన స్వంత ఆస్తి కూడా నూర్ల ఎకరాలు, సారము, సత్తువ గురించి చెప్పనవసరము లేని, భూములు సంక్రమించాయి.

కృష్ణమాచార్యులవారికి దాదాపు 15 మంది సంతానం. అందులో ఏడెనిమిదిమంది బాల్యమందే మరణించారు. ఆరుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు మాత్రము మిగిలారు. వారిలో జ్యోతిష్య శాస్త్రవేత్తగా ప్రఖ్యాతులైన కర్నమడకల గోపాలకృష్ణ మాచార్యులు జ్యేష్ఠులు. వీరు 1957 నుండి 1961 వరకు "భారతి" పత్రికలో రాళ్ళపల్లి గోపాలకృష్ణ మాచార్యుల పేరున జ్యోతిష్య శాస్త్ర సంబంధ వ్యాసాలు అనేకం వ్రాసారు." వీరు 8.4.1963లో మరణించారు. గోపాలకృష్ణమాచార్యులు అనంతకృష్ణ శర్మ జాతకమును "అనుజుని జాతకము" అనుపేర (పుటలు: 4–10 శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ సన్మాన సంచిక, అక్టోబరు 1961) రచించారు.

రెండవవారు అనంతకృష్ణశర్మ. వీరి సోదరులు రామాచార్యులు, శ్రీనివాసాచార్యులు, లక్ష్మణాచార్యులు మరియు రంగాచార్యులుగారలు. యదుగిరమ్మ, సుభద్రమ్మలు అనంతకృష్ణశర్మ అక్క, చెల్లెళ్లు. అనంతకృష్ణ శర్మ, మాతామహి లక్ష్మమ్మకు చిన్నతనాన్నే దత్తత పోయినాడు. అందువల్ల "రాళ్ళపల్లి" అన్న అమ్మమ్మ ఇంటిపేరే శర్మ ఇంటిపేరు అయింది. అటు తండ్రి ఆస్తిలో కొంతభాగానికి, తల్లి సంపూర్ణ ఆస్తికి అనంతకృష్ణ శర్మ వారసుడైనాడు. తండ్రివద్దే 13 సం॥లు వచ్చేవరకు సంస్కృత రామాయణ సంగ్రహం, రఘువంశం, చంపూరామాయణం, చంపూభారతం, విశ్వగుణాదర్శం, అధ్యయనం జేశారు. తెలుగులో 'అచ్చతెలుగు రామాయణం', 'నీలాసుందరి పరిణయం', 'ఆంధ్రనామ సంగ్రహం అధ్యయనం జేశారు. 'నా గురువులు' అను వ్యాసంలో అనంతకృష్ణశర్మ తనతండ్రి బోధనాపద్ధతిని గూర్చి పేర్కొంటూ "శాఖాచంక్ర మణము ఎప్పుడును చేయక శ్లోకార్థ తాత్పర్యములను వారివలె ప్రశాంతముగా చెప్పగలుగుట ఉపాధ్యాయులలో ఎందరో సాధింపలేని సిద్ధి". "కావ్యనాటక రసానుభవము వారికెంత తీవ్రమో అంత అంతరంగమైనది, ఆధ్యాత్మికమైనది.. చక్కని కవితను వారులోగినవారే కాని బహిరంగముగా సాత్విక భావములు ప్రదర్శించుట వారి వాడుక కాదు. అదొక అసాధారణమైన ఆత్మసంయమము వారిది." ఈబోధనా పద్ధతినే అనంతకృష్ణశర్మ అవలంభించారు. తల్లిగారే వారికి సంగీత గురువులైనారు. వారి తల్లివద్ద సంస్కృతం, తెలుగు, కన్నడం, తమిళంలో భజనకీర్తనలు, పెళ్ళిపాటలు, జోల పాటలు, పూజ పాటలు, కథాగేయాలు మొదలైనవన్నీ నేర్చుకున్నారు. మేనమామ ప్రోత్సాహంతో ఫిడేలు వాయించడం నేర్చుకొన్నారు. రాళ్ళపల్లిలో విద్యా సౌకర్యాలు లేనందున 1906లో మైసూరుప్రాంతానికివెళ్ళి, శ్రీ పరకాల మఠంలో విద్యాభ్యాసం చేశారు. సజ్జయ తాతాచార్యులనే వారివద్ద ఒకటిన్నర సంవత్సరం సంస్కృత కావ్యాలు, 'భారవి' 'కిరాతార్జునీయం' చదివారు. అక్కడినుండి చామరాజేంద్ర సంస్కృత మహాపాఠశాలలోచేరి, సంస్కృత వ్యాకరణం, షడ్భాషా చంద్రిక (ప్రాకృత వ్యాకరణం) అలంకారాలు, శాకుంతాలాది నాటకాలు చదివారు. 1911 సంవత్సరంలో 'తారాదేవి', 1913వ సంవత్సరంలో 'మీరాబాయి' అను ఖండకావ్యాలను రచించినా, ఆ తర్వాత కావ్యరచనను కొనసాగించలేదు.

కట్టమంచి రామలింగారెడ్డి పరిచయం రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మకు 1910లో జరిగింది. అప్పట్లో రామలింగారెడ్డి మైసూరు మహారాజ కాలేజిలో చరిత్ర, తత్వశాస్త్రం, ఆంగ్లసాహిత్యం, తర్కం బోధించే ఆచార్యులుగా వున్నారు. రామలింగారెడ్డి శిష్యులు, ఆ తర్వాత రాళ్ళపల్లివారి పెద్దకుమార్తె నాగమణికి మామగారు అయిన కందాళ రఘునాధాచార్యులు మొదటిసారిగా రామలింగారెడ్డికి, అనంతకృష్ణ శర్మని పరిచయం చేశారు. ఆనాటి వారి పరిచయాన్ని గూర్చి అనంతకృష్ణశర్మ తెలుపుతూ "వారితో పరిచయము నాకు కలిగినది ప్రాయశః 1910లో. అప్పటికే

ఆయన పాండిత్యం, వ్యుత్పత్తి, ప్రఖ్యాతి సర్వతోభద్రముగా నెలకొన్నది. మైసూరు మహారాజ కళాశాలలో చరిత్ర, తత్వశాస్త్రము, ఆంగ్లసాహిత్యం, తర్కము బోధించు ప్రధానోపాధ్యాయుడుగా వారుండిన కాలము. కాలేజీ చదువులతో సంబంధములేని వాడను గనుక వారి వద్ద పుస్తకం పట్టి చదువు యోగము నాకు లభించలేదు. అది లభించిన శిష్యపరంపరకు వారి యెడ కలిగిన భక్తి, గౌరవాభిమానములు మరి ఏ యుపాధ్యాయుడు సాధింపలేనంత గొప్పవి. విశాలమైన దృష్టి, వికాసశీలమైన వాగ్మిత్వము, హార్దమైన పరిహాసకుశలత, నిశితమైన విమర్శ, నిర్భయమైన అభిప్రాయములు – ఇవి వారి సొత్తులు. అప్పుడు వారి శిష్యులై, ఇప్పుడు నాకు వియ్యంకులుగా ఉన్న శ్రీ రఘునాథాచార్యులు మూలమున నాకు వారితోడి ప్రథమ దర్శన, పరిచయములు దొరకొన్నవి. కన్నడ దేశమున తెలుగు గ్రంథములు లేక వేకారుచున్న రెడ్డిగారు నా పరిచయమునకు సర్వాంగీణ స్వాగతమిచ్చిరి. ప్రాత ప్రపంచముననే ప్రాకులాడుతున్న నాకు వారితోడి సహవాసము ఆధునిక ప్రపంచపు తలుపులు తెఱచి ఆహ్వానించినది. దాని విలువ ఆయనగారి ఇతర శిష్యులకన్నా నాకు ఎక్కువ తెలిసినదనవచ్చును. అది మొదలు మా సంబంధము దిన దినము పెరుగుతూ వచ్చింది. వారిని చూడని దినము దుర్దినముగా తోచినది. సాయంకాలము ఏ రెండు మూడు గంటల కాలమైనను మేమిద్దరముకూర్చొని కాలక్షేపము చేయని దినములు చాలా తక్కువ. తెలుగు కావ్యములు, ముఖ్యంగా కవిత్రయ రచనలు చదువుకొనుట, దానిపై లోకాభిరామాయణంగా ఎన్నో విషయాలు వారు చెప్పుట, నాతో చెప్పించుట మా గోష్ఠికి పారాయణము. వారి వినోదము కొఱకే నేను తెలుగు కవిత్వముకు శ్రీకారము చుట్టితిని. నేను రచించిన "మీరాబాయి", "తారాదేవి" అను ఖండ కావ్యములను వారు శ్రద్ధతో విని, అభినందింపగలంత వారు ఇతరులు లేరు. కాళిదాసుని రఘువంశమును నేను తెనిగించు పూనిక వారి కొరకే. అందలి రెండు సర్గలు ప్రత్యక్షముగను విని ముందరి సాగుకు ప్రోత్సహించినారు. తెనిగింపు ఎంత యెగుడు దిగుడుగానున్నను, మూలము నూహించి, భావించు ప్రతిభా శక్తులు వారివి కనుకనే నా రచన ఆయనవద్ద చెల్లుబడి యైనది. కాని అటువంటి భావుకత కలవారు తెలుగు వారిలో ఎందరు లభింతురు? కనుకనే 1912వ సంవత్సరముననే నా రఘువంశము తెనిగింపు 16 సర్గలు పూర్తిగా ముగించితిని గాని దాని ప్రకటింపుమని, ద్రవ్యము గూడా వారు ముందుగనే యియ్యసిద్ధపడి చెప్పినను నేనాపని చేయలేక నా రచనను చెదలపాలు చేసితిని. తెలుగు మహాభారతమందు, అందు తిక్కనగారి రచనయందు అభిరుచిని, అభిమానమును కలిగించిన పుణ్యము రెడ్డిగారిది. నేటికిని శిశుపాలుడు, భీముడు, ద్రౌపది, కర్ణుడు, దుర్యోధనుడు, అశ్వత్థామ మొదలగు పాత్రల చిత్రణమును తెలుగు భారతమున చదివినప్పుడెల్లా రెడ్డిగారనుభవించిన భాష్పరోమాంచములు నా భావనలో ప్రతిఫలింపక యుండవు. నా మిత్రులు శ్రీ అబ్బూరి రామకృష్ణా రావుగారు మా గోష్ఠిలో కొన్నాళ్ళు యుండిన దాని ఫలమే, యీ మధుర గీతిక

**"పూజాతి సాంద్ర కర్పూరమ్ములందు /ప్రాఙ్న దీపాథోల వంబుల యందు మడచు సన్ననిపాట,పాడుచు వెన్నెల తేట/కలవు తిక్కన పల్కు తెలుగు పల్కులకు"**

'అర్థశాస్త్రము', 'కవిత్వతత్త్వ విచారము'ను రెడ్డిగారు రచించు సందర్భమున వారి చిత్తు ప్రతిని, అచ్చుప్రతిగా తయారు చేయుపని నాకిచ్చిరి. ఆ సందర్భమున సామాన్య సాహిత్యమునకు సంబంధించిన తెలివిడి, కనువిప్పు నాకెంతో కలిగినది. ఎన్నో భావములు విప్లవములుగా మారినవి. నా తెలుగు జీవితమునకు ముఖ్య దోహదము రెడ్డిదే యని ఇచట సూచింపనెంచితిని. నా అభిప్రాయములలో ఏమైనను తీవ్రత, ఆర్జవము కలదేని అది వారి సహవాస ప్రసాదము, ఉపదేశ ఫలము (కట్టమంచివారి వైలక్షణ్యం, శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ సన్మాన సంచిక పేజి 14,15). రామలింగారెడ్డి అర్థశాస్త్రమునకు, కవిత్వ తత్వ విచారము గ్రంథాల రచనాకాలములో అచ్చులోని అక్షర దోషాలు దిద్దినందులకు మైత్రీ చిహ్నముగా శ్రీ అనంతకృష్ణశర్మకు కృతజ్ఞతలు తెలుపుతూ

**"శ్రీ మనంత కృష్ణులు, విశేష గుణాఢ్యులు సంస్కృతాంధ్ర భాషా మహనీయ విద్యల విశారద భావులు నాకు దోడుగాఁ బ్రేమయు గారవంబు యెయి పెక్కు విధములనిల్చి సేయనే నోమితిఁ గాక లేనియెడ నోర్వఁగ నేర్తునే కార్యభారమున్".**

1910లో ఏర్పడిన వారిద్దరి పరిచయం రామలింగారెడ్డి గారి మరణమువరకు కొనసాగింది. అనంతకృష్ణశర్మగారి మాటల్లో వారి అనుబంధం గూర్చి చెప్పాలంటే "ఇరుప్రక్కలా మూడవ వ్యక్తికి చొరవ లేని ముగ్ధ మధుర సంబంధం మాది."

అనంతకృష్ణశర్మ తన 'నా గురువులు' అన్న వ్యాసంలో రామలింగారెడ్డిని గురువుగా భావించి రెడ్డిగారి పరిచయ మేర్పడునప్పటికి శర్మగారికి వారికంటె కొంత ఎక్కువగా తెలిసినది సంస్కృత సాహిత్యము మాత్రమే. తెలుగు కవిత్వాన్ని–

ముఖ్యంగా తిక్కన భారతాన్ని–జీర్ణించుకొన్న రెడ్డిగారితో శర్మగారు వారానికి నాలుగైదు సాయంకాలాలైనను సాహిత్య సల్లాపాలు చేస్తూ గడిపేవారు. "పాత ప్రపంచముననే ప్రాకులాడుచున్న నాకు వారితోడి సహవాసము ఆధునిక ప్రపంచపు తలుపులు తెరచి ఆహ్వానించినది" అని శర్మగారే వ్రాశారు. అనంతకృష్ణశర్మ తాను రామలింగారెడ్డి పై రాసిన వ్యాసంలో "ఆ కాలేజీలో అదివరకూ లేని తెలుగుశాఖను నా కోసమే ప్రారంభం చేయించినాడాయన అని నా నమ్మకం. ఇంకొక రహస్యం కూడా వుందిందులో. నన్ను తెలుగు పండితుడుగా ఉద్యోగం ఆయన చేయించిన కాలంలో – అంటే 1912లో నాకు తెలిసిన తెలుగు చాలా స్వల్పం. మా పితృపాదులు రాళ్ళపల్లిలో నా చిన్నతనంలో చెప్పిన 'అచ్చతెలుగు రామాయణం', నీలాసుందరీ పరిణయం', ఆంధ్రనామ సంగ్రహం'–ఇంతలో అది ముక్తాయింపుపై ఉండేది. రామలింగారెడ్డిగారు తృప్తికై 'పండిత పదవి' నధిష్టించిన తరువాత నా తెలుగు చదువును యథాశక్తిగా ముందుకు సాగించవలసి వచ్చింది. నాకు ఆ చొరవ గూడా రెడ్డిగారి సహవాసం వల్ల సంక్రమించిన గంధలేశమే – నాటికి నేటికి."

కట్టమంచివారుకూడా రాళ్ళపల్లినిగూర్చి "వీరు ఆంధ్రలోకమున సుప్రసిద్ధులు. సంస్కృత విద్యాపారీణులు. సంగీత కళాకోవిదులు. ఒక పాండిత్యమే కాక రసికత్వమును సంపూర్ణముగ వహించిన ధన్యులు, ముఖ్యముగా నాకెంతయు మిత్రులు" అని అభిమానాన్ని ప్రకటించారు. వీరిద్దరు తెలుగు సాహిత్య విమర్శకులకు మార్గదర్శులే కాక, సాహితీ ఉపాసకుల హృదయాలకు ఉత్తేజం కలిగించిన ప్రముఖులు. వీరిరువురూ కలిసి వేమన ఉపన్యాసాల ద్వారా వేమనను వెలుగులోకి తేవడం, రంగనాథరామాయణం పరిష్కరించి ప్రకటించడం తెలుగు సాహిత్యంలో సాధించిన మహత్కార్యాలు.

## రాళ్ళపల్లివారి వేమన ఉపన్యాసాలు

*కట్టమంచివారి ప్రోద్బలంతో రాళ్ళపల్లివారు చేసిన 'వేమన' ఉపన్యాసాలు తెలుగువారిని, పరిశోధకులను గత ఎనభై ఏళ్ళుగా ఆలోచింప జేస్తూనే ఉన్నాయి. అందునా మొదటి ఉపన్యాసంలోని మౌలికమైన విషయాలు – వేమన శైలి, తెలుగు భాష, ఆంధ్రుల తత్వమూ మొదలైనవి – ఇప్పటి తరానికి తెలియజేయవలసిన బాధ్యత మనందరిది. అందులో ముఖ్యమైన భాగాలు కొన్నింటిని మీకోసం...*

వేమన ఆంధ్రులలో సాటిలేని వ్యక్తి. అతీంద్రియములైన తత్త్వములను దెలిసికొనవలెనను నాశ, వాని ననుభవ పూర్వకముగా సాధించు సాహసము, తనకుఁ దెలిసిన వానిని నిర్భయముగా ప్రపంచమునకు బోధించు ధైర్యము, దానికి సాధనమై యిరుప్రక్కలందును మఱుఁగులేని మంచిపదనుగల చురకత్తివంటి కవితాశక్తి, దానికి మెఱుఁగిచ్చునట్టి సంకేతదూషితము కాని ప్రపంచ వ్యవహారములందలి సూక్ష్మదృష్టి, గాయపుమందు కత్తికేపూసి కొట్టినట్లు తిట్టుచునే నవ్వించు 'హాస్యకుశలత' – ఇవన్నియు వేమన్నను సృష్టి చేయునపుడు బ్రహ్మదేవుఁడుపయోగించిన మూలద్రవ్యములు. తత్త్వ విద్యార్థులున్నారు కాని వారిదంతయు పుస్తక పాఠము. వారి శక్తి యంతయు ఇతరులు చెప్పిన దానిని వల్లించుటలో ముగిసినది. యోగమును సాధించు వీరులున్నారు గాని వారిలో ననేకులకు మాటలాడుటయే రాదు. వచ్చినను ఇతరులకు బోధించుటకు కాలము కర్చుపెట్టుట నష్టమని భావించువారే యనేకులు తక్కిన వారు చాలవఱకు తాము సత్యమని నమ్మినవానిని గూడ ఇతరుల మనసు నొచ్చునేమోయని చెప్పక తప్పించుకొని తిరుగునట్టి 'ధన్యులు'. కవులు మనలో దండిగ – కావలసినంతకన్న ఎక్కువగానే యున్నారు. కాని వారిది మన ప్రపంచముగాదు. గంధర్వ నగరము. ఇఁక తిట్టుకవిత్వము తెలుఁగువారు పెట్టిన భిక్షయే కవిత్వమును తిట్లకై యుపయోగించుట తెనుఁగు జాతిలోని విశేషగుణము! కాని యా తిట్లలో స్వార్థమున్నంత పరార్థము లేదు. 'నాకియ్యలేద'ని తిట్టినవారే కాని 'నీవు చెడిపోవుచున్నా'వని తిట్టిన వారరుదు. ఇఁక హాస్యమా? అది మన తాతలగు సంస్కృతము వారికే రాదు, మనకెట్లు వచ్చును? నవ్వించు వారున్నారు అసహ్యముతో నవ్వుదుము వెక్కిరింతలకు నవ్వుదుము అంతే కాని నయముతోడి నవ్వు మనకింకను ఎవరైన నేర్పవలసి యున్నది. పై గుణములన్నియు ఒకచో నేకీభవించిన మూర్తి వేమన తప్ప తెలుఁగు వారిలో ఇతరుఁడు నాకంటబడలేదు.

ఆంధ్రులలో కొన్ని విచిత్రములు గలవు. వానికి తృప్తి కరముగా నిదివఱకెవరును సమాధాన మిచ్చి యుండలేదు. భరతఖండమున ప్రసిద్ధములగు నన్ని భాషలలోను ప్రవేశించి అసంఖ్య గ్రంథములను వ్రాసిన జైనులు మన భాషలో గ్రంథములు రచించినట్లే కానరాకపోవుట యొకటి. ఆంధ్రభాష ద్రావిడ శాఖనుండి చాల నాళ్ళ క్రిందనే చీలి వేఱు పడినదని స్పష్టముగా నూహింప వీలున్నను, పదునొకండవ శతాబ్దికి వెనుక సారస్వత వ్యాపారమే యందులో జరిగినట్లు తెలియక పోవుట వేఱొకటి. సంస్కృత వాఙ్మయములో చక్కని నాటక రచన రెండు వేల యేండ్లకు ముందునుండి జరిగివచ్చుచున్నను, ఆ వాఙ్మయమునే

ఆధారముగాఁగొని శబ్దము, అర్థము, భావము గూడ అనువాదము చేయుచు వచ్చిన యాంధ్రులలో ఒక్కనికైన మొన్నటివఱకు అట్టి నాటకములను తెనుఁగున గూడ వ్రాయవలయునను నాశ జనించినట్లే తోఁపకపోవుట మఱి యొకటి!

ఈయన్నిటి కంటె విచిత్రమైన విషయము: సుప్రసిద్ధమత స్థాపకు లెవరును ఆంధ్రులై పుట్టి ఆంధ్రదేశమున మత బోధచేయక పోవుట. ప్రాచీన కాలమున – అనఁగా ఉపనిషత్తుల కాలమున – శిష్యులే గురువును వెదకుకొనిపోయి తత్త్వబోధను బొందుచుండిరింతే కాని తత్త్వజ్ఞుఁ డితరులున్నచోటికిఁ బోయి బలవంతముగా నైనను బోధించి మతపుగుంపులను తయారుచేయ మొదలిడినవాఁడు బుద్ధుఁడే కాఁబోలు. వానికి తరువాతి వారిలో మొదటి వ్యక్తి శంకరాచార్యులు. ఇతఁడు మళయాళమున జనించి, ఆసేతుహిమాచలము సంచరించి, యద్వైత ప్రధానముగా వైదిక మతమును బోధించి, యందందు మఠములను స్థాపించెను. ఇతని ముఖ్యపీఠమైన శృంగగిరి జన్మదేశమునకు సమీపమందే కన్నడదేశమందున్నది. కాని యాంధ్రదేశమందితని మఠముగాని, సంచారము చేసినట్లు గుర్తులు గాని కానరావు. రామానుజాచార్యులు అరవదేశమందు జనించెను. శంకరాచార్యుల వలె భరతఖండ మంతయు సంచరించి, వైదికమతము భక్తి ప్రధానమైన విశిష్టాద్వైతమని బోధించి, మఠము లందందు స్థాపించెను గాని, యితని కాంధ్రదేశమందు సంచారము చేయునవకాశము లభింపలేదు. మఱి ఆంధ్రులు తన్ను భయపెట్టుగా కన్నడ దేశమునకు పాఱిపోవలసి వచ్చెను. శుద్ధకర్ణాటకుఁడగు ఆనందతీర్థాచార్యుల ద్వైతమత వ్యాప్తి కర్ణాట మహారాష్ట్ర దేశములను దాటినట్లే కానరాదు. వీరివలె వైదిక మతమునే వేఱు వేఱు విధముగా బోధించిన నింబార్కాచార్యులును, వల్లభాచార్యులును ఆంధ్రజాతికిఁ జేరినవారైనను వారి మతమంతయు ఆంధ్రదేశము వెలుపలనే యున్నది. ఏ కారణముచేతనైనను స్వదేశము, స్వజాతివారికి పనికి రాదయ్యెను. ఇఁక బసవేశ్వరుఁడు ఆంధ్రుఁడనుకొనుటలో అభిమానమెంత యున్నదో అసత్య మంతయున్నది. అతని వ్రాఁతలనుకొనుటలో అభిమాన మెంత యున్నదో అసత్య మంతయున్నది. అతని వ్రాఁతలన్నియు కన్నడమందే కలవు. శ్రీవైష్ణవుల కరవమువలె నేఁటికిని వీరశైవులకు కన్నడ మభిమాన భాష.

ఇట్లగుట కేమి కారణము? తెలుఁగు వారికి తీవ్రములగు తత్త్వములను విచారించుటకుఁ గావలసిన మేధాశక్తి లేదని చెప్పుట సాహసము. వారికి తత్త్వవిచారములందు రుచిలేదని యూహించుట యన్యాయమగును. మతమనునది, యొకడు తానెఱిఁగినది యింకొకనికిఁ జెప్పి, యతడు వినకున్న నీ యిష్టమని వెడలి పోవుట కాక, యొకవ్యక్తి యొక సంఘమునకే తత్త్వమును దెలిపి, దానినాశ్రయించినందుకు గుఱుతుగా వేషము, భాష, ఆచారము మొదలగు వానియందు ఆ సంఘమున కంతయు మార్పును గలిగించునది యగుటచే, సహజముగా స్వాతంత్ర్య రక్తియు, స్వాభిమానమును బలముగాఁగల యాంధ్రజాతిని గొఱ్ఱెల మందలవలె నొకమతపు దొడ్డిలోఁ దోలుటకే తత్త్వజ్ఞునికిని సాధ్యముగాక పోయెనేమో! వివేకానందుఁడు, రామతీర్థస్వామి మొదలగు మహాపురుషు లెన్ని యుపన్యాసములిచ్చి యెంతప్రయాస పడినను, స్వతంత్రబుద్ధి బలసిన పాశ్చాత్యజాతి హిందూమతము నాశ్రయింప దలుపలేదని మనమెఱుగుదుము గదా. మఱియు మొదటినుండి రాజకీయ విప్లవములచేతను, అంతరంగ బహిరంగ కలహములచేతను, నెమ్మదిని శాంతిని క్రమముగా ననుభవించిన వారు కారు గావున, మనవారికీ తొందఱలే చాలినన్ని యుండుటచేత, పారలౌకిక విషయములను తత్త్వవిషయములను విమర్శించి నిర్ణయించునంతటి యోర్పు లేకుండును. ఆంధ్రులు కొంత నెమ్మది ననుభవించిన కాలము కాకతీయుల సామ్రాజ్యమందును, విజయనగరపు సామ్రాజ్య కాలమందును. అందు మొదటి కాలమున వీరశైవమతమును, రెండవ కాలమున రామానుజమతమును ఆంధ్రదేశమును ప్రవేశించి నిల్చినవి. కాని యామాత్రము గూడ మతకర్తల మూలమును గాక, వారి యనుయాయులగు మత ప్రచారకుల మూలమున వచ్చినందు వలన, ఆంధ్రజాతియందు పైమతములకు ధృఢమైన నిలుకడ కలుగలేదు. మొదటి నుండియు తత్త్వవిచారమును మతమును ఎక్కువగాఁ బట్టుకొన్నవారు బ్రాహ్మణులు. ఆంధ్ర బ్రాహ్మణులలో ముక్కాలుమువ్వీసము అందఱు అద్వైతులే. వీరందఱును ప్రాయశ్చ దేశాంతరమునుండి వలసవచ్చి చేరి నిలిచిన శాంకర మతానుయాయులు. తెనుగు దేశమందలి మాధ్వ రామానుజీయ బ్రాహ్మణులెవరుగాని నిజమైన యాంధ్రులుగారు. ఇఁక బ్రాహ్మణేతరులలో వీరశైవముగాని వీరవైష్ణవము గాని వేఱొని నిలువలేదు. భస్మధారణముచేసిన పాపమని గాని, నామాలు వేసిన నరకమమనిగాని తీవ్రముగా నమ్మిన బ్రాహ్మణేతరు లాంధ్రులలో నెక్కువగాలేరు. కావుననే శ్రీశైలము, అహోబిలము తప్ప సుప్రసిద్ధమైన శైవవైష్ణవక్షేత్రము లేవియు తెలుఁగు దేశమున లేవు. అందు రెండవది యిప్పటికిని అరవవారి యాజమాన్యమందే యున్నది. శ్రీశైలపు సమాచారము నేనెఱుఁగను. ఇఁక తిరుపతి మాదనుకొని సంతోషించు తెలుఁగువారు ధన్యులు గాని యదంతయు అరవ సామ్రాజ్యమే. అది యట్లుండె. చెప్పవచ్చిన దేమనుగా ఆంధ్రులలో మత ప్రచారకులందందపురూపముగాఁ గలరు గాని మతకర్తలు లేరనుట. ఆ మతప్రచారకులును చాలవఱకును తత్త్వబలముచేఁ గాక తామాశ్రయించిన రాజుల కత్తిబలముచే స్వకార్యమును సాధించిన వారుగానే కానవచ్చుచున్నారు.

# నేనెరిగిన పుట్టపర్తివారు

- జానమద్ది హనుమచ్ఛాస్త్రి

అనంతమైన అనుభూతులకు అక్షరరూపమిచ్చి, వందకుపైగా రచనలు చేసి, కవిగా, విమర్శకుడుగా, సమ్మోహక శక్తిగల వక్తగా, వాగ్గేయకారుడుగా, అధ్యాపకుడుగా, భాషా శాస్త్రవేత్తగా, నటుడుగా పేరుగాంచిన ప్రజ్ఞానిధి పుట్టపర్తి నారాయణాచార్యులు.

ప్రాచీనతకు ఆధునికతకు, సనాతనకు, లౌకికతకు, భక్తికి, రక్తికి సేతువు ఆయన.

పుట్టపర్తి అనంతపురంజిల్లా చియ్యేడు గ్రామంలో, పండితులైన శ్రీనివాసాచార్య కొండమ్మ దంపతులకు 28-3-1914న జన్మించారు. తండ్రివద్ద సంస్కృతాంధ్ర కావ్యముల అధ్యయనం చేశారు. పెనుకొండ హైస్కూల్లో ఫోర్తుఫామ్ (నేటి 9వ తరగతి) తోనే చదువు ముగిసింది. పెనుకొండలోని మహాలక్ష్మమ్మ వద్ద సంగీతం, నాట్యము అభ్యసించారు. పెనుకొండ సబ్‌కలెక్టర్ భార్య వి.జె. పిట్ ఆంగ్లభాషా కోవిదులు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పట్టభద్రురాలు. రాబర్ట్ బ్రౌనింగ్ కవితలపై విశేష అధ్యయనం చేసిన మహిళ. ఆమె వద్ద ఆంగ్ల కవితల అధ్యయనం చేసిన పుట్టపర్తి, కొన్నేళ్ళ తర్వాత "leaves in the Wind" కవితా సంపుటిని రచించాడు. ఆ కవితలను చదివిన హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ "This Collection gives us an insight into the soul, heart and mind of a genuine poet" అని ప్రశంసించారు.

తన 14వ ఏటనే 'పెనుగొండ లక్ష్మి' అన్న ఖండకావ్యం రచించారు. అందలి "ఉలిచే రాలకు చక్కలింతండి ఆయుః ప్రాణము కోల్పోయి శిల్పుల మాగాణము" అన్న పంక్తులు చదివి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, పుట్టపర్తి ప్రతిభా



పుట్టపర్తి నారాయణాచార్యులు

వ్యుత్పత్తులను ప్రశంసించారు. పుట్టపర్తి మద్రాసు విశ్వవిద్యాలయ, 'విద్వాన్' పరీక్ష రాసినపుడు, తాను రాసిన 'పెనుగొండ లక్ష్మి' ప్రశస్తిపై సమాధానం రాయవలసి వచ్చింది. ఈ సంఘటన మరే కవి జీవితంలో జరిగి వుండదు.

విజయనగర సామ్రాజ్య చరిత్ర, పుట్టపర్తి చారిత్రక పరిశోధనకు దర్పణంగా వుంది. రాయలన్నా, రాయల కావ్యాలన్నా అమితమైన ఆసక్తికలవారాయన. అన్నమయ్య రచనలన్నింటినీ అవలోధన చేశారు. బహుళ జనాదరణ పొందిన అన్నమయ్య రచన 'బ్రహ్మకడిగిన పాదము పామిడి తురగపు పాదము' అన్న ప్రయోగమునకు వారిచ్చిన వివరణ. ఆలోచనాత్మకం, పామిడి అనంతపురం జిల్లాలోని ఒక పెద్ద ఊరు. విజయనగర రాజుల కాలంలో, గుర్రపు దండులకు బిడారంగా వుండేది. తిరుమలేశుని దశావతార వర్ణనలో, కల్కి అవతార పాదాన్ని, పామిడి తురగపు పాదంగా వర్ణించాడు

డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి, ఫోన్ : 08562-243923

అన్నమయ్య అని వివరించాడు పుట్టపర్తి. నిరంతర అధ్యయన శీలి అయిన ఆచార్యులు 'వసుచరిత్ర' కావ్యాన్ని తలస్పర్శిగా అధ్యయనం చేశారు. ఆ కావ్యంలో 'ఆళువ' అన్న పదాన్ని విశ్లేషిస్తూ 'ఆళువుపట్టు' అంటే 'హఠం' అన్నారు. ఆళువ అన్నది ఒక జంతువు. అది చిన్న తాబేలు వంటిది. దీని వీపంతా చిన్న చిప్పలుంటాయట. స్పర్శ తగిలినా, దాని కాళ్ళతో ఉడుంపట్టులా పట్టుకొంటుంది. ఆ చిప్పలో కాలుపెట్టిన, గోవిందే! ఒకసారి నా చిన్నప్పుడు, ఒక పులి ఆళువపై కాలు పెట్టింది. చిప్పలు బిగుసుకొన్నవి. పెద్దపులి కాలు ఇరుక్కొని అరచి అరచి చచ్చింది. ఈ జంతువును ఉత్తరాదివారు ఏమంటారో తెలియదు. రాయలసీమలో 'ఆళువుపట్టు' అంటారు. ఈ రీతిగా ప్రబంధ రహస్యాలను విశ్లేషించిన మహామనీషి ఆయన (వ్యాసవాటిక – పుట్టపర్తి నాగపద్మిని).

కొంతకాలం ప్రొద్దుటూరు మునిసిపల్ హైస్కూల్‌లో పండితులుగా పనిచేశారు. రోజూ సాయంత్రం అగస్త్యేశ్వర స్వామి దర్శనానికి వెళ్ళేవారు. పరమశివుని తాండవం, పార్వతీదేవి 'లాస్యం' పుట్టపర్తి వారి మేధా వేదికపై ఆవిష్కరింపబడిన గొప్ప గేయ కృతి వారి 'శివతాండవం'.

**"ఏమానందము భూమీతలమున**
**శివతాండవమట! శివలాస్యంబట"**

అంటూ కావ్యారంభంలో శివపార్వతులను స్తుతించి వారి అనుగ్రహం కావటంతో కావ్యం ప్రారంభమవుతుంది.

**"తలపైన చదలేటి అలలు తాండవమాడ**
**అలల త్రోపుడుల క్రొన్నెల పూవుగదలాడ"**

మొదలైనది శివతాండవం.

'త'కారం శంకరుడని, 'ల' కారం శక్తి అని శివశక్తులను తలపించే 'తల' అన్న పదంతో కావ్యారంభం కావటం శక్తిమంతంగా, శుభప్రదంగా రూపుదాల్చింది. లాస్య ఔద్ధత్య సంకేతాలుగా అర్ధనారీశ్వర తత్వాన్ని ఆవిష్కరించే ఔచితిమంతం' శివతాండవ కావ్యం అన్నారు వరఘుల రంగాచార్య (1992).

సంస్కృతంలో రాసిన, శివకర్ణామృతము, త్యాగరాజ సుప్రభాతము వారి భక్తిపారవశ్యకతకు నిదర్శనాలు.

జ్ఞానేశ్వర, సమర్థ రామదాస వంటి మహారాష్ట్ర భక్త కవుల ప్రభావం కన్నడ కవులైన పంప, రన్న, కుమార వ్యాసుల కావ్య పరిమళాలను తెలుగు రసజ్ఞులకు పంచి పెట్టినారాయన. తులసీదాసు, రామచరితము, వారి నిత్యపారాయణ గ్రంథం. ఆ ప్రభావం పుట్టపర్తి వారి జనప్రియ రామాయణంలో కానవస్తుంది.

ఒకమారు ఉత్తరదేశ యాత్ర చేస్తు హృషికేశ్ చేరారు. హిమాలయాల్లో పర్యటిస్తూ శివానందుల ఆశ్రమం చేరారు. పుట్టపర్తి వారి బహు భాషా పాండిత్యమనకు ముగ్ధులై 'సరస్వతీపుత్ర' బిరుదంతో ఆశీర్వదించారు. కొంతకాలం అరవిందుల అంతేవాసిగ పాండిచ్చేరిలో వుండి ఫ్రెంచి భాషను అభ్యసించారు. బహుభాషా పరిచయంతో హృదయవైశాల్యం పెరుగుతుందనే వారు ఆచార్యులు.

కేరళ విశ్వవిద్యాలయంలో భాషా శాస్త్ర పరిశోధకులుగా పనిచేశారు. అక్కడున్న మళయాళంలోని, కొందిలై ఇనుక్కు నుసలైక్కో, అన్న మళయాల నవలను తెనుగు చేశారు. విశ్వనాథ వారి 'ఏకవీర' నవలను మలయాళమున కనువదించారు.

పుట్టపర్తి రచించిన 'మేఘదూతం' (మాత్రా ఛందస్సు) వారి మానవతా వాదానికి పెట్టిన పేరు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ఒక దేశ భక్తుని బళ్ళారి కారాగారంలో బంధించారు. జైల్లో నుండి శ్రీకాకుళంలో వున్న తన భార్యకు సందేశం పంపిస్తూ రాసిన కావ్యమే 'మేఘదూతం'. సమకాలీన రాజకీయ, సాంఘిక పరిస్థితులు, ఆంధ్ర ప్రాంతమందలి భౌగోళిక, చారిత్రక కట్టడాలను, ప్రజల దైన్య స్థితిని గుండెలో కరుగునట్లు చిత్రించారు.

**మనుజులను నే గోరలేనూ, శిలలైన**
**మనుషులకు నే పాడలేనూ**
**ఈసెరుగనట్టి జీసస్సు రక్తముగ్రోలి**
**పాశవమ్ముగ మార్చె భూమినే ఈ జాతి**
**నా సఖుడవిన్నావొ కావొ, సోక్ర**
**టీసును చంపిన గాథలేవో**
**ఆశ్చర్యముగానట్టి విశ్వమానవమైత్రి**
**బోధ చేసిన యట్టి బుద్ధుడే మాయెనో"**

అని దీనంగా విలపిస్తాడా ఖైది.

*(మిగతాది 48వ పుటలో...)*



# ఆయీ జ్ఞాపకాలు

- *నటరాజ రామకృష్ణ*

*ఆయీ చనిపోయిన తర్వాత ఆమె స్మృతులు నన్ను వెన్నాడుతూనే ఉన్నాయి.*

కొద్దిరోజుల నుండి నాకు జ్వరం వస్తూంది. ఎక్కడికి వెళ్ళకుండా ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకొంటున్నాను. ఆ నాటి సాయంత్రం ఫ్లాస్కుతో టీ తీసుకొని ఆయీ నా గదికి వచ్చింది. నా మంచం ప్రక్కన స్టూల్ మీద కూర్చొని, నా తలపైని చెయ్యిపెట్టి, నా ముఖంలోకి చూసింది. ఆ చేతి స్పర్శ ఎవరిదో నాకు తెలుసు. అందుకని కళ్ళు తెరచి ఆమె వైపు చూశాను. ఆమె నా నుదిటిమీద మెల్లగా రాస్తూ "ఎలా ఉంది రాంబాబూ?" అని అడిగింది. ఆ ప్రశ్నలో ఎంతో ఆప్యాయత ఉంది.

"ఇన్నాళ్లూ ఎక్కడున్నావు ఆయీ?" నా కళ్లలో నీళ్లు నిండాయి. "ఊరు వెళ్లాను రాంబాబూ! రాగానే నీ వంట్లో బాగాలేదని తెలిసి వచ్చాను. రాంబాబూ! ఈ నాలుగు రోజుల బట్టీ నీకెవరు సహాయం చేశారు?"

"ఎవరున్నారు ఆయీ? నేనే...." "రాంబాబూ! నే నొక విషయం అడగనా?... ఏమీ అనుకోవు గదా?" నా కళ్ళ నీరు తుడుస్తూ అంది.

"ఏమిటి ఆయీ?" "ఏమీ అనుకోనంటేనే అడుగుతా?" "ఏమి అనుకోను. అడుగు ఆయీ!" "బాబూ! పెళ్ళి చేసుకోవా?" "ఎక్కడైనా అమ్మాయిని చూశావా?" "చేసుకొంటానంటే తప్పకుండా చూస్తాను." "ఆయీ! నీవూ ఒక కళాపిపాసివి. చదువుకొన్నదానివి. నా కళాభ్యాసం, కళాభివృద్ధి, కళా ప్రచారం వీటిని గురించి అడగకుండా ఇదేం ప్రశ్న ఆయీ?"

"రాంబాబూ!" ఇప్పుడు ఒంటరి జీవితం బాగానే కనబడవచ్చు. నీకు 50 సంవత్సరాల వయస్సు దాటిని తర్వాతగానీ నీకు ఈ బ్రహ్మచారి జీవితం గురించి తెలిసిరాదు. రాంబాబూ! నాదీ ఒంటరి జీవితమే. నాదీ కళా జీవితమే. నా కౌమార దశ నుండి ఎన్నో నాట్య కచ్చేరీలు చేస్తూంటే ఎంతో మంది నా చుట్టూ తిరగడం మొదలు పెట్టారు. అదంతా వారికి నా యందుండిన అభిమాన మనుకొన్నాను. అదంతా మిథ్య అని తర్వాత గ్రహించాను. ఇప్పుడు నేను దిక్కులేని ఒంటరిదాన్ని రాంబాబూ! మనిషి అన్నవాడు పూర్తిగా సన్యాసైనా కావాలి. పూర్తిగా సంసారైనా కావాలి. ఈ మధ్య రకం బతుకు చాలా కష్టం బాబూ! రాను, రాను నీకే తెలుస్తుంది. ఇలా అన్నానని ఏమీ అనుకోకు."

"ఏమీ అనుకోను ఆయీ! నీకు తోచింది నీవు చెప్పావు. ఇందులో అనుకొనడానికి ఏముంది? చెప్పు."

"రాంబాబూ ఆనాడు రెండు చేతులా సంపాదించాను. జాగ్రత్తగా దాచుకోకుండా చేతికి ఎముక లేకుండా దాన ధర్మాలు చేశాను. నా వల్ల ఎందరో బాగుపడ్డారు. కానీ వారిలో ఒక్కరు కూడా ఈనాడు నాకు ముఖం చూపించరు. ఇదే బాబూ! లోకం తీరు! నీవూ నాలాగే కళ! త్యాగం! ధర్మం! అన్నావంటే నాలాగే...." "ఆయీ! నీకిప్పు డేమయింది?"

"చూస్తున్నావుగా! ఆ రోజులు తలుచుకొని, ఈ రోజులు చూసుకొంటే నా హృదయం ద్రవించిపోతుంది." "ఆయీ! ఆనాడు నీకు ఏది ఉచితమని తోచిందో అది చేశావు. ఈనాడు విచారించి ఏం లాభం?"

"రాంబాబు! నా సంగతి వదిలిపెట్టు. నీ సంగతి చెప్పు. బ్యాంకులో ఏమైనా వేస్తున్నావా?" "ఆయీ! ఆ పరమశివుడు ఏం చేశాడు? తనకున్న దంతా దానం చేశాడు. అడిగిన వారికి లేదనకుండా ఇచ్చాడు. తర్వాత అన్నపూర్ణ వద్దకు వెళ్ళాడు.

ఏమంటావు?" "అదే నేనూ చెప్పా లనుకొంటున్నాను. ఎక్కడైనా ఒక మంచి అన్నపూర్ణను చూసుకోమంటున్నాను."

ఆయీ మాటలకు అంత జ్వరంలోనూ నాకు నవ్వొచ్చింది. నవ్వేశాను. ఆమె ఆనాడు చెప్పిన జీవిత సత్యాలు నా మనస్సులోకి ఎక్కలేదు. ఆమె తమాషా కళాకారిణి యైనా ఆమెలో ఎంతో సంస్కారముంది. ఆమెకెంతో జీవితాను భవముంది. ఆమెలో హుందాతన ముంది. కానీ నాకు జీవితచరిత్ర వివరంగా తెలియదు. ఆమె వ్యక్తిగత జీవితం గురించి అడగడం సభ్యత కాదని నే నెప్పుడూ అడగలేదు.

ఆమె ఆ మర్నాడు మళ్లా వచ్చి, "రాంబాబూ! నా గత జీవితం గురించి నీ వెప్పుడూ అడుగలేదు. నేను చెప్పలేదు. నా హృదయ వేదనను ఒకరితో చెప్పుకొంటే మనస్సు తేలిక పడుతుంది. ఇవాళ నా గత జీవితం గురించి నీతో చెప్పుకొని ఊరట చెందాలనుకొంటున్నాను. చెప్పనా?" "నీకు మనశ్శాంతి కలుగుతుందంటే చెప్పు, ఆయీ!"

"మా పూర్వీకులు మంచి స్థితిమంతులు. బాగా పొలాలు, భవంతు లుండేవి. కానీ దురదృష్టవశాత్తు అవి కరిగిపోయాయి. చివరకు తిండి కూడా కరువయింది. అప్పుడు నేను చాలా చిన్నదాన్ని. అందంగా, ముద్దుగా ఉండేదాన్ని. ఒకసారి ఒక తమాషా నాట్య బృందంవారు వస్తే వారికి నన్ను మా తల్లితండ్రులు అమ్మేశారు. ఆ నాట్య బృందంవారికి అందమైన అమ్మాయిలు కావాలి గనుక వారు నన్ను కొనుక్కొన్నారు. వారు నాకు కడుపునిండా తిండిపెట్టి, మంచి దుస్తులిచ్చి ఆట పాటలు నేర్పుతుండడం వల్ల నా తల్లిదండ్రులు నాకు దూరమయ్యారన్న బాధ నాకు కలుగలేదు. వారిని గురించి పూర్తిగా మరిచిపోయాను. వా రే మయ్యారో గూడా నాకు తెలియదు."

కొన్నాళ్లకు తమాషా వారికి నేనే ముఖ్య కళాకారిణి నయ్యాను. వారికి నేను మంచి పేరు సంపాదించి పెట్టాను. నేను బాగా డబ్బు సంపాదించుకొన్నాను. ఎలా సంపాదించానని అడగకు. ఆర్జనకు అనేక మార్గాలున్నాయి.

"బాల్యంలో పేదరికం అనుభవించాను గదా! అందువల్ల పేదవారిని చూస్తే నా మనస్సు కరిగిపోయేది. వారికి దాన ధర్మాలు చేశాను. వారి ముఖాలలో ఆనందం చూసి నేను పరమానందం పొందేదాన్ని. ఆ మహదానందంలో నన్ను నేను మరిచిపోయేదాన్ని. నా కెవరున్నారని? వారే నా వారు అనుకొనేదాన్ని. కానీ నా భవిష్యత్తు గురించి కొంచెమైనా ఆలోచించలేదు. ఆలోచించే అవసరం కలుగలేదు."

"చూస్తూండగనే నా యౌవనం కరిగిపోయింది. నా సౌందర్యం హరించుకొని పోయింది. శరీర సౌష్ఠవం సన్నగిల్లింది. నా ఆకర్షణ దిగజారింది. నా స్థానంలో మరొక జవ్వని ప్రవేశించింది. ఆమె పైని ప్రేక్షకులకు మోజు పెరిగింది. ఆ నాట్య బృందంవారికి నా అవసరం లేకపోయింది. ఆ బృందాన్ని విడిచిపెట్టాను."

"ఇక మీదట ఆటపాటలు కట్టిపెట్టి, ప్రశాంతంగా జీవించాలని నిశ్చయించుకొన్నాను. ఉన్న డబ్బుతో వేరుగా ఒక ఇంట్లో ఉంటూ వచ్చాను. ఎంతైనా నేను ఒక తమాషా నర్తకినే గదా! నే నెంత నీతిగా, నిజాయితీగా బతకాలనుకొన్నా సమాజం న న్నొక తమాషా కళాకారిణిగానే చూస్తూ వచ్చింది."

"ఒకనాటి సాయంత్రం కుండపోతగా వర్షం కురుస్తోంది. అయిదు గంటలు కాకుండానే బాగా చీకటిపడింది. లేచి దీపం వెలిగించాలని కూడా నాకు తోచలేదు. ఏవేవో ఆలోచిస్తూ కూర్చున్నాను. ఇంతలో ఒక స్త్రీ వచ్చి నా ఎదుట నిల్చుంది. ఆమె వర్షంలో తడిసి ముద్దయింది. నీళ్ళు కారుతూ ఉంది. నేను లేచి నిల్చున్నాను."

ఆమె నన్ను గట్టిగా కౌగలించుకొని భోరున ఏడ్చింది. నేను దీపం వెలిగించి, ఆమె ముఖం పరికించి చూశాను. ఆమె ఎవరో కాదు! శకుంతల! నాట్య బృందంలో నా స్థానంలో వచ్చిన తమషా నర్తకి, శకుంతల! బాగా చిక్కి శల్యమైంది. యౌనవంలో రేపటి ఆలోచన లేక వళ్ళు అమ్ముకొంది. పీల్చి పిప్పి చేసిన చెరుకు గెడ అయింది. క్షయ వ్యాధి వచ్చి క్షయమయింది. ఆమె ఇప్పుడు ఎవరికి కావాలి?

ఆమె విపరీతంగా దగ్గుతోంది. చలికి వణికిపోతూంది. వెంటనే ఆమెకు ఒక పొడి చీర యిచ్చి కట్టుకోమన్నాను. బొగ్గుల కుంపటి తెచ్చి కాచుకోమన్నాను వేడి వేడి టీ యిచ్చి తాగమన్నాను. ఆ రాత్రి ఏమీ తినకుండానే పడుకొంది. తెల్లవారే సరికి నాతో చెప్పకుండానే వెళ్ళిపోయింది. ఎక్కడికి వెళ్ళిందో! ఏమయ్యిందో! ధన సంపాదనే కాదు గుణ సంపాదన కూడా చాలా అవసరం. రాంబాబూ! యౌవనం చాలా ప్రమాదకరమైన దశ. ఎవరైనా ఈ దశలో చాలా జాగ్రత్తగా ఉండాలి ముఖ్యంగా కళాకారులు. వారిలో ఒంటరివారు మరీ

జాగ్రత్తగా ఉండాలి....” ఇలా ఆమె చెప్పుకొని పోతూంది. నే నెప్పుడు నిద్రలోకి జారుకొన్నానో నాకే తెలియదు.

వయస్సు మళ్లినా ఆయీ కంఠం మధురంగానే ఉండేది. మరాఠీ ఆభంగాలు, హిందీ భజనలు చక్కగా పాడేది. ఎంత బాగా పాడినా ఆమె సమాజం దృష్టిలో ఒక తమాషా నర్తకి. అందువల్ల ఆమె ఎప్పుడో గాని కచ్చేరీలకు వెళ్లేది కాదు. ఒక వేళ వెళ్లినా, వచ్చి బాధపడేది.

ఆయీ ఊరకనే ఎవరి నుండి డబ్బు పుచ్చుకొనేది కాదు. అందువల్ల నా తీరిక సమయాలలో ఆమె వద్దకు వెళ్ళి లావణీ, గౌలస్ గీతాలు, పొవ్వాడ పాటలు నేర్చుకొంటూ ఉండేవాణ్ణి. నాకు తోచినంత ఆమెకు ఇచ్చేవాణ్ణి. ఆమె నేర్చిన పాటలు భావ యుక్తంగా యుండినా నేను ఎక్కువగా ఉపయోగించలేదు. కానీ భావయుక్తంగా పాటలు ఎలా పాడాలో ఆమె వద్దనే సాధన చేసి, నేర్చుకొన్నాను.

ప్రజా కళలకు, జానపద కళలకు రావలసినంత ప్రాముఖ్యం ఆనాడూ లేదూ, ఈనాడూ లేదు. ఆ కళాకారుల ఆర్థిక పరిస్థితి ఆనాడు, ఈనాడు కూడా హీనంగా ఉంది.

స్వాతంత్ర్యం వచ్చాక జానపద కళా సదస్సులు, సమావేశాలు తరచుగా జరుగుతూనే వచ్చాయి. వాటిని మెచ్చుకొంటూ పెద్దలు ప్రసంగిస్తూనే ఉన్నారు. వీటి నిర్వాహకులు ఫైవ్‌స్టార్ హోటల్లో కూర్చుని పత్రికా విలేఖరుల గోష్టులు నిర్వహిస్తారు. ఈ కళాకారులు మాత్రం సరైన వసతులులేని ఏ పాఠశాల భవనంలోనో ఉంటారు. అన్నీ ముగిసిన తర్వాత ఎవరూ వీరిని గురించి మరి ఆలోచించరు. ఈ బృందాల నాయకులలో కొందరు కొంచెం పైకి రాగానే అంతవరకు వారుండిన వారి బృందం గురించి, ఆ వ్యవస్థ గురించి మరిచిపోతారు. పైవారితో కలసిపోవాలని ప్రయత్నిస్తారు. ఇదీ నేటి కళాలోకం తీరు. ఇది నా ప్రత్యక్ష అనుభవం.

చాలా జానపద కళాసదస్సులో పాల్గొన్నాను. నిర్వహించాను. వ్యక్తిగతంగా నాకు వీలయిన సహాయం వారికి చేస్తూ వచ్చాను. చివరకు వారికి నే నేమీ చేయలేక వాటి నుండి విరమించుకొన్నాను.

ఆయీతో పరిచయమైన తర్వాత ఆమె వద్ద జానపద సంగీతం, నాట్య విషయాలేకాక జీవిత పాఠాలను గూడా చాలా నేర్చుకొన్నాను. ధనానికున్న విలువ గుణానికి లేదు. సమాజాన్ని, సమాజ నీతిని ధనవంతుడు కొనేస్తాడు. నీతిమంతుడు వాటిని కాపాడాలని ప్రయత్నించి, కొవొత్తిలా కరిగిపోతాడు. ఇలాంటి లోక సత్యాలు ఆమె నాకెన్నో చెప్పింది. నేర్పింది.

ఆ రోజుల్లో ఒక జానపద కళాకారుడు గొప్ప వారింటికి వెళ్తే ఇంట్లోకి రానిచ్చేవారు కారు. వీధిలోనే నిలబెట్టి మాట్లాడేవారు. అతడు వెళ్లిన తర్వాత, వీధి గుమ్మం ముందు నీళ్లు జల్లి శుద్ధి చేసుకొనేవారు. ఒక చలన చిత్ర తార వస్తే ఇంటిల్లిపాదీ సంబరపడి పండుగచేసుకొనేవారు. ఒక విధంగా ఈనాడూ అంతే. ఈ వ్యత్యాసం ఎందువల్ల? నాకు అర్థంకాక ఒకనాడు ఆయీని అడిగాను.

“అది అంతే రాంబాబూ! అందుకే డబ్బు సంపాదించు. బ్యాంకులో కూడబెట్టు. అప్పుడే నీకు గౌరవం. నీ కందరూ ఆత్మీయులవుతారు. నీ కళను చూసి, నిన్ను గౌరవించే సహృదయులు ఈ సమాజంలో చాలా తక్కువ మంది ఉంటారు. ధనంలాగే నీ విద్యను గూడా కొంత దాచిపెట్టుకో. అంతా దానం చేశావంటే నీ శిష్యులే నీకు నామం పెడతారు. జాగ్రత్త! ఇటువంటి కళాకారుల జీవిత సత్యాలను ఆయీ నా కెన్నో చెప్పింది. నా ఆంధ్ర నాట్యం... అర్ధ శతాబ్ది జీవితంలో ఇటువంటి నిత్య సత్యాలను ఎన్నింటినో ప్రత్యక్షంగా చూశాను. అనుభవించాను. ఈ విషయంలో ఆయీ చెప్పిన సలహాలు పూర్తిగా పాటించలేక పోయాను.

“రాంబాబూ! నీకు రెండు ముఖ్య విషయాలు చెప్పదలచుకొన్నాను. నీవు ఏమనుకొన్నా సరే నేను చెప్పదలచినవి చెబుతున్నాను. తర్వాత నీ యిష్టం” అంది ఒకనాడు ఆయీ. “ఏమిటా విషయాలు. చెప్పు ఆయీ” అన్నాను.

“ఒకటి పరస్త్రీ వ్యామోహంలో పడకు. రెండు మధు సేవకు బానిసవు కాకు.” నే నెందరో కళాకారులను చూశాను. వారు అర్జించినదంతా ఈ రెండు వ్యసనాలకు ఖర్చుచేసి, చివరి దశలో ఎంత హీనంగా వారు జీవించారో నేను చూశాను. ఇంట్లో అందమైన భార్య లున్నవారు గూడా పరస్త్రీల శరీరాలను ధనంతో కొనుక్కొని చివరికి పేదరికం అనుభవించిన వారిని చూశాను. మధుసేవ చేసి చివరికి అనారోగ్యంతో బాధపడ్డ

వారిని చూశాను. కనుక వీటికి దూరంగా ఉండమని నిన్ను హెచ్చరిస్తున్నాను" అంది ఆయీ. "ఆయీ ఇదంతా కళా కారులకు వచ్చిన శాపమా?" అని అడిగాను. "ఒక విధంగా అంతే రాంబాబూ!" కళాకారులకు ధనమిచ్చే శాపం ఇది.

– 0 –

చిన్నప్పుడు నేను మదరాసు రామకృష్ణ మఠంలో ఉన్నాను. అప్పుడు బౌద్ధ, జైన మత గ్రంథాలు చదివాను. స్వామి వివేకానందుని రచనలు, ప్రసంగాలు కంఠస్థం చేశాను. ఇవన్నీ నా కళా వికాసానికి దోహదపడలేదు గాని నా జీవితాన్ని ఆదర్శప్రాయం చేసుకొనడానికి సహాయపడ్డాయి. అవి నాట్యకళకు సంబంధించినవు కావు గనుక నా కళా వికాసానికి అవి తోడ్పడలేదు.

అందువల్ల నా కళకు సంబంధించిన భరత శాస్త్ర గ్రంథాలను చదవడం ప్రారంభించాను. అయితే భరత శాస్త్ర గ్రంథాలను చదవడం, వాటి ప్రయోగం తెలుసుకొనడం అంత సులభం కాదు అని త్వరలోనే గ్రహించాను. భరతుని నాట్య శాస్త్రం వంటి సంస్కృత గ్రంథాలను చదవడం వాటిని అర్థం చేసుకొనడం నాకు కష్టమనిపించలేదు. కాని నాట్య శాస్త్రంపైని అభినవ గుప్తుడు వ్రాసిన వ్యాఖ్యానం చదువుతూంటే అడవిలో దారి వెతుక్కొంటున్నట్టుండేది. నాకు తెలిసిన కొంతమంది సంస్కృత పండితుల నడిగితే వారు వివరణలు చెప్పేవారుగానీ ఆ శాస్త్ర విషయాలను సంప్రదాయానికి తగినట్టుగా ఎలా మలచాలో వారు చెప్పలేకపోయారు. శాస్త్రం, సంప్రదాయం రెండింటినీ సమన్వయపరచి, చెప్పగలిగినారు చాలా అరుదుగా ఉండేవారు. ఇక అలాంటివారి వద్దకు వెళితే "గండా బాందో" అనేవారు. అది వారి పద్ధతి. ఆ "గండా"ను చేతికి కట్టుకొంటే వారికి శిష్యరికం చేయాలి. వేరొక గురువు వద్దకు వెళ్ళకూడదు. ఆ "గండా"కు ఎన్నో నీతి నిబంధనలు ఎంతో ఖర్చు. ఒక మధ్యప్రదేశ్‌లోనే కాదు. ఉత్తర భారతదేశమంతటా ఇదే పద్ధతి. "మా పూర్వీకులు ఎన్నో సంవత్సరాలు తపస్సు చేసి మా కిచ్చిన ఆస్తి ఈ సంప్రదాయం. దాన్ని అందరికీ ఉచితంగా పంచుతామా? డబ్బు ఇచ్చిన మాకు నమ్మకం కుదిరితేగానీ మా సంప్రదాయం ఎవరికీ చెప్పం" అనేవారు. ఆ "గండా బాందో"ను పాటించి కొందరు గురువులను ఆశ్రయించాను. డబ్బు ఖర్చయింది గాని తగిన ఫలితం లభించలేదు. నిరాశ ఎదురయింది. ఆ నిరాశతో నాలో పట్టుదల ఎక్కువయింది. కళా సంబంధిత విషయాలలో నేను నిరుత్సాహపడినప్పుడు ఆయీ నాకెన్నో విషయాలు చెప్పి నన్ను ప్రోత్సాహించేది. దాంతో నాలో దీక్ష పెరిగేది. కాలక్రమేణా నా బుద్ధి వికసించడంతో శాస్త్రాన్ని సంప్రదాయంతో సమన్వయించు కొనగలిగాను.

భరతుని నాట్యశాస్త్రం, అభినవ గుప్తుని వ్యాఖ్యానం చదివినంత మాత్రాన ప్రాంతీయ నాట్య సంప్రదాయాలను తెలుసుకొనడం కష్టం. ప్రాంతీయ మత, రాజకీయ, సాంఘిక, ఆర్థిక పరిస్థితులను బట్టి నాట్య సంప్రదాయాలు రూపొందుతాయి. వాటికి అక్కడ నాట్య గురువులు సంప్రదాయ వ్యాఖ్యానాలను తయారుచేసుకొంటారు. అవి వారి వ్యక్తిగత ఆస్తులవుతాయి. వారు వాటిని రహస్యంగా దాచుకొంటారు. ఆ యాస్తి వారి వారసులకు సంక్రమిస్తుంది. ఎవరికో గానీ వారు ఆ సంప్రదాయాలను చెప్పరు. అందువల్ల ఎన్నో కళా రహస్యాలు కాలగర్భంలో కలిసిపోతూ వచ్చాయి. మనకు దక్కకుండా పోయాయి.

ఇదే పద్ధతి ఇతర కళల విషయంలో గూడా జరుగుతూ ఉండేది. పకావాజ్, తబలా కళలలో ప్రసిద్ధులైనవారు వారి కుమార్తెలకు పెళ్ళి చేసేటప్పుడు అల్లుడు ఆ కళలకు చెందినవాడైతే కొన్ని విశిష్ట జాతులను అతనికి కట్నంగా బహూకరించేవారు. ఇలాంటి కట్టుబాట్లు ఆ రోజుల్లో ఉండేవి. మొదట్లో ఈ పద్ధతులు నాకు అర్థం కాలేదు. ఆయీ ఇవన్నీ నాకు చెప్పింది. కళకోసం ఇల్లు వదిలి వచ్చినంత సులభం కాదు కళాభ్యాసం అని తెలుసుకొన్నాను. ఈ పరిస్థితులు నన్ను మరింత ప్రేరేపించాయి. కార్యోన్ముఖుణ్ణయ్యాను. స్వయం కృషితో వీటిని సాధించగలనా అని సందేహం కూడా కలిగింది. దీక్ష ఉంటే సాధించలేనిది ఏదీ ఉండదు. అన్న నిశ్చయానికి వచ్చాను.

నాగపూర్‌లోని ఆంధ్రాక్లబ్‌లోని గ్రంథాలయంలో వెతకగా వెతకగా "అభినయ స్వయంబోధిని, భరత సార సంగ్రహం" అన్న రెండు పుస్తకాలు నాకు దొరికాయి. ఎంతో సంబరపడి ఇంటికి తీసుకొని వెళ్లాను. దీక్షతో అధ్యయనం చేశారు. స్వయంబోధినిలో అభినయం గురించి ఉంది. స్వాతిక సంచారుల గురించి అందులో ఉంది. అదంతా రసచర్చకు సంబంధించినది. చంద్రశేఖర కవి రచించిన భరతసార సంగ్రహంలో హస్త విన్యాసాలు, నాట్య భంగిమల గురించి

మాత్రమే ఉంది. వీటిని ఒకటికి రెండు సార్లు చదివినా నాకు తృప్తి కలుగలేదు. అందువల్ల విశ్వవిద్యాలయ గ్రంథాలయానికి వెళ్లాను. నా అదృష్టం బాగుంది. భరతుని నాట్యశాస్త్రం, నందికేశుని అభినయ దర్పణం, సంస్కృత ప్రతులు అక్కడ లభించాయి. ఇంటికి తీసుకొని వెళ్ళి ఒక నెల రోజులు కుస్తీ పట్టాను. పట్టుదొరికింది. సొంతగా వాటిని అర్థం చేసుకొనగలిగాను. వాటిని ప్రయోగంలో పెట్టాను. కొన్ని రోజులకు సాధించాను.

ఈ సందర్భంలో ఒక విషయం గుర్తుకు వస్తుంది. నేను కాళహస్తిలో నాయుడుపేట రాజమ్మగారి వద్ద నాట్యం అభ్యసిస్తున్నప్పుడు ఆమె నాకు శైవ సిద్ధాంతం, ఆగమాలు బోధించి, నా చేత అభ్యాసం చేయించారు. ధ్వని, నాదం, నాదోత్పత్తి, నాద స్వరూపం, నాద వికాసం, నాద విజృంభణ, నాదంలో లయ, నాదమూర్తి ప్రతిజ్ఞ, గతి, గమనం, భావం, భావ వికాసం, రసోత్పత్తి మొదలైన విషయాలు నా కెన్నో ఆమె చెప్పారు. అవి ఈనాడు నాకు ఉపకరించాయి. నాట్యశాస్త్రం, అభినయ దర్పణం రెండింటినీ సులభంగా అర్థం చేసుకొనగలిగాను. లాలిత్యం అంటే ఏమిటి? గాంభీర్యం అంటే ఏమిటి? వాయు తరంగాలలో ఈ రూపాలు ఎలా ఏర్పడతాయి? స్త్రీ పురుష స్వభావాల ననుసరించి వీటిలో కలిగే మార్పు లేమిటి? ఇలా ఎన్నో సందేహాలు నాలో కలిగేవి. ఈ సందేహాలతో కొన్నాళ్లు సతమతమయ్యాను. కాని స్వయం కృషితో వాటిని నిరూపించుకొనగలిగాను. ఎంతో తృప్తి చెందాను. ఆనందం పొందాను.

ఆ తర్వాత సంస్కృత పండితులతో భరత శాస్త్ర విషయాలు చర్చించడం ప్రారంభించాను. వారి అభిప్రాయాలతో నేను ఏకీభవించినపుడు నన్ను వారు అభినందించేవారు. కానీ ప్రయోగశాల విషయంలో ఏకీభావం కుదిరేది కాదు. ఒక్కొక్క సంప్రదాయంలో ప్రయోగం ఒక్కొక్క విధంగా ఉండవచ్చును. సాత్వికాభినయంలోను, అంగికాభినయంలోను గూడా తేడా లుండవచ్చును. అందువల్ల అర్థాభినయం, భావాభినయం రెండూ అభ్యసించవలసి యుంటుంది. భరతశాస్త్రం, దానిపైని గల వ్యాఖ్యానాలు నేను బాగా అధ్యయనం చేయడం వల్ల ఈ రెండు అభినయాలు నాకు కష్టమనిపించలేదు.

కొందరు పండితులు నా శాస్త్ర విజ్ఞానాన్ని మెచ్చుకొని, మరికొన్ని రహస్య విషయాలు చెప్పేవారు. మరికొందరికి నా ధోరణి నచ్చక, రెండవ రోజున నాతో చర్చించేవారు కారు. కొందరు గురువుల శిక్షణా పద్ధతులను తెలుసుకొనాలని వారి నాట్య పాఠశాలలకు వెళితే, శిష్యులకు పాఠం చెప్పడం ఆపి, మాటలతో నాతో కాలం గడిపి నన్ను పంపించేవారు. మరికొందరు గురువులు తలుపు బిగించి నన్ను లోనికి రానిచ్చేవారు కారు. ఆనాటి కాలధర్మం అది.

నేను నాగపూర్‌లో ఉండగా ఉదయశంకర్ నాట్య బృందం అక్కడికి వచ్చింది. అంతపెద్ద నాట్య బృందం నాగపూరు రావడం అదే మొదటి సారి. అందుకని ప్రవేశ రుసుం చాలా ఎక్కువైనా వారి ప్రదర్శనకు వెళ్ళాను. వారి బృందంలోని సంగీత విద్వాంసులు, వాద్యకారులు, నర్తకులు, వ్యాఖ్యాతలు అందరూ గొప్పవారే. ఆధునికమైన దీపకాంతులతో వారి ప్రదర్శన జరిగింది. వారి నాట్యం మూగ నాట్యం. వ్యాఖ్యాత నేపథ్యం నుండి కథ చెప్పాడు. గత గమనాలకు, ఆంగిక విన్యాసాలకు తగినట్టుగా సంగీతం ఉంది. కరణా లన్నారు, చారు లన్నారు. అంగహారా లన్నారు. ఇలా ఎన్నో నాట్య పరిభాషా పదాలను ప్రకటించారు. శివపార్వతుల, రాధాకృష్ణుల నాట్యాలు, జానపద నాట్యాలు మొదలైన అనేక రకాల నాట్యాలను రెండు గంటల్లో ప్రదర్శించారు. మొదటి వరుసల్లో కూర్చున్న పెద్దలు కరతాళ ధ్వనులు చేశారు. ఆహా! అన్నారు... ఓహో! అన్నారు... ఓహోహో! అన్నారు వారెవా! అన్నారు. వారి అనుభూతి వారిది, ఎవరి ఆనందం వారిది.

కొన్ని సన్నివేశాలలో ఎల్లోరా శిల్పాలు సజీవమూర్తులై రంగస్థలం మీద వచ్చాయా అని నా కనిపించింది. ఉదయశంకర్ గొప్ప కళాకారుడు. ఆయన ప్రదర్శన చూసే భాగ్యం నాకు కలిగింది. అయితే ఆ ప్రదర్శనవల్ల నేను నేర్చుకొనతగ్గది ఏముంది? అని ఆలోచించాను. ఆ సంగీత ధ్వనులకు ఆ యాంగిక విన్యాసాలకు గల సంబంధ మేమిటి? ఆ సంగీతజ్ఞులు ఆ సంగీతాన్ని అలా ఎందుకు కూర్చారు? ఈ ప్రశ్నలు నా మెదడును దొలిచాయి. ఆ మర్నాడు మళ్లీ వారి ప్రదర్శన జరిగింది. నేను ప్రదర్శనను చూడకుండా, రంగస్థలం వెనుక గల మైదానంలో కూర్చొని వారి సంగీతం విన్నాను. గత రాత్రి చూసిన ప్రతి నాట్యాంశం నాకు గుర్తుంది. కనుక సంగీతం వింటూ ఆయా నాట్యాంశాలను ఊహించు కొనగలిగాను. ఆంగిక అభినయానికి, లయ విన్యాసాలకు తగినట్లుగా ఆ తాళ పద్ధతులున్నాయని నా కనిపించింది.

ఆ తర్వాత రాంగోపాల్, నటరాజ వశి మేనక, సాధనా బోస్ మొదలైన వా రెందరో నాగపూర్‌లో ప్రదర్శనలు ఇచ్చారు. వారి వారి సంప్రదాయాలు వేరైనా వారి బాణీలు నా కొక్కలాగే కనిపించాయి. వారి ప్రదర్శనలలో భరతాదులు చెప్పిన సాత్వికాభినయం, సంచారుల ప్రదర్శన, స్థాయీ భావ నిరూపణ మొదలైనది నాకు కనిపించలేదు. ఈ విషయమై నాలో నేను తర్కించుకొన్నాను. చారులు, కరణాలు, అంగహారాలు మొదలైనవి ఎలా కూర్చాలి? తాళ, లయ, గతి, ప్రసారాలు ఏ విధంగా ఉండాలి? జతులు ఎలా కూర్చాలి? అలా ఇవన్నీ ఆలోచిస్తూ ఉండేవాణ్ణి.

సాధనా బోస్ కార్యక్రమంలో భరతనాట్యం, కథకళి, కథక్, మణిపూరి, మొదలైన నాట్యసంప్రదాయాలు ఆ యా సంగీత బాణీలలో, అలంకరణలతో ప్రదర్శించబడ్డాయి. ఒకే కార్యక్రమంలో ఒకే రంగస్థలంపైని ఇన్ని సంప్రదాయాలను ప్రదర్శించడం ఒక గొప్ప విషయం. అదొక అద్భుతం. వాటిని తులనాత్మకంగా పరిశీలించే అవకాశం నాకు కలిగింది. నా కళా విజ్ఞానాన్ని పెంపొందించుకొనడానికి ఈ ప్రదర్శనలు నాకు ఉపయోగపడ్డాయి.

అయితే హృదయ భాష ఎలా ఉంటుంది? హృదయం ఎలా స్పందిస్తుంది? ఆ యనుభూతి ఎలా ఉంటుంది? ఇలా ఆలోచిస్తూ ఉండేవాణ్ణి. ఒకరు చెబితే ఇవి రావు. పుస్తకాలలో చదివితే అబ్బవు. ఎవరికి వారు స్వయంగా అనుభవించి, తెలుసుకొనవలసి యుంటుంది. ఇవి తెలిస్తే గాని తన్మయత్వం చెందం. ఇదంతా పెద్ద గందరగోళం.

– 0 –

నా చిన్న తనంలో మదరాసులోని మాంబలం పానగల్లు పార్కు వద్ద ఒక సంగీత సభ ఉండేది. అదొక చక్కని హాలేగాని దానిలో రంగస్థలం లేదు. అయినా అక్కడ పెద్దపెద్ద సంగీత కచ్చేరీలు జరిగేవి. చాలా మంది కళాభిమానులు, కళాప్రియులు ఈ కచ్చేరీలకు వచ్చేవారు. మేం పిల్లలం బైట నుండే ఆ కచ్చేరీలు వినేవారం. ఒకనాడు బాల సరస్వతి కచ్చేరీ ఉందన్నారు. ఆ కాలంలో నలుగురు ప్రఖ్యాత బాలసరస్వతు లుండేవారు. ఒకామె తంజావూరు నాట్య బాలసరస్వతి. సంగీతం పాడే రావు బాలసరస్వతి. నాటకాల సురభి బాల సరస్వతి. ఆమె నాట్యం కూడా చేసేది. ఇంకో ఆమె స్వర్ణ సరస్వతి. వీరిలో ఎవరి కచ్చేరీ ఆనాడుందో మొదట తెలియలేదు. విచారించగా భరతనాట్యం బాల సరస్వతి కచ్చేరీ ఆట ఉందని తెలిసింది. ఆ రోజు మా పిల్లల అదృష్టం బాగుండి, హాలులోనికి వెళ్లనిచ్చారు.

బాల సరస్వతి తల్లి జయమ్మ పాట పాడింది. ఆమె అమ్మమ్మ ధనమ్మ గొప్ప వీణ వాయిద్యకురాలట! ఇంకెవరో మృదంగం, కార్లనెట్, తంబూరాలు వాయించారు. తొలుత ఆమె నృత్త, నృత్యాంశ్యాలు ప్రదర్శించారు. తర్వాత అభినయంచేశారు. నృత్త నృత్యాలు ఆకర్షించినంతగా అభినయం మా పిల్లల్ని ఆకర్షించలేదు. అందువల్ల పిల్లలందరూ వెళ్ళిపోయారు. నేను మాత్రం ఉన్నాను. ఆమె అభినయం నా హృదయం మీద ఏదో ఒక చిన్న ముద్ర వేసింది. ఆమె అభినయం మళ్లా చూడాలనిపించింది.

నేను నాగపూర్‌లో ఉండగా ఆ యవకాశం లభించింది. నాగపూర్‌లోని దక్షిణాది వారు ఆమెను ఆహ్వానించారు. ఆమె నాట్యకచ్చేరీకి అంతగా ప్రచారం జరగలేదు. ఆడంబరాలు హంగులూ లేవు. రంగు రంగుల దీపాల హడావిడి లేదు. నలుగురో అయిదుగురో వాద్యకులు రంగస్థలంపైని కూర్చున్నారు. ఆమె అలంకరణ చాలా సాదాగా ఉంది. ఈ కచ్చేరీకి ఆయీ వస్తానంది. ఆమెను తీసికొని వెళ్లాను. హాలులో జనం అట్టే లేరు. అక్కడ ఉన్నవారంతా రసజ్ఞులే. అందువల్ల రంగస్థలానికి దగ్గరగా మే మిద్దరం కూర్చున్నాం. బాల సరస్వతి తొలుత నృత్త, నృత్యాంశాలు ప్రదర్శించింది. ఆ తర్వాత "కృష్ణా! నీ బేగనే బారో" అన్న పాటకు అభినయం మొదలు పెట్టింది.

బాల సరస్వతి ఆట పాట! ఆ భావ ప్రకటన ఒక రసలోక విహారం. మాకు తెలియకుండానే రెండున్నర గంటల కచ్చేరీ ఇట్టే గడిచిపోయింది.

"అభినయం అంటే ఇదీ రాంబాబూ! మేమూ ఇలాగే అభినయించే వాళ్లం. ఆ కాలం వేరు, ఆనాటి ప్రజలు వేరు. ఎంత చక్కని ప్రదర్శన చూపించావు రాంబాబూ!" అంటూ ఆయీ నన్ను మెచ్చుకొంది. కొన్ని రోజుల వరకు మేం బాల సరస్వతి అభినయం గురించే చర్చించుకొంటూ ఉండేవాళ్లం.

నేను నాగపూరులో ఉండగా ఒకసారి హోళీ పండుగ వచ్చింది. ఆనాటి ఉదయం నుండి మధ్యాహ్నం వరకు అందరూ చిన్నా పెద్ద. స్త్రీ పురుష భేదం లేకుండా వసంతాలు జల్లుకొన్నారు. రంగులు పూసుకొన్నారు. ఆ తర్వాత స్నానాలు

చేసి, భంగు సేవిస్తూ, హల్వా ముద్దలు ఆరగించి పేకాటలతో కాలం గడిపారు. నాకు తెలిసిన ఒక పెద్దమనిషి "తీయని హల్వాకు, భంగుకు సంబంధమేమిటి?" అని అడిగాను. "రామకృష్ణ భయ్యా! తీపితింటేగాని భంగు నిషా పూర్తిగా ఎక్కదు. ఒకసారి భంగు తాగి, హల్వా తిని చూడు నీకే తెలుస్తుంది" అన్నాడు. ఆ సాయంత్రం ఆయన నన్ను విందుకు ఆహ్వానించాడు. నాకు లోగడ డిన్నర్ పార్టీ అనుభవం కలిగింది గనుక "నేను రాను" అన్నాను. రామకృష్ణ భయ్యా! ఇది వెట్ పార్టీ కాదు. సాదా సీదా వినోద సమావేశం. మా పార్టీకి అందరూ పెద్దలు, విద్యావంతులు వస్తారు. సరదాగా కబుర్లు చెప్పుకొంటాం రా" అన్నారు. నేను వెళ్ళాను. ఆ పార్టీకి వచ్చిన వారంతా చాలా సంస్కారవంతులే. చక్కని విందు భోజనం వారితో కలిసి చేశాను. తర్వాత అందరూ ఒక హాలులో సమావేశమయ్యారు. అక్కడ సమావేశమైన వారిలో చాలా మంది నాకు కొత్తవారు గనుక నేను కొంచెం దూరంగా కూర్చున్నాను. వారిలో ఒక పెద్ద మనిషి ఒక 'జోక్' విసిరాడు. అందరూ వినోదంగా విరగబడి నవ్వారు. తర్వాత ఇంకొకరు దానికి సమాధానంగా మరొక జోక్ చెప్పారు. అందరూ మళ్ళీ నవ్వారు. ఆ తర్వాత ఒకరి తర్వాత ఒకరు ఒకర్ని మించి ఒకరు జోకులు చెప్పడం మొదలు పెట్టారు. నవ్వులు, కేరింతలు.

హాలంతా నవ్వులతో వరదలై పారింది. పూర్వం విదేశాల్లో పాశ్చాత్యులు రాత్రి డిన్నర్ పార్టీలయిన తర్వాత మంటల చుట్టూ కూర్చుని, చలి కాచుకొంటూ సరదాగా మాట్లాడుకునేవారని విన్నాను. కాని నేడు ఈ పెద్దమనుషుల జోకులు చాలా పచ్చిగా ఉన్నాయి. అక్కడున్న వారంతా పెద్ద మనుష్యులే కాని అందరూ స్వేచ్ఛగా బూతులు మాట్లాడుతున్నారు. హద్దులు, ఆంక్షలు లేవు. అదంతా ఒక శృంగార ప్రపంచం.

అదేమి శృంగారం! అదేమి శృగార వర్షం! వర్షం కాదు. వరద! చిన్న తరగతులవారు అలా మాట్లాడితే దాన్ని బూతు అంటారు. పెద్దలు మాట్లాడితే శృంగార మంటారు. తెలుగులో మాట్లాడితే బూతు అంటారు. సంస్కృతంలో మాట్లాడితే శృంగార మంటారు. గీత గోవిందంలోని అష్టపదులు పాడితే, వాటిని అభినయిస్తే, ఆ వర్ణనలను శృంగార వర్ణన లంటారు. కైశికీ వృత్తి అంటారు. కృష్ణ భక్తి, మధుర భక్తి అంటారు. గాథా సప్తశతి చదువుతూంటే ఎవరికీ బూతు అనిపించదు. అసభ్యత గోచరించదు. అందరూ ఆనందించి, కడుపుబ్బ నవ్వుతారు. ఇది లోకం తీరు. ఆ సమావేశంలో నాకు కొద్దిగా పరిచయమున్న ఒక వ్యక్తి "కృష్ణ భయ్యా! మాట్లాడకుండా కూర్చున్నావేమిటి? ఏదైనా ఒక జోక్ చెప్పు" అన్నారు. నన్ను విందుకు పిలిచినాయన "రామకృష్ణకు ఇలాంటి జోకులు రావు. వచ్చే సంవత్సరము చెప్తాడు. ఇప్పుడు అడగకండి" అన్నాడు. "బ్రతికానురా దేవుడా!" అని నేను మనసులో అనుకొన్నాను. ఆయన ఇలా చెప్పకుండా ఉంటే నేను అక్కడ అంటరాని వాణ్ణయ్యేవాణ్ణి. చివరకు ఆ సమావేశం ముగిసింది. ఒకరి కొకరు "బై బై" చెప్పుకొన్నారు.

"రామకృష్ణా! ఇది హాని లేని సమావేశం. సంవత్సరాని కొకసారి ఇలా సరదాగా గడుపుతాం. సమాజంలో ఇలాంటి వినోదాలు కూడా ఉంటాయని నీకు తెలియజేయడానికి నిన్ను ఇవ్వాళ ఆహ్వానించాను" అన్నాడా పెద్దమనిషి నన్ను నా ఇంటి వద్ద దిగబెడుతూ.

ఈ పార్టీలు, ఈ పద్ధతులు నాకు కొత్త. ఒకనాడు మా ఆయితో మాట్లాడుతూ, ఈ పార్టీ గురించి ఆమెకు చెప్పి, "ఆయీ! మీ ఆడవారు గూడా ఇలా మాట్లాడుకొంటారా?" అని అమాయకంగా అడిగాను. ఆమె ఆశ్చర్యపోయింది.

"అది మానవ సహజం రాంబాబూ! ఆడ ఏమిటి? మగ ఏమిటి? సమవయస్కులైన సన్నిహితులు ఒక చోట చేరితే సరదాగా శృంగారం గురించి మాట్లాడుకొంటారు. హాస్యం హద్దు మీరనంత వరకు ఉంటే తప్పు లేదు" అంటూ నవ్వేసింది ఆయి.

రాత్రి ఈ విషయమై ఆలోచిస్తూ పడుకొన్నాను. పాలకొల్లు బత్తాయిలు, ఈతపళ్లు పాటలు పాడితే అవి మనకు బూతుగా అనిపిస్తాయి. ఛీ ఛీ అంటూ చెవులు మూసుకొంటాం. ఎవరైనా అమరుక కావ్యం గాని, గీత గోవిందం గాని ఆలపిస్తే అది విప్రలంభ శృంగారమని సరిపెట్టుకొంటాం. ఆత్మ పరమాత్మల వియోగ సంయోగాలని వేదాంతపరంగా చెప్పుకొంటాం అని అనుకొంటూ నిద్రపోయాను.

అప్పటికి నా కళా జీవితంలో ఆగస్టు 15లు కొన్ని గడిచిపోయాయి. "ఇన్ని రోజులు ఎక్కడకు వెళ్ళావు ఆయీ, నన్నిలా వదిలిపెట్టి?

ఆయీ ముఖంలో కాంతి తగ్గింది. శూన్యంలోకి చూస్తూ కూర్చుంది. "చెప్పకూడదా ఆయీ!" "రాంబాబూ, ఎవరికీ చెప్పలేని బాధ" "ఏమిటి ఆయీ అంతబాధ కల్గించిన విషయం."

"రాంబాబూ చాలా రోజులుగా నా చిన్ననాటి ఊరు, ఇల్లూ, పెద్దదయ్యింది. మా వాళ్లు మళ్లీ ధనవంతులయ్యారు. వ్యాపారం బాగా చేస్తున్నారు. పెంకుటిల్లు బంగళా అయ్యింది. ఆ రోజు మధ్యాహ్నం బండి దిగి రోడ్డు మీద నడిచి వెళుతున్నాను... మా మహారాష్ట్ర వనితలు యితర కులాల వారిలా 9 గజాల చీరెలు కాసిబోసి కట్టినా తలపై ముసుగు వేసుకోరు. నాకు అలవాటయ్యింది. అయినా నన్నెవరు గుర్తిస్తారు. ఇంత కాలానికి?

మా యింటి ముందు నుండి నడిచి వెళుతున్నాను. వీధి గుమ్మం దగ్గర ఒక పండు ముసలామె కూర్చొని ఉంది. లోపలి హాలులో ఉయ్యాల మంచము మీద కొందరు అమ్మాయిలు ఊగుతూ కూర్చొని, గట్టిగా నవ్వుతూ మాట్లాడుకొంటున్నారు. నేను గుమ్మం ఎదురుగా ఒక నిమిషం నిలబడ్డాను. ఆ పండుముదుసలి చూస్తూ లోపల నుండి ఒక అమ్మాయి వచ్చింది. పంజాబీ డ్రస్సు, కత్తిరించిన జుత్తు, నల్లకళ్లజోడు, పెదవులకు రంగులత్తుక –

"ఏయ్ ఏం కావాలి? ఇక్కడ ఎవ్వరూ నిలబడకూడదు!" అంది. "ఎండకు కాళ్ళు లాగుతున్నాయి. కొంచెం మంచి నీళ్ళివ్వమ్మా!" అన్నాను. "ఆ అమ్మాయి లోపలికి వెళ్ళి వచ్చేలోగా ఆ ముసలావిడను చూశాను. ఆమె తనలో తాను ఎందుకో నవ్వుకొంటూంది.

"ఆమె మా అమ్మ. ఆ నవ్వు మా అమ్మదే. "పరిగెత్తికు వెళ్ళి ఆమెను కౌగలించుకొని గట్టిగా ఏడ్వాలనిపించింది. క్షణకాలం ఈ భావం కలిగింది.

'ఆ అమ్మాయి ఒక చెంబులో నీళ్ళు తెచ్చింది. "అక్కడ నిలవా లనిపించలేదు. ముందుకు నడిచినాను. ఆ అమ్మాయి నిర్లక్ష్యంగా చూచి, చెంబులో నీళ్లు గుమ్మంలో బోర్లించి, ఆ వృద్ధురాలిని చేయపట్టుకొని లోపలికి తీసుకొని వెళ్తూ తలుపు మూసింది....

ఇదీ బాబు – నా వారు నన్నిలాగ చేశారు. ఇప్పుడు లోకం దృష్టిలో నేనొక భ్రష్టురాలిని." ఆమె నిమిషం నిశ్శబ్దంగా ఉండిపోయింది. కంటినుండి ఒక్క నీటి చుక్క రాలలేదు. "ఇది నాలో దాచుకున్న బాధ–ఎవరికీ చెప్పనని చేతిలో చెయ్యి వెయ్యి రాంబాబూ! "అర్థం చేసుకొన్నాను. ఆయీ! అర్థం చేసుకొన్నా. అందరికీ అర్థం కాదు. అనుభవిస్తేనేగాని..."

---

*(40వ పుట తరువాయి..)*

# నేనెరిగిన పుట్టపర్తివారు

ఆచార్యులు విప్లవ భావావేశంతో కొన్ని రచనలు చేశారు. కొంతకాలం శ్రీశ్రీతో భుజం భుజం రాసుకొని తిరిగారు. అరవిందుల దివ్య మానవత్వం, మార్క్సులోని మానవతావాదం మిళితం కావాలనే వారాయన.

పలుమార్లు అఖిలభారత రచయితల సమావేశాల్లో పాల్గొని, దేశమందలి ప్రముఖ రచయితల మైత్రినందుకొన్నారు.

పదవులకు, ప్రతిష్ఠలకు ప్రాకులాడక నిరంతర అధ్యయనంలో కాలం గడిపేవారు. 1967లో కేంద్ర ప్రభుత్వం నుండి ఆదర్శపండిత సత్కారం, పద్మశ్రీ ప్రశస్తి నందుకొన్నారు. శ్రీ వేంకటేశ్వర, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాల నుండి గౌరవ డాక్టరేట్లందుకొన్నారు. లెక్కలేనన్ని సత్కారాలందుకొన్నారు.

ఒకమారు మద్రాసు న్యాయ కళాశాలలో పుట్టపర్తి వారికి సన్మానం జరిగింది. సభాధ్యక్షులు శ్రీశ్రీ, ఆచార్యుల ప్రతిభా పాటవాన్ని ప్రశంసిస్తూ "నాకు పురాణములన్న అంతగా గిట్టవు. కాని మీ రామాయణం చదువుతుంటే ఇంకా వినాలనిపిస్తుంది. అద్భుత రచన" అన్నారు.

ఆచార్యుల వారు ధిషణాహంకారులేకానీ, శిశు మనస్తత్వంతో అందరితో ఎంతో ఆనందంగా కాలక్షేపం చేసేవారు. పుట్టపర్తివారు 1–9–1990న కడపలో తుదిశ్వాస వదిలారు.



# జానపద సాహిత్య దార్శనికుడు

## ఆచార్య బిరుదురాజు రామరాజు

*- ముంగర జాషువా,*

*జ్యోతి చంద్రమౌళి*

**నాలుగైదు దశాబ్దాల క్రితం జానపద కళాభిమానులూ జానపద కళా కారులూ విశ్వవిద్యాలయాల మెట్లు ఎక్కడానికి భయపడేవారు.**

అయితే, ఇప్పుడా పరిస్థితి లేదు. మన విశ్వ విద్యాలయాలు జానపద కళా విభాగాలను, పరిశోధనా కేంద్రాలను ఏర్పరచి, జానపద కళలను, కళాకారులను, పరిశోధకులను కొంత ప్రోత్సహిస్తున్నాయి. అయితే ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఇంకా సరిగ్గా జానపద కళాకారులకు అందడం లేదు. ఆ కళాకారులు డప్పులు వాయించుకుంటూ, పంబలు కొట్టుకుంటూ, రుంజలు మ్రోగిస్తూ, కథలు చెప్పుకుంటూ, భాగవతాలు ఆడుకుంటూ బక్కచిక్కిన గంగిరెద్దులను ఆడిస్తూ, పిట్టల దొరల్లా మాట్లాడుకుంటూ బ్రతుకీడుస్తున్నారు. అప్పుడప్పుడూ కళా ప్రదర్శనల నిస్తున్నామనే ఆత్మ సంతృప్తితో, ఆకలిని అణిచివేస్తూ, అవసరాలను అనవసరాలు అని అనుకుంటూ పేద జానపద కళాకారులున్నారు. కొంతమంది కళల నుంచి దూరంగా పారిపోయి కూలీ నాలీ చేసుకుంటూ జీవిస్తున్నారు. పేద జానపద కళాకారులకు తగిన గుర్తింపు, సామాజిక భద్రత, గౌరవంలాంటివి అందడం లేదనేది కూడా విస్మరించరాని కఠోర వాస్తవం. ఒక హంస అవార్డు చిందుల ఎల్లమ్మకు, నిజామాబాదు జోగిని జగ్గరు జంగమ్మ, సుద్దాల అశోక తేజ లాంటి ఇద్దరు ముగ్గురికి పురస్కారాలందించడము కంటితుడుపు చర్యే!

ప్రస్తుతం ఇంతవరకైనా సమాజమూ, విశ్వవిద్యాలయాలు జానపద కళలను గుర్తించడానికి ఆద్యుడు ఇటీవల కన్నుమూసిన ఆచార్య బిరుదురాజు రామరాజుగారు. ఆయనంటే, ఒకే గూటి క్రింద జీవించే జానపద కళాకారులకు, రచయితలకు, పరిశోధకులకు, విశ్వవిద్యాలయాల ఆచార్యులకు ఎంతో గౌరవం. ఇంత విశిష్ట గౌరవాన్ని పొందడానికి కారణం బిరుదురాజుగారి అయిదున్నర దశాబ్దాల కఠోర కృషి మాత్రమే కాని మరొకటి కాదు.

బిరుదురాజు రామరాజు 1925 ఏప్రియల్ 16వ తేదీన వరంగల్ జిల్లా దేవనూరు గ్రామంలో నారాయణరాజు లక్ష్మీదేవి దంపతులకు జన్మించి, 21.2.2010న హైదరాబాద్‌లో తుది శ్వాస విడిచారు. జననానికీ, మరణానికీ మధ్య ఆయన కర్మణ్య జీవితం ఎంతో విస్తృతమైనది, గాఢ సాంద్రత కలిగినది. ఆయన మేధో జీవితాన్ని గురించి యీ వ్యాసం స్థూలంగా పరామర్శిస్తుంది.

సామాన్య పాఠకులూ, పరిశోధకులూ జానపద కళాచరిత్రలో పుటలను తిరగవేస్తే తొలి జానపద కళా పరిశోధకుడిగా బిరుదురాజు రామరాజుగారి పేరు కనిపిస్తుంది. ఆధునిక సాహిత్యానికి గురజాడ ఆద్యుడైతే, ఆధునిక జానపద సాహిత్య నిర్మాణానికి బిరుదురాజు వారు ఆద్యుడు. ప్రతిపల్లె పదంలో ఆయన గుండె చప్పుళ్లు వినిపిస్తాయి. ఈనాడు తెలంగాణాపాట చిరుగాలిలో మమేకమై, వాడవాడల్లో జనం

---

*ముంగర జాషువ, సెల్ : 9052676007* *విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, 9949999908*

ఉద్రూతలూగడానికి, ఉద్యమాలకు ఊపిరులూదడానికి, అన్నార్తుల ఘోషను ప్రతిధ్వనించడానికీ, ప్రకృతిలో కొమ్మారెమ్మా తలలూపడానికి బిరుదురాజు వారి కృషియే ప్రధానం. ప్రత్యేకించి తెలంగాణా పాటను, గేయాలను విత్తనాలుగా యీ మట్టిలో చల్లి, భావితరాలకు కల్పతరువులను అందించాడు. ఆయన నిర్విరామకృషి, ఈనాటి మేటి జానపద కవి గాయకులకు చల్లని నీడనిచ్చి, సేదతీర్చి తెలంగాణా సంస్కృతిని కాపాడటానికి ఒక మహత్తర స్ఫూర్తినీ, శక్తినీ యిచ్చాయి.

బిరుదరాజు వారి రచనా స్రవంతి అనేక పాయలుగా ప్రవహించింది. అవి 1) జానపద గేయాల సేకరణ, పరిష్కరణ, 2) శిలాశాసనాల అన్వేషణ, పరిష్కరణ, 3) తెలుగు, సంస్కృత గ్రంథాల పరిష్కరణ, ముద్రణ, 4) అనువాదాలు, 5) సాంస్కృతిక కార్యకలాపాలు, 6) జాతీయోద్యమంలో పాల్గొనటం, 7) జాతీయ, రాష్ట్రీయ గోష్ఠుల నిర్వహణ, దేవాలయాల పునరుద్ధరణ మొ॥నవి.

తెలంగాణా పల్లెల్లో కాలికి బలపం కట్టుకొని వందల మైళ్లు తిరిగి పిల్లగాండ్ల దగ్గర నుంచి వయోవృద్ధుల వరకూ, వారి హృదయాలను తట్టి, పాటలు పాడించి, గేయాలను సేకరించి, రికార్డు చేశారు. గ్రామీణుల దగ్గరనుంచి తను అనుకున్న ఫలితాలను రాబట్టడానికి, లాలించి, బుజ్జగించి, పనిగాకపోతే రెవిన్యూ సిబ్బందిచే బెదిరించి కూడా పాడించి, తరతరాల నుంచి వస్తున్న అశిక్షణా పాండిత్యాన్ని, కవిత్వాన్ని చరిత్రపుటల్లోకి ఎక్కించారు. ఆయన కృషి 'నభూతో నభవిష్యతి.'

తెలంగాణ గ్రామాల్లో అటకలమీద కెక్కిన వందల తాళ పత్ర గ్రంథాలను సేకరించి భద్రపరచాడు, కొన్ని పరిష్కరించి ముద్రించాడు. తెలుగు వెలుగులను ప్రసరింపజేశాడు. తెలంగాణా పిల్లల పాటలు, పల్లెపాటలు, త్రివేణి (సంకలన గ్రంథం) లాంటివే కాకుండా, తెలుగు వీరుడు, వీర గాథలు, జానపద గేయ సాహిత్యం, మరుగున పడిన మాణిక్యాలు, ఉర్దూ, తెలుగు నిఘంటువు, Folk Tales of Andhra Pradesh, మున్నగు విశిష్ట గ్రంథాలను రచించారు. ఆయన బహుభాషా పాండిత్యం, వారిని మంచి అనువాదకుడిగా మార్చింది. గురుగోవిందసింగ్ చరిత్ర, ప్రేమచంద్ వారి అనువాద రచనలు. తెలుగులో ప్రసన్న రాఘవ నాట్య ప్రబంధం, రాఘవాభ్యుదయం, శివరాత్రి మహాత్మ్యములాంటి గ్రంథాలను, ఇంకా సంస్కృతంలో వసు చరిత్రమ్, జాంబవతీ పరిణయమ్, శృంగార శేఖర బాణమ్, రామాయణ సార తిలకమ్, ఇంకా అనేక సంస్కృతాంధ్ర గ్రంథాలను పరిష్కరించారు. తాళపత్ర గ్రంథాలను, కావ్యాలను పరిష్కరించడం అంటే అవి రచించడమంత క్లిష్టమైన పని. "Contribution of Andhra to Sanskrit Literature" అనే గ్రంథాన్ని రచించి తెలుగు వారిని భారతీయ ఆత్మకు దగ్గరగా చేశారు. ఆంధ్ర మహాభారతం, ఆంధ్ర మహాభాగవతం పరిష్కర్తలలో వీరూ ఒకరు. బిరుదురాజువారు కనుగొన్న శాసనాలు గంభీరావుపేట చెరువు గట్టు మీద లభించిన పెద్ద శాసనం, వరంగల్లు చెరువు గట్టు మీద లభించిన గణపతి దేవ చక్రవర్తి శాసనం ముఖ్యమైనవని చరిత్ర కారులు భావిస్తారు. జానపద సాహిత్యా నిర్మాణంలో వీరి పరిశోధనలు, రచనలు కూడా శిలాశాసనాలు లాంటివే! వాటికి మరణం లేదు.

బిరుదురాజు రామరాజు గారు దాదాపు 29 గ్రంథాలు రచించారు. జాతీయ, అంతర్జాతీయ, సదస్సులలో 270 వ్యాసాల వరకు సమర్పించారు. కొంత మంది కవుల, మేధావుల జిజ్ఞాస ప్రారంభమౌతుందిగాని, ఆపడం వారి చేతుల్లో కూడా వుండదు. వీరు రచించిన వ్యాసాలు విజ్ఞాన సర్వస్వం, ద్రవిడయన్ ఎన్సైక్లోపీడియా, ఎన్సైక్లోపీడియా ఆఫ్ ఇండియన్ లిటరేచర్ వంటి ఉద్గ్రంథాలలో చోటు చేసుకొన్నవి. బెంగుళూరు ఇ.బి.హెచ్. వారికి "ఆంధ్ర సాంస్కృతిక వైభవం" అనే పేరుతో 500 గ్రంథాల ప్రచురణకు బ్లూ ప్రింటు్లు తయారు చేసి ఇచ్చారు. అందులో 16 గ్రంథాలను తనే ముద్రణకు సిద్ధం చేశారు. ఇటువంటి అవిశ్రాంత కృషివల్లనే తెలుగు వారిలో తొలిసారి "జాతీయ ఆచార్య" పురస్కారాన్ని అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే "పద్మాలు" వారికి అందలేదు.

శ్రీ రామరాజుగారు 1951లో లెక్చరర్గా ఉద్యోగ జీవితం ప్రారంభించి 1983లో పదవీ విరమణ చేసే వరకు అనేక పదవులకు వన్నె పెట్టారు. ఆచార్యులుగా, తెలుగు శాఖాధ్యక్షులుగా, డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్టుగా, వరంగల్ పోస్టు గ్రాడ్యుయేట్ సెంటర్ ప్రిన్సిపాల్గా, ఎమిరిటిస్ ప్రొఫెసరుగా పనిచేశారు. వారి యొద్ద దాదాపు 37 మంది పరిశోధనలు

చేసి పిహెచ్.డి సంపాదించారు. వారి శిష్యులు ఉపకుల పతులయ్యారు. వీరికి ఆ అవకాశం రాలేదు, కాని జానపద విజ్ఞాన దార్శనికులైనారు.

నిజాం సర్కారుకి వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో పాల్గొన్నారు. ఆంధ్ర మహాసభ, హిందూ మహాసభలలో పాల్గొని విద్యార్థి దశలో ఉద్యమాలలో పాల్గొని జైలు జీవితాన్ని గడిపారు. కొన్ని ఆదర్శాలు లేకుండా జీవించడం బిరుదురాజు వారికి చేతకాలేదు. ఆయన చైతన్యం అలాంటిది. మహామహులైన సురవరం ప్రతాపరెడ్డి, ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం, శ్రీపాద గోపాల కృష్ణమూర్తి, మల్లంపల్లి సోమశేఖర శర్మ, నేదుకూరి గంగాధర రావు గారల ప్రేరణ, ప్రోత్సాహం వీరికి లభించింది. ప్రతిభావంతుడైనా ప్రోత్సాహం లేకపోతే అద్దం మసక బారినట్లుగా నిస్తేజుడౌతాడు. అయితే బిరుదురాజు వారికి సాహితీ సంపన్నుల స్నేహ హస్తం బాగా అందింది.

రామరాజుగారికి కలిగిన ప్రోత్సాహాన్ని గురించి చరిత్ర పరిశోధకుడు శ్రీ కుర్రా జితేంద్రబాబు ఒక వ్యాసంలో "ఒక సభలో సురవరం ప్రతాపరెడ్డిగారున్నప్పుడు రామరాజుగారు జానపద గేయ సాహిత్యంపై ఉపన్యసించగా సురవరం ప్రతాపరెడ్డిగారు రామరాజును ప్రోత్సహించి ఈ జానపద సాహిత్యంలో పరిశోధన కొనసాగించమన్నారు. ఆనాడు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధిపతిగా వున్న ఖండవల్లి లక్ష్మీరంజనం గారు 'జానపద సాహిత్యంలో చేసే పరిశోధన ఏముంటుంద'ని పెదవి విరచగా, రామరాజుగారు సురవరం ప్రతాపరెడ్డిని కలిసి ఈ విషయం తెలిపి, వారిని వెంటతీసుకొని ఖండవల్లి లక్ష్మీరంజనం గారి వద్దకు వెళ్ళగా ప్రతాపరెడ్డిగారు చేయవలసిన పరిశోధన అంతా జానపద గేయ సాహిత్యంలోనే ఉందని చెప్పి ఒప్పించారు" అని అన్నారు. సాహితీ జగత్తులో సురవరం ప్రతాపరెడ్డిగారి కాలానికి ఇప్పటి కాలానికి తేడా ఏమిటంటే అప్పుడు విషయ పరిగ్రహణతో పాటు, సమాజంలోకి ఉన్నత విలువలు కలిగిన సాహిత్యాంశాలను ఏ విధంగా తీసుకు వెళ్ళాలనే, 'తపన' పుష్కలంగా వుండేది. ఇప్పటి సాహిత్య కారుల 'తపన' 'తన' వరకే పరిమిత మౌతుంది. విలువలకు విడాకులిచ్చేశాం!

ఇక్కడ కొన్ని బిరుదురాజుగారి పరిశోధనాంశాలను ఉట్టంకించవలసిన ఆవశ్యకత వుంది. ఉదాహరణకు బిరుదురాజుగారు "తెలుగు జానపద గేయ సాహిత్యం" అన్న గ్రంథంలో జానపద గేయానికి చక్కని నిర్వచనం ఇచ్చారు. ఆయనంటారు "మానవుడు నాగరికతా సౌధ నిర్మాణమునకు పునాదులు త్రవ్వినప్పుడు అప్రయత్నముగా ననాలోచితముగా నాతని నోటి నుండి వెడలిన పృథ్వీగంధ సంవాసితములైన మాటలు గంధ వహుడు నడచిన బాటలందు పాటలై నడచి దేశ పరిభ్రమణమున నొకచో విరిగి మరియొకచో తరిగి ఇంకొక చోట పెరిగి జానపద గేయమయ్యెను" – అని అన్నారు. విశిష్టమైన విశ్లేషణ ఇది.

జానపదులు తమ కన్నీళ్లను తుడుచుకోవడానికీ వెనుకబడిన దళిత, దళితేతర వర్గాల వారు అవమానాలకు కృంగినపుడు, పండుగ పబ్బాలకు పొంగినప్పుడు, నాట్లు వేసేటప్పుడు, కోతకోసేటప్పుడు వారి గళాల్లో, గుండెల్లో పాట కమ్మని నీటి వూటగా ఉవ్వెత్తున లేచింది. అది ఒకతరం నుంచి ఇంకొక తరానికి 'మౌఖిక, అశిక్షిత సాహిత్యంగా ప్రవహించింది – బిరుదురాజు వారి కృషితో శిష్ట సమాజానికి అందింది. రామరాజు జానపద గేయ తత్వాన్ని Unconscious art (అచేతన కళ) అని పేర్కొనడం ఒక గొప్ప సత్యం. ఇంకా గేయ కవిత్వంలోని రస విషయాన్ని ఆధునిక దృష్టితో యీ విధంగా అన్నారు: "జానపద గేయ మంతా నొక రసఘుటిక భావ కవిత్వం నందు వలె పల్లెపాటలందు ఆత్మపర కవిత్వాంశము (Subjective Poetry) హెచ్చు. కాని కథ గేయములందు మాత్రము బహిర్వస్తు కవిత్వం (Objective Poetry) హెచ్చు. భావకవిత్వమే కాదు, ఏ కవిత్వమైనను ఆత్మపరమైనదే యనవచ్చును. రస ప్రతీతి యందీ రెండు కవిత్వము లేక మార్గముననే సాగి పోవును. సమగ్రమనుష్య జీవితమునుగాని, రసమునకు స్థాయిత్వము కలుగునంతటి పరిపూర్ణత్వముగాని మనకు దీనియందు గోచరింపవు" (తెలుగు జానపద గేయ సాహిత్యం నుండి). శ్రీ బిరుదురాజు రసదృష్టికీ ప్రాధాన్యత నీయడం ఇక్కడ గమనించవలసిన అంశం. ఏ కవిత్వమైనా ఆత్మాశ్రయం అనడం నవీనులకు నచ్చని అంశం అయినప్పటికీ, కళా దృష్టికి, మనో వైజ్ఞానికతకూ, సహజాతపరంగా చూసినప్పుడు బిరుదురాజుగారి పరిశీలన సమంజసమైనదే! ఇంకా వారి గ్రంథాల నుంచి అనేక విషయాలు ప్రస్తావించవలసిన ఆవశ్యకతను ఇంకొక వ్యాసానికి బదలాయించాను. శ్రీ బిరుదురాజు వారు సేకరించిన ఒక

కమనీయ గేయంతో, ఈ రచనకు కొంత రమణీయతను అద్దాలనిపిస్తుంది. ఆ గేయం ఇది:

"కొండన్న మాదన్న నారికేళో
వేట పొయ్యే రాములు నారికేళో
బంగారి పాశిల[1] " ([1]చెప్పులు)
బంగారి బొడ్లెబాకు "
పిడికెడు వడ్లు తీసి "
కొన గోర వొలిచె "
చిక్కుడు పువ్వులు "
సిరిగె[2] తోమి " ([2]కుండ)
కొనగోర బియ్యమొలిచె "
మాచేత పోటేసిరా "
అమ్మలా వాయమ్మ "
నీళ్ళైన ఇయ్యవమ్మ "
మీ అమ్మ మరదల "
నేను ఉండా మరిది "

చివరిగా, శ్రీ బిరుదురాజు వారి వేదాంత ధోరణి గురించి రెండు వాక్యాలు వ్రాయవలసిన ఆవశ్యకత వుంది. ఆయన "ఏ ఒక దానిని తెలుసుకుంటే ఇదంతా తెలుస్తుందో" (యస్మిన్నేక స్మిన్విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతంభవతి-చాందోగ్యోపనిషత్) అది తెలుసుకోవాలని, హిందూమతం వైపు, సగుణారాధనవైపు, బాబాలవైపు, యోగులవైపు చూసి విఫలత పొందారు. విఫలత సఫలత వైపుకి దారి తీస్తుంది గాని, యీ విఫలత విఫలతే!. ఎవరూ పరిపూర్ణులు కారు. శ్రీ బిరుదురాజుగారి దేహం నశించినా ప్రాణం మాత్రం ఆయన గ్రంథాలలో దాగి వుంది. ఆ ప్రాణ స్పందననూ, చైతన్య దీప్తిని ఇంకా అర్థం చేసుకోవలసిన ఆవశ్యకత పరిశోధకులపై వుంది. బిరుదురాజు వారు తన దార్శనికతతో జానపద కళా విజ్ఞానానికి, శిష్ట సాంప్రదాయ కళలతో సమాన స్థాయిని ఏర్పరచి జయకేతనం ఎగురవేశారు.

---

*(30వ పుట తరువాయి)*

# చంద్రగ్రహణం

చిన్నాన్న : నిజం చెప్తున్నాను. నేడు విదేశీ శాస్త్రజ్ఞులు చంద్రుని పైకి వెళ్ళి అక్కడి ఎగుడు-దిగుడు నేలకు సంబంధించిన పటాలు తయారు చేస్తూ ఉండగా ఇక్కడ మన పండితులు ఇంకా 'శశాంకుడు' 'మృగాంకుడు' లాంటి పదాలతో చంద్రుణ్ణి స్తుతిస్తూనే ఉన్నారు! వీళ్ళను చంద్రలోకం పైకి తీసుకు వెళ్ళినా అక్కడ కూడా అగ్ని పర్వతాల నడుమ కుందేళ్ళు, జింకలు వెదకడం మొదలు పెడతారు!

వీళ్ళు చంద్రుని పైన ఎన్నో నిందలు మోపారు. నిజానికి ఆ నిందలకు తగినవాడు చంద్రుడు కాదు, మనమే వాటికి తగిన వాళ్ళం. మనం మన నీడను చూసే భూతమని బెదిరి పోతూ వచ్చాం. ఇంతకు మించి మూర్ఖత్వం మరేముంటుంది?

నేనన్నాను : చిన్నాన్నా, అటు చూడండి. చంద్రునికి గ్రహణం పూర్తిగా పట్టేసింది. ఇక విముక్తి కలుగుతుంది.

చిన్నాన్న : అవును. కానీ మనల్ను పట్టి పీడిస్తున్న మూర్ఖత్వమనే రాహువు పట్టు నుండి మనలను మనం విడిపించుకున్నప్పుడు కదా మనకు నిజమైన విముక్తి కలిగేది!

*'భారతం చంద్రవత్ గ్రస్తం మౌర్ఖ్యరూపేణ రాహుణా
న జానే కేన యత్నేన కదా మోక్షో భవిష్యతి!'*

(భారతదేశం, మూర్ఖత్వమనే రాహువు వశంలో ఉంది. ఎప్పుడు, ఏవిధంగా దానికి విముక్తి కలుగుతుందో తెలియడం లేదు)

ఇంతలో రేవు వద్ద సన్నాయి స్వరం వినిపించింది. విని చిన్నాన్న అన్నాడు: ఈ గొర్రెదాటు మనస్తత్వాన్ని మార్చడం కష్టం. భేరీ నినాదాల మధ్య కోయిల కంఠం ఎవరు వింటారు? అలాగే. వెళ్ళు, అక్కడ జరుగుతున్న పుణ్యాల దోపిడీలో నీవు కూడా ఒక మునక వేసిరా. లేకుంటే తర్వాత నా మూలంగానే ఆ అవకాశం తప్పిపోయిందని అంటావు!

# రసమయ ప్రకృతి

- సంజీవదేవ్

**జీవన శిల్పమంటే ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించటమే..
అంతకు మించిన ఆనందం కోసం సాధన చేయటమే - రసానంద తరంగారోహణమే...**

"కంటికి కనిపించేది మాత్రమే సత్యం. కనుపించనిదంతా కల్ల. వట్టిమాయ" అంటారు కొందరు. "కంటికి కనిపించేదంతా వట్టి మాయ, కనుపించనిది మాత్రమే సత్యం" అంటారు మరికొందరు. ఉభయుల వాదాలు అసంపూర్ణంగా గోచరిస్తవి. ఇంద్రియాలకు గోచరించేది మాత్రమే సత్యం. అతీంద్రియమైనదంతా అబద్ధం అనేది పాక్షిక దృష్టే. అదే విధంగా అతీంద్రియమైనది మాత్రమే సత్యం. ఇంద్రియ గోచరమైనదంతా అసత్యమే అనేదీ పాక్షిక దృష్టే. జడవాదుల వాస్తవవాదం అద్వైతుల మాయావాదం కూడా అసమగ్ర వాదాలే.

ఇక సమగ్రవాద మేమంటే రెండూ సత్యమేననేది; కనుపించే స్థూల జగత్తూ నిజమే, కనుపించని సూక్ష్మ జగత్తూ నిజమే. కనుపించేదీ మాయకాదు. కనుపించనిదీ మాయకాదు. అసలు లోతుకుపోతే దృశ్య జగత్తుకూ, అదృశ్య జగత్తుకూ భేదమే లేదు. స్థూలమైనదంతా స్థూలమూ కాదు, సూక్ష్మమైనదంతా సూక్ష్మమూ కాదు. జడం జడం కాదు. చేతన చేతనా కాదు. జడమే చేతన, చేతనే జడం, సత్తా ఒక్కటే; భేదం అభివ్యక్తిలో మాత్రమే. జడం అంతర్ముఖంగా కేంద్రీకృతమైనపుడు చేతనగా మారుతుంది. చేతన బహిర్ముఖంగా వికేంద్రితమైనపుడు జడంగా మారుతుంది. ఈ రెంటికీ అవస్థాభేదం తప్ప అస్తిత్వ భేదం లేదు. ఇదే సమగ్ర దృష్టి. ఇదే పూర్ణయోగం.

కన్ను తెరిస్తే కనుపిస్తుంది ప్రకృతిలోని రంగు. చెవి విప్పితే వినిపిస్తుంది ప్రకృతిలోని రాగం. ఈ కనుపించే రంగూ, వినిపించే రాగమూ కనుపించటమూ లేదు, వినిపించటమూ లేదని మనను మనం మోసం చేసుకోగలమా? కన్ను మూస్తే కనుపిస్తుంది. అదృశ్య సౌందర్యం, చెవి మూస్తే వినిపిస్తుంది అశ్రావ్య సంగీతం. ఈ అదృశ్య రూపమూ, అశ్రావ్యగానమూ పట్టి మిథ్య అని మనను మనం మోసం చేసుకోగలమా? శ్రావ్య రాగం మధురం, కాని అశ్రావ్య గానం మధురతరం అన్నాడొక ఆంగ్ల కవి. మనలోని అంతర్జగత్తు ఎంత వాస్తవమో మన బయటి బాహ్య ప్రకృతికూడ అంతే వాస్తవం. అంతర్జగత్తును చూడటం అందరికీ సాధ్యం కాకపోవచ్చు కాని బాహ్య ప్రకృతిని చూడటం అందరికీ సాధ్యమే. ఇది కూడా అందరికీ అనుకున్నంత సులభ సాధ్యం కాదు. కారణం చూడటమంటే కన్ను తెరవటం మాత్రమే కాదు. కన్ను తెరచిన వాళ్ళంతా చూస్తున్నారనటం భ్రమ. కన్ను తెరచినా చూడటం అనే విద్యను నేర్చుకోవాలి.

శరత్కాలంలో వినిర్మల నీలాకాశంలో ఎగిరే తెల్లని కొంగలనూ, నీళ్ళ ఒడ్డును పూగిసలాడే తెల్లని రెల్లు పూలనూ ఎందరు కన్నులుండి కూడ ఆనందిస్తున్నారు, బహు కొద్దిమంది మాత్రమే. రసయను ప్రకృతిని ఆనందించటం ఒక మధుర సాధన. మన జననం ప్రకృతిలో, మన జీవనం ప్రకృతిలో, మన మరణం ప్రకృతిలో. అయితే, ప్రకృతియొక్క సమ్మోహనంలో మునిగి వుండటమే మన లక్ష్యమా అంటే అదెప్పటికీ కానేకాదు. స్మరణాతీత కాలం నుండి ప్రకృతిని దాటటమే, సహజాన్నుండి అతీతులుగా రూపాంతరం చెందటమే మానవుని లక్ష్యంగా వస్తూ వుంది. అది, ప్రకృతిని ద్వేషించటం ద్వారా కాని, ప్రకృతిని చిన్న చూపు చూడటం

సూర్యదేవర సంజీవదేవ్ (1914 - 1999)

వల్ల గాని కాక, ప్రకృతిని ప్రేమించటం ద్వారా, ప్రకృతి శోభను ఆరాధించటం ద్వారా జరుగుతూ వస్తుంది. కనుకనే యీ ప్రకృతి ప్రేమికుల దృష్టిలో రసమయ ప్రకృతి అయింది. మృణ్మయదృశ్యం చిన్మయ కల్పనగా మారింది. ప్రాచీన కాలంనుండి, కవులు, గాయకులు, చిత్రకారులూ, తత్వద్రష్టలూ ప్రభృతులంతా తమ తమ రచనల్లో ప్రకృతి సౌందర్యానికీ రూపం ఇస్తూ వచ్చారు. మన దేశంలో కాళిదాసు తను "మేఘదూత", "కుమార సంభవం", "ఋతుసంహారం" మొదలైన రచనల్లో సృష్టించిన ప్రకృతి చిత్రాలు రసికుల హృదయాల్లో నిజంగా రసతరంగాలను రేకెత్తిస్తవి. ఇక పాశ్చాత్య దేశాల్లోని కవులలో ప్రసిద్ధ ఆంగ్ల కవి వర్డ్సువర్తు ప్రకృతి ప్రీతి జగద్విదితం. వర్డ్సువర్తు ప్రకృతి ఆరాధన కొంత అతిగా మారి సృష్టిలో ఎవ్వరికి ఇయ్యని విలువ ప్రకృతికి ఇచ్చాడు.

ఆంగ్ల కవి వర్డ్సువర్తు తన మధురకవితలో ప్రకృతి శోభకు అమరకల్పన నిస్తే, ఆంగ్ల రూపశిల్పి టర్నరు ప్రకృతి సౌందర్యాన్ని తన రంగుల రమ్యకాంతులలో చిరస్థాయి చేశాడు. టర్నరు, కాన్‌స్టేబిల్ తమ తమ కుంచెలతో ప్రకృతికి పూసిన రంగు యింకా కాంతి నిస్తూనేవుంది.

ప్రకృతి కవులను, చిత్రకారులను మాత్రమేకాక అనేకమంది జీవన శిల్పులను కూడ తన ఆరాధకులుగా చేసుకొన్నది. శిల్పాల్లోకన్నిటికి జీవన శిల్పం ఉత్కృష్టమయిన దంటారు. జీవన శిల్పికి కవిత లల్లటం చేతకాకపోవచ్చు, చిత్రాలు రచించటం తెలియక పోవచ్చు, సంగీతం రాకపోవచ్చు, నాట్యం చేయజాలకపోవచ్చు, కాని చక్కగా జీవించటం మాత్రం తెలుసు. జీవించటం తెలుసునంటే బ్రతికివుండటం తెలుసుసనికాదు. జీవించటం అంటే బ్రతికివుండటం కాదు. ప్రతిజీవికి బ్రతికివుండటం తెలుసును గాని జీవించటం తెలియదు. జీవించటమంటే ఏమిటి, జీవనశిల్పమంటే ఏమిటి అనేది ఇక్కడ అసందర్భం.

ప్రకృతిని కొందరు చిత్రాలు గీస్తే, మరికొందరు కవిత్వ మల్లితే, ఇంకా కొందరు దాన్ని ద్రవించారు. ఒక దాన్ని జీవించటం అన్నిటికంటే ఆనందం. ప్రకృతి శోభను జీవించిన మహనీయులలో ప్రాచీన చీనా దేశీయులు ప్రముఖులు. ఈ భూలోకంలో చీనా వారి ప్రకృతి ప్రేమ మరి ఏ ఇతర జాతిలోనూ గోచరించదు. చీనాదేశపు సాహిత్యం, సంగీతం, వీటన్నిటికంటె చిత్రరచన కూడా ప్రకృతి సౌందర్యాన్నే ప్రధానంగా ప్రతిబింబిస్తూంటవి. ప్రపంచంలో కొన్ని దేశాల్లో మానవుడిది ప్రధాన స్థానం. మరికొన్ని దేశాల్లో దేవతలది ప్రధాన స్థానం; కాని చీనాలో మాత్రం ప్రకృతిదే ప్రధాన స్థానం.

కొండలు, లోయలు, అరణ్యాలు, సెలయేళ్ళు, పచ్చిక బయళ్ళు, పగటి ఎండ, రాత్రి వెన్నెల, నల్లని మేఘాలు, చల్లని వర్షం, తెల్లని కొంగలు, దట్టమైన మంచు, ఆ మంచులో గుండా దూరాన అస్పష్టంగా ఛాయారూపంలో గోచరించే వెదురుపొదలు మొదలైనవి ఎన్నెన్నో ప్రకృతిలోని మధుర ఘట్టాలు చీనావారికి చిరంతన అనుభూతులు. చీనా వారి జాతీయ జీవనంలో వెదురు చెట్టు ఒక అనన్య సామగ్రి, వెదురు చెట్టు ఆకారం నిజంగా ఏదో రకమైన భావోద్దీపనకరంగా వుంటుంది. శరత్కాలంలో ఆకులు రాలిన వెదురు చెట్టు సూర్యోదయపు అరుణాకాశానికి అడ్డంగా నిలచి వుండటం చూస్తే నిజంగా ఎంత అరసికుని హృదయంలోనైనా రసానందపు పులకలు వేయక మానవు. వెదురుచెట్టు చీనా వారి రసజీవనంలోనే కాక నిత్య వ్యవహార జీవనంలో కూడ ఒక అనివార్య అంగంగా వుండిపోయింది. చీనావారు వెదురు మొక్కలను వండి తింటారు కూడ. వెదురు ఆకును గురించికాని, వెదురు రెబ్బను గురించికాని, వెదురు పొదను గురించి కాని సూచనలేని చీనావారి కవితలూ, చిత్రాలూ, వేదాంతాలూ చాలా తక్కువ వుంటవి. చీనా దేశంలో కలమూ, కుంచే, ఒకటేగనుక దాదాపు కవులంతా చిత్రకారులే. చిత్రకారులంతా కవులే.

అసలు ప్రపంచంలోని తత్వసాధకులంతా సౌందర్యో పాసకులే. అందుకే తత్వసాధకులంతా సురమ్యమైన ప్రాంతాల్లో ఆవాసం ఏర్పరుచుకోటం ఆచారంగా పెట్టుకున్నారు. మనదేశంలో తత్వసాధకులకు రసమయ ప్రకృతితో సంబంధం అనాది సిద్ధం. మానవుని రసచేతనమీద ప్రకృతి విచిత్రమైన ప్రభావాన్ని కలిగిస్తుంది. ఒక్కొక్క ప్రకృతి దృశ్యం మన హృదయంపైన, ఒక్కొక్క రకమైన భావావేశాన్ని సృజిస్తుంది. ప్రకృతిలోని ప్రతి ఋతువూ తన విచిత్ర ప్రభావాన్ని మానవునిపైన ఏ విధంగా చూపేదీ కాళిదాసు తన "ఋతు సంహారం"లో చక్కగా వర్ణించాడు.

మామూలు మానవుడు మొదలు కళాజీవుల వరకూ, కళా జీవులు మొదలు తత్వసాధకులవరకూ అందరిలోనూ ప్రకృతి సౌందర్య పిపాస అగమ్యంగా గోచరిస్తుంది. ప్రకృతి

బంధననుండి విడిబడాలనుకొనే యోగసాధకులకు కూడ ప్రకృతి సౌందర్యపు అనురాగం వదలదు. ప్రకృతిలోని కొన్ని రసమయ దృశ్యాలు యోగసాధకులకు చాలా లాభసాటిగా కూడ వుంటవట. అందుకనే "శ్వేతాశ్వతరోపనిషత్"లో ప్రకృతి దృశ్యాలను గురించి వున్నది.

**"నీహారధూమార్కాని లాసలానాం / ఖద్యోత విద్యుత్ స్పటిక శశీనాం ఏతాని రూపాణి పురఃసరాణి / బ్రహ్మణ్యభి వ్యక్తి కరాణి యోగే."**

అనగా యోగంలో బ్రహ్మ సాక్షాత్కారం కలగబోయే ముందు మంచు, పొగ, గాలి, అగ్ని, మెరుగు పురుగులు మెరుపులూ, స్పటికమూ, చంద్రుడూ, ఇవన్నీ ప్రత్యక్ష మవుతవట. ముందు వీటి సాక్షాత్కారం అయిన తరువాతనే బ్రహ్మ సాక్షాత్కారమట. నిజంగా యీ పేర్కొన్నవన్నీ ఎటువంటి రసమయ దృశ్యాలు! మంచు, పొగ, అగ్ని, మెరుగు పురుగులు, మెరుపులు, స్పటికాలు, చంద్రుడు ఇవన్నీ ఏ చిత్రకారునికైనా, ఏ కవికైనా, సుందర విషయ వస్తువులు.

ప్రకృతి దృశ్యాలు మన మన ప్రకృతిపైన ఎటువంటి చిత్రమైన ప్రభావాన్ని ప్రసరించుతవి! ఎండాకాలంలో వైశిష్ట్యం లేని, చవీ సారంలేని ఆ బూడిదరంగు ఆకాశాన్ని చూచి చూచి విసుగెత్తి వున్న కంటికీ, హృదయానికీ తొలకరిలోని తొలిరోజు సంధ్యవేళలో పశ్చిమోత్తర దిశగా ఎగురుతూ వస్తున్న మేఘ ఖండనాన్ని చూచే వరకు కలిగే చల్లదనమూ, ఆనందమూ అద్భుతం. ఈ ఆనందానికి కారణం భరించలేని వేడి పోతుందనీ, చల్లదనం వస్తుందని కాదు. దిసి ఆకాశం మన మనస్సుపైన ఒక విధమైన విసుగునూ, ఆజ్ఞాన వేదననూ కలిగిస్తుంది. ఆకాశం అంతా ఖాళీ లేకుండా కారు మేఘాలు క్రమ్మినా కూడ మనస్సు కుంచితం అవుతుంది. ఆకాశం కనపడకుండా అక్కడక్కడ మేఘఖండాలుంటే హృదయాని కానందం. మేఘాలు లేకపోయిన్పటికీ శీతాకాలపు గాఢ నీలాకాశం కూడ హృదయంపైన ఆనందో ద్రేకాన్నే కలిగిస్తుంది. ఎండాకాలపు బూడిదరంగు దిసి ఆకాశం మాత్రం మనస్సుపైన చాలా నిరాశా, నిస్పృహాన్ని కలిగిస్తుంది. కనుకనే ప్రకృతి దృశ్యాలను ఫోటో తీసేటప్పుడు దిసి ఆకాశం పడకుండా పసుపురంగుదిగాని, నారింజరంగుది గాని, లేక ఎరుపు రంగుదిగాని ఫిల్టర్ కెమెరా లెన్సుకు తగిలిస్తారు. ఆ సమయాన ఆకాశంలో మేఘాలు గనుక వుంటే ఫిలింమీద అవి పడతవి. మేఘాలు లేనిచో వట్టి ఆకాశం కనీసం ఒక విధమైన నల్ల రంగుగా నైనా వస్తుంది బోసిగా లేకుండా.

చీనా వారి తరువాత జపాను వారిలో ప్రకృతి సౌందర్యపు తృష్ణ బాగా కనుపిస్తుంది. చీనా వారి ప్రకృతి ఆరాధన మహాకావ్యం లాంటిది; జపానువారిది ఖండకావ్యం లాంటిది. చీనావారి ప్రకృతి రచనలు ఎత్తూ, లోతూ, దూరమూ కలిగి, అదొక గంభీరమైన రహస్య మయంగా వుంటవి. జపానువారి ప్రకృతి రచనలు దృశ్య జగత్తులోని ఆంశిక రూపాన్ని మాత్రమే ప్రదర్శిస్తవి. పర్వత శిఖరం యొక్క కొనను మాత్రమే ప్రదర్శిస్తవి. పర్వతం శిరం యొక్క కొనను మాత్రమో, కొమ్మ యొక్క ఒక రెమ్మను మాత్రమో, లేక రెమ్మలోని ఒక రెబ్బను మాత్రమో, ఆ రెబ్బలోని ఒక పుష్పాన్ని మాత్రమో, లేక పుష్పంలోని ఒక దళాన్ని మాత్రమో జపానువారి కళాసృష్టి ప్రదర్శిస్తుంది. వీరి చిత్రకళా, కవిత్వము కూడ ప్రకృతిలోని ఏదో అతిస్వల్ప భాగాన్ని మాత్రమే తీసుకొని చూపుతవి. వీరిదంతా క్లోజ్ అప్ క్రింది కొస్తుంది. వీరి చిత్రరచనలలాగా వీరి కవిత్వం కూడ సూక్ష్మంలో మోక్షం చూపుతుంది. జపానీయుల "హుక్కు" అనబడే మూడు పంక్తుల పద్యం చాలా రసవంతంగా వుంటుంది. దీనికి మొత్తం 17 మాత్రలు. మొదటి పంక్తికి 5, రెండవ పంక్తికి 7, మూడవ పంక్తికి 5, ప్రకృతిలో మధుర ఘట్టాలను వ్యంజనాత్మకంగా చూపిస్తవి యీ జపనీయుల "హుక్కు" కవితలు.

ఈ 'హుక్కు' కవితను పదచిత్రాలనవచ్చు. ప్రకృతిలోని అతి లలితమైన సన్నివేశాన్ని మన ముందు వుంచుతవి. ఆంగ్లానువాదాల నుండి కొన్ని తెలుగు వాక్యాల్లో ఇచ్చట ప్రదర్శించబడుతున్నవి.

పర్వత మార్గం వెంట / ఫ్లం పుష్పాల పరిమళం
అదుగో ఉదయిస్తున్న సూర్యుడు

ప్రకృతిని వర్ణిస్తున్న యీ పద చిత్రం శ్రోతల హృదయాల్లో ఎన్నో విధాలైన మధుర స్మృతులనూ, సుందర దృశ్యాలను రేకెత్తిస్తుంది. సూర్యోద సమయాన పర్వత మార్గంగుండా పోతుంటే, పుష్పాల సౌరభం కూడా వస్తూ వుంటే మానవుని రస చేతన అతీంద్రియ లోకాల కెగసి పోతుంది. ఈ 'హుక్కు' కవితలో ప్రకృతిలో శోభను గురించిన వివరాలేమీ వర్ణితం కాలేదు. పర్వత మార్గం వెంట, అన్న ఆ ఒక్క వాక్యం చాలు. శ్రోత హృదయంలో పార్వత్య సౌందర్యం అంతా కన్నులెదుట

సాక్షాత్కరిస్తుంది. పర్వత మార్గం వెంట అని వినగానే, కొండల పైగా పాము మెలికలు తిరుగుతూ వెళ్ళిన మార్గమూ, నిటారైన చెట్లతో కూడుకొన్న రహస్యమైన లోతు లోయలు, చల్లనిగాలి, తెల్లని సెలయేళ్ళూ, రకరకాల రంగుల దుస్తులతో కంచరి గాడిదల తోలుకువెళ్ళే పర్వత వాసులగు స్త్రీ పురుషులూ, మధుర రాగాలు పాడుతున్న వివిధ వన్య విహంగాలూ ఇలాంటివెన్నో మనకు ప్రత్యక్షమవుతవి. మరొక హుక్కు –

*శరత్ సంధ్య / నేనొక సరళమార్గంలోని కొచ్చాను /*
*నా యాత్రా మధ్యలో.*
ఇంకొకటి : *వేసవిలోని చెట్ల నీడ*
*నా మేజా వరకు అందుకుంది / మలయ వాయువుతో.*

ప్రకృతి సౌందర్యాన్ని స్థూలంగా రెండు భాగాల క్రింద విభజించవచ్చు. ఒకటి ప్రదేశం, రెండు వాతావరణం. ఒక ప్రదేశం ఒకప్పుడు మనోహరంగా వుండకపోవచ్చు. కాని అదే మరొకప్పుడు మనోహరంగా వుండవచ్చు. ఒక్కొక్క ప్రదేశం ఒక్కొక్క వాతావరణాన్నిబట్టి రమ్యంగా గోచరించ ప్రారంభిస్తుంది. చాలమంది హిమాలయాలకు వేసవికాలంలో వెళతారు. ఇతర కాలాల్లో చలిగా వుంటుందని, కాని వేసవిలోని హిమాలయాలు చాల శ్రీహీనంగా వుంటవి. అచ్చటి వనస్పతి అంతా జీవకాంతిని కోల్పోయి, ఆకాశమంతా ఒక విధమైన బూడిద వర్ణపు పొగమంచుతో ఆచ్ఛాదితమై, దూరపు హిమశిఖరాలు స్పష్టంగా గోచరించక వేసవిలోని హిమాచల ప్రకృతంతా నిస్తేజంగా వుంటుంది. వర్షాకాలపు హిమవత్ ప్రదేశం, ఎండాకాలమంత శ్రీహీనంగా వుండకపోయినా మొత్తంమీద ఎక్కువ ఆహ్లాదకరంగా వుండదు. మేఘాల తెరలడ్డం మూలాన వర్షాకాలంలోని హిమాలయ ప్రకృతంతా మూయబడ్డట్టు సంకుచితంగానూ, సంక్షుభితంగానూ గోచరిస్తుంది.

హిమాలయాలకు స్వర్ణయుగం శరత్కాలం. శారదారంభంతో హిమగిరి వాతావరణమంతా స్ఫటిక నిర్మలమై సుదూర దృశ్యాలు చాల దృశ్యాలు చాల దగ్గరగా గోచరిస్తవి. వాతావరణంలోని పారదర్శికత మూలాన శరత్ కాలీన హిమాలయ ప్రదేశమంతా దూరాలను కోల్పోయి సన్నికటపర్తులవుతయి. నూరు మైళ్ళ దూరపు హిమశృంగాలు కూడ రెండు మైళ్ళలోని కొస్తవి. శరదృతువులో నీలమణిలాగ ప్రకాశించే శారదాకాశంలో అరుణకిరణాల స్పర్శతో స్వర్ణకాంతులు విరజిమ్మే హిమశిఖరాలు చూచేవాని కంటినీ, దానితో హృదయాన్నీ సుందర బృందావనంగా మారుస్తవి.

కొండ లెత్తుగానూ, లోయలు లోతుగానూ, మైదానాలు చదరంగానూ కనిపించే సత్యాన్ని ప్రాదేశిక స్వరూపం అంటాం. వాతావరణంతో సంబంధం లేకుండా కొన్ని ప్రాదేశిక స్వరూపాలు స్వతంత్రంగా, సుందర దృశ్యాలుగా వుంటవి. విశాలమైదానం, దానిలో ఒకే ఒక పొడుగాటి సర్వీ చెట్టూ, ఎటు చూచినా క్షితిజ రేఖలూ, ఇంకేమీ లేదు. ఎప్పుడు చూచినా యీ దృశ్యం బాగుండవచ్చు వాతావరణంతో సంబంధం లేకుండా. కాని అదే చెట్టు శీతకాలపు పొడుగు నీడతో కలిసి కనిపించినప్పుడు అదే దృశ్యపు శోభ ద్విగుణీకృతం అవుతుంది. అప్పుడు ప్రాదేశిక సౌందర్యం వాతావరణ శోభతో అలంకృతమైనట్లు అర్థం. దీనికి తోడు క్షితిజ రేఖల వద్ద గనుక దూదిపింజల మబ్బులు గనుకవుంటే, ఇక ఆ చెట్టుయొక్క దృశ్యం అద్భుతంగా వుంటుంది. అయితే ఇచ్చట ప్రాదేశిక సౌందర్యం కంటే వాతావరణ సౌందర్యం ప్రాధాన్యాన్ని వహిస్తుంది. నది కావలితీరాన పగిలిన మబ్బులలో సూర్యుడస్త మిస్తుంటాడు. ప్రవాహంలో దూరాన పడవ తెరచాప కనిపిస్తుంటుంది. తెరచాప, మబ్బులోని సూర్యాస్తమయమూ నదిలో ప్రతిబింబిస్తుంటవి. దూరంనుండి గోపాలకుల మురళీస్వరం వినిపిస్తుంది. అప్పుడు జడమయంగా అంతవరకూ గోచరిస్తున్న ప్రకృతంతా చైతన్యవంతంగా మారుతుంది. ద్రష్టా, దృశ్యమూ ఏకమవుతారు. మనచుట్టూ ఇలాంటి రసమయ ప్రకృతి మన కందరికీ లీలానికేతనమై వున్నది. అయితే యీ లీలానికేతనాన్ని మనం ఎంతవరకు ఉపయోగించుకుంటున్నామో తెలియదు.

మన చుట్టూ వున్న ఇలాంటి రసమయ ప్రకృతి యొక్క సౌందర్యానికి మనం దాసులమై అందులోనే లీనమై అక్కడే ఆగిపోకూడదు. ప్రకృతి సౌందర్యం మనకు ఇచ్చే ఆనందంకంటే మించిన ఆనందం కొరకు మనం ఇంకా ఊర్ధ్వగాములమై ప్రయాణాన్ని సాగించవలసిందే. జీవితంలో ప్రకృతి సౌందర్యమే ప్రధానం గాదు. అంతకు మించిన సౌందర్యం, అంతకు మించిన ఆనందం కొరకు సాగుతూన్న సాధనలో మనం సాధకులం. దృశ్యం నుండి అదృశ్యానికి పోతూన్న పథంలో మనం పథికులం. అధోచేతన నుండి ఊర్ధ్వ చేతనకెక్కే ఉత్తుంగ ఆరోహణలో ఆరోహకులం.

# మహారాజ సన్నిధిలో...



- సత్యజిత్ రే

"మీరు బొంబాయి నుండి వస్తున్నారా?" – అడిగారు మహారాజుగారు.

"లేదు. కలకత్తా నుండి" అన్నాను నేను.

"అయితే మీరు తీసేది బెంగాలీ సినిమానా?" – మహారాజుగారిలో ఏదో కొంత నిస్పృహ కనిపించింది.

వచ్చి, నా ప్రక్కనే ఖాళీ సోఫాలో కూచున్నారు. ఖరీదైన, ఎత్తైన సోఫాలు ఆయన దర్బార్ హాలులో గత కీర్తిని చాటుతున్నట్లుగా ఉన్నాయి. పైన నాలుగు మూలలా నాలుగు ఫ్లోరసెంట్ ట్యూబ్‌లు వెలుగుతున్నాయి. ఒక అరడజను పెయింటింగ్‌లు గోడలకు వేలాడ దీసి ఉన్నాయి. మధ్యలో కాశ్మీరీ టేబుల్ దానిమీద తళ తళ మెరిసే ఇత్తడి తొడుగులూ ఉన్నాయి.

జై సాల్మీర్ మహారాజుగారితో వారి దర్బార్‌లో కూర్చుని ఉన్నానని ... ఒక్క క్షణం నాకు నేనే నమ్మలేక పోయాను. కించిత్ ఆశ్చర్యం కూడా కలిగింది.

పడమటి రాజస్థాన్‌లో చితోడ్ తర్వాత అంతటి ఘనకీర్తి చరిత్రా కలిగిన కోట – జై సాల్మీర్. అల్లావుద్దీన్ ఖిల్జీని తిప్పి కొట్టింది. ఈ రాజావారి పూర్వీకులే! ఇప్పుడు వారు మా సినిమా కంపనీని తమ కోటలో చొరబడనిస్తారా? సహిస్తారా?

"మీకు మా జై సాల్మీర్ ఎందుకు కావాల్సి వచ్చిందీ?" అని రాజావారు అడిగారు. ఆయన అలా అడుగుతారని నే నూహించలేదు. ఆయన వయసు సుమారు నలభై ఉండొచ్చు. కాంతిలేని కళ్ళను కప్పుతున్న ఆయన కనురెప్పలు ఏమీ వ్యక్తీకరించవు.

"జై సాల్మీర్‌ను ఎన్నుకోవడానికి రెండు కారణాలున్నాయి. ఒకటి, ఈ వాతావరణం, నాటకీయంగా మా కథకు పూర్తిగా సరిపోతుంది. రెండు, ఇక్కడ ఇంత వరకు ఎవరూ సినిమా తీసినట్లు లేదు."

నేను చెప్పిన రెండో విషయాన్ని ఆయన సరిదిద్దారు.

"కొన్నేళ్ళ క్రితం ఇక్కడ 'ససి పున్ను' అనే సినిమా తీశారు. బహుశా పంజాబీ కంపనీ అనుకుంటాను" – అన్నారు.

కొద్దిసేపు మా మధ్య నిశ్శబ్దం రాజ్యం చేసింది. వాలిపోయి ఉండే ఆయన కనురెప్పలు ఒక మిల్లీ మీటరు పైకి లేచాయి.

"సరే! మీరు ఫోటోలు తీసుకోండి" – అన్నారాయన. మళ్ళీ వెంటనే "మీ సినిమాలో నాట్యాలేమైనా ఉన్నాయా?" అని అడిగారు.

"ఆఁ – ఒకటుంది. పైశాచిక నృత్యం. అది బెంగాల్‌లోని ఒక అరణ్య ప్రాంతంలో చిత్రీకరించాలని అనుకుంటున్నాం.

మహారాజుగారు చిన్న నవ్వొకటి నవ్వారు. ఇది ఫిబ్రవరి. లోగడ మేం డిసెంబర్‌లో కలుసుకున్నాం. ఈ మధ్య కాలంలో

ఆంగ్లం నుంచి అనువాదం : డా. దేవరాజు మహారాజు, సెల్ : 9908633949

కొంత భాగం బెంగాల్ పల్లెల్లోనూ, సిమ్లా కొండల్లో కుఫ్రీ మీదా చిత్రీకరించాం. అక్కడ మంచు సుమారు ఐదడుగుల లోతుంది. అలాగే నీటి చుక్క దొరకక, జంతువులు చచ్చిపోతున్న భయంకరమైన ఎడారిలో కూడా షూటింగ్ జరిపాం. ఇప్పుడిక కథలో దుష్ట చక్రవర్తి పాత్రకు సరిపడే వాతావరణాన్ని చిత్రీకరించాల్సి ఉంది.

"ఎనిమిది వందల యేళ్ల నాటి ఈ పురాతనమైన కోటలో చిత్రీకరించాలని అనుకున్నాం. అందుకే ఇప్పుడిక్కడికి వచ్చాం"

"అవునూ. మీ కేదో అనుమతి కావాలని విన్నాం?" రాజావారే అసలు విషయం అడిగారు.

"అవునండీ! మీ రాజ ప్రాసాదం పై భాగాన షూటింగ్ జరుపుకోవాలని ఉంది. కోటపైన అక్కడక్కడా కొన్ని జెండాలెగరేస్తాం. వాటిమీద ప్రత్యేకమైన రాజముద్ర లుంటాయి.

"కొంపదీసి మా జెండా ఊడదీయరు కదా?"

"అబ్బే లేదు. లేదు."

"అయితే సరే."

"యుద్ధ దృశ్యాల చిత్రీకరణకు, మాకు మీ విజయ భేరి కూడా కావాలి."

"సరే అయితే...దాన్ని కోట వెలుపలికి తీసుకు పోకుండా ఉన్నంత వరకు మాకు అభ్యంతర ముండదు."

"ఇకపోతే కొన్ని ఒంటెలు కావాలి"

"ఎన్ని?"

"కొన్ని వందల సంఖ్యలో. వాటిని నడిపే మనుషులు కూడా కావాలి." రాజా వారు ఒక్క నిమిషం ఆలోచించారు. కుమార్ బహద్దూర్‌ను పిలిచారు. కుమార్ బహద్దూర్ వారికి అతి సన్నిహితుడు. అల్లుడు అని తెలుసుకున్నాం.

"ఈ విషయం మేదో చూడు. వీళ్ళు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చెయ్" అని ఆజ్ఞాపించారు.

"అంతేనా?" అని నావైపు చూశారు.

"ఆఁ అంతేనండి."

"సరే అయితే, మరి మా అమ్మాయి మీ షూటింగ్ చూడాలని ఎంతో ముచ్చటపడుతోంది. మీ ప్రోగ్రాం ఏమిటో మా వాడికి తెలియజేయండి" – అని ఆయన కుమార్ బహదూర్ వైపు చూశారు.

★★★

"మహారాజా వారొచ్చారు" – అని ఎవరో అన్నారు. ఒంటెల వైపు నుండి తిరిగి పక్కకు చూశాను. ఎదురుగా ఒంటెలు షూటింగ్ కోసం గుంపులు గుంపులుగా పొజిషన్లో నిలబెట్టి ఉంచాం. వాటి ఎదురుగా రాజావారి జీపు వచ్చి ఆగింది. అయితే ఇంకా నయం కెమెరా పరిధిలోకి రాలేదు.

నేను వెళ్ళి నమస్కారం చేశాను.

"నమస్కారం! అయితే షూటింగ్ చేస్తున్నారన్నమాట!" అన్నారు రాజుగారు. ఆయన ముందు సీటులో కూర్చొని ఉన్నారు. వెనక సీటుకు అడ్డంగా ఒక చిన్న పరదా ఉంది.

రాజుగారి నుండి అనుమతి తీసుకుని వెంటనే నేను మళ్ళీ పనిలోపడ్డాను. ఇంతలో జనం జీపు చుట్టుముట్టారు. మేమంతా చప్పట్లు చరిచి, బొబ్బలు పెట్టి మూగిన జనాన్ని అక్కడి నుండి కదిలించాం. ఆపైన మళ్ళీ నానా హంగామా చేస్తే గాని, కెమెరా పరిధిలోకి జనం రాకుండా చేసుకోలేక పోయాం.

షూటింగ్ ముగించుకునే సరికి సాయంత్రం ఆరున్నర అయ్యింది. మార్చి నెలలో జైసాల్మీర్ ప్రాంతంలో చీకటి తొందరగా పడదు. పని ముగించుకుని, మేం 'పాక్' చేసుకునే సరికి జీపు వెళ్ళిపోయింది.

★★★

నేనూ, మా వాళ్ళు మరో పదిమంది రాజావారి సన్నిధిలో కాఫీ తాగుతూ, గులాబ్ జాంలు తింటూ కూచున్నాం.

"మేం రసగుల్లాలు కూడా చేయిస్తుంటాం" అన్నారు రాజుగారు. అప్పటికే మా షూటింగ్ పనంతా పూర్తయ్యింది. మరునాడు అక్కడి నుంచి వెళ్ళిపోవాలని అనుకుంటున్నాం.

"మీ కిక్కడ కొన్ని అద్భుతమైన కట్టడాలు కనిపిస్తాయి. ఛండీఘర్ కట్టడానికి పథకాలు రూపొందుతున్న దశలో అధికారులంతా వచ్చి, మా నగరాన్ని దర్శించి వెళ్ళారు."

సినిమాల మీద మహారాజుగారి అభిరుచి ఎలా ఉందో తెలుసుకోవాలని మాకు కొంత ఆసక్తి కలిగింది.

“నేను సినిమాలు పెద్దగా చూడను. అదీ ఎప్పుడైనా ఢిల్లీ వెళ్ళినపుడు! అయినా ఈ రోజుల్లో యేమంత మంచి సినిమాలు వస్తున్నాయనీ? నాకు ‘పరిణీత’ బాగా నచ్చింది. ఇంకొకటి...అదేమిటీ? మీ బెంగాలీ కథే – ఆం...‘దేవదాసు’ ఎంతో కళాత్మకంగా ఉంది.

మహారాజుగారు మా భాగాఛైనె వైపు తిరిగారు.

“నీ ఢోలక్ ఎందుకు తేలేదూ? తీసుకురావాల్సింది. మా కోసం కాసేపు వాయించే వాడివి కదా? ఇవ్వాళ నువ్వు వాయిస్తున్నప్పుడు చూశాం” అంటూ గొప్పగా తల ఊపారు.

ఇంతలో లోపలి నుండి సేవకుడు వచ్చాడు. పెద్ద పళ్ళెంలో పాలరాయితో చేసిన పాత్రలు తీసుకొచ్చారు. తీరా అవి చూస్తే టీపాట్, కప్పు, స్పూన్‌లు వగైరా –

ఆ ఎరుపు రంగు జై సాల్మీర్ పాలరాతి వస్తువులు చూసే సరికి మా తల తిరిగిపోయింది. అవి ఎంతో పలుచగా, నాజూకుగా ఉన్నాయి. ఊపిరి బిగబట్టి చూశాం. మెరుగు పెట్టిన బంగారంలా జిగేల్‌మని మెరుస్తున్నాయి.

“తొట్టిలో నీళ్ళు తీసుకురా” రాజా వారు ఆజ్ఞాపించారు. సేవకుడు నీలిరంగు ప్లాస్టిక్ తొట్టిలో సగానికి నీళ్ళు తెచ్చాడు. టీ కప్పులు, ఇతర సామాగ్రి మెల్లెగా తొట్టిలోని నీళ్ళలోకి విడిచారు. ఆశ్చర్యం!! అవన్నీ నీటిమీదే తేలుతూ కనిపించాయి.

ఏదో మ్యాజిక్ షో చూస్తున్నట్టు మేమంతా కళ్ళప్పగించి చూశాం.

“ఇవి ఒక ముస్లిం కళాకారుడు పాలరాతితో చెక్కాడు. అయితే అతనిప్పుడు లేడు. చనిపోయాడు. అతను నాకు చివరి సారిగా బహుకరించిన సెట్ ఇది. పాలరాతిని చెక్కి ఇంత పలుచగా, ఇంత నైపుణ్యంతో చెయ్యగలవాడు మరొకతను కూడా ఉన్నాడు. అయితే అతను పాకిస్తాన్ వెళ్ళిపోయాడు.

రాతి వస్తువులన్నీ నీటిలోంచి తీసి, తుడిచి బయట టేబుల్‌పై పెట్టాడు సేవకుడు.

కాసేపు నిశ్శబ్దం.

మహారాజుగారు వీడ్కోలు చెప్పడానికి సిద్ధపడ్డట్లుగా అనిపించింది. మాకూ కాలాతీతమైంది. మేం లేచాం.

“ఈరోజు చూశాం కదా? మీ చలనచిత్ర నిర్మాణం ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని. మీరంతా అలసి పోయ్యారు. కొన్ని రోజుల పాటు పూర్తిగా విశ్రాంతి తీసుకోండి.”

మేం మెల్లగా హాల్లోంచి బయట పడడానికి ప్రయత్నించాం.

“మా సినిమా ప్రీమియర్‌కు మీరు తప్పక కలకత్తా రావాలి!” – అని ఆహ్వానించాను.

మహారాజుగారి కళ్ళు కాస్తా మెరిశాయి. మాభాగాచైనె వైపు తిరిగి,

“మీ వాడు ఢోలక్ వాయిస్తానని మాట ఇస్తే తప్పకుండా వస్తాం” అని అన్నారు.

అందరం నవ్వుకుంటూ సెలవు తీసుకున్నాం. మి

పై సన్నివేశం ‘రే’ సినిమా ‘సోనార ఖిల్లా’ లోకేషన్ కోసం వెళ్ళినపుడు జరిగిన సంఘటన

ముకుల్ అనే కుర్రవాడికి వింత వింత స్మృతులు – గత జన్మ జ్ఞాపకాలు వెంటాడుతుంటాయి. అతను వేసిన బొమ్మల ఆధారంగా డా॥ హిజ్రా అవి జై సాల్మీర్ కోటకు సంబంధించాయని, ముకుల్‌ని అక్కడకు తీసుకెళ్తాడు. ఈ విషయం పేపర్లలో పొక్కేసరికి, అక్కడేదో నిధి ఉంటుందని, బందిపోట్లు కుర్రవాణ్ణి ఎత్తుకుపోతారు... డిటెక్టివ్ ఫయిదా – అతని సహాయకుడు తాపేష్‌తో కలిసి ముకుల్‌ని రక్షించడం కథ ... ఆద్యంతం ఉత్కంఠభరితంగా, హాస్యసహితంగా సాగుతుంది. అన్ని వయసులవారిని అలరించిన ఈ ‘రే’ సినిమాకు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు దక్కాయి.




# రసచర్చ - ఆధునికత

**- కాకుమాని శ్రీనివాసరావు**

ఆధునిక సాహిత్య ప్రక్రియలకు, ముఖ్యంగా నవలకు రససిద్ధాంతాన్ని అన్వయించే దృష్టితో రాసిన ఏడు వ్యాసాలతో కూడిన 'రసచర్చ–ఆధునికత' అనే పుస్తకాన్ని ఇటీవలే శ్రీమతి ముదిగంటి సుజాతారెడ్డిగారు వెలువరించారు.

ఈ పుస్తకంలోని ఏడు వ్యాసాలు ఒకేసారి రాసినవి కావు. 1980 నుండీ 2005 వరకు అప్పుడప్పుడు రాసినవి. రసాన్ని మనోవైజ్ఞానికంగా పరిశీలన చేయాలనే ప్రయత్నంలో ఒక వ్యాసం, నవలలకు రస సిద్ధాంతాన్ని అన్వయించే దృష్టితో రెండు వ్యాసాలు, ఆధునిక సాహిత్యంలో చెప్పే చైతన్యం, రసం ఒకటేనా? వేరేనా? అనే చర్చ చేస్తూ మరో వ్యాసం, నవలల్లో వస్తు ధ్వని ఉంటే, ఆ నవలలు ఆకట్టుకొంటాయని చెబుతూ మంచి వ్యాసం, రస దృష్టితో ఆధునిక కవిత్వాన్ని విమర్శించే అవకాశాన్ని మెరుగుపరిచే ఉద్దేశంతో రాసిన మరో వ్యాసం ఈ పుస్తకంలో చోటు చేసుకున్నాయి.

రచయిత్రి నవలకు రససిద్ధాంతాన్ని అన్వయిస్తూ 1980లో రాసిన వ్యాసాన్ని, ఖండిస్తూ, స్వాగతిస్తూ వచ్చిన 'ప్రతి విమర్శ'లను ఈ పుస్తకంలోనే పొందుపరిచి పాఠకులకు అందజేయటం పుస్తకపు విలువను పెంచింది. 90 పేజీల పుస్తకంలో ఈ ప్రతి విమర్శకులు 25 పేజీలు చోటు చేసుకొన్నాయి. దీనికి కారణం రచయిత్రి ఒక అకడమీషియన్ కావటమే. తనకు అనుకూలంగా, వ్యతిరేకంగా వచ్చిన విమర్శలను తన పుస్తకంలోనే ముద్రింపచేసి రచయిత్రి ఔదార్యాన్ని ప్రకటించుకొన్నారు. భవిష్యత్ తరాలు ఈ చర్చనంతా అధ్యయనం చేసి ఒక అవగాహన రావటానికి ఈ ప్రయత్నం దోహదం చేస్తుంది.

“సాహిత్య విమర్శ రీతుల్లో మనకు రీతి, వక్రోక్తి, ధ్వని, రసం మొదలైన సిద్ధాంతాలెన్నో ఉన్నాయి. అవి భారతీయ మేధస్సు ప్రపంచ సాహిత్య విమర్శకు ఇచ్చిన గొప్ప సిద్ధాంతాలు. మనకు ఎంతో జ్ఞానసంపద ఉంది. వాటిని ఆధునీకరించి కొత్త నిర్మాణాలను సృష్టించుకొని మన ఆధునిక సాహిత్యానికి అనువర్తింపజేసే కృషి అవసరమెంతో ఉంది” అంటూ ఈ అవసరం దృష్ట్యా తను ఈ పుస్తకాన్ని వెలువరిస్తున్నానని రచయిత్రి చెప్పుకొన్నారు.

“రససిద్ధాంతం ఫ్యూడల్ కళా ప్రమాణాలకు పరాకాష్ఠగా భావిస్తూ ఆధునిక విమర్శకులు కొందరు రససిద్ధాంతాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించకుండానే పనికిరాని బూజు పట్టిన సాహిత్య సిద్ధాంతంగా తీసి పారేస్తున్నారు” అని చెప్పి అలాంటి రస సిద్ధాంతాన్ని ఆధునిక ప్రక్రియ అయిన నవలను అనువర్తింప చేస్తున్నానని ఆమె రాశారు. ఈ అభిప్రాయాన్ని ఇక్కడ ఉదాహరించటం రచయిత్రి దృక్పథాన్ని చెప్పటానికే.

“రసం కళలోని అమృతం.” రసం అన్న పదానికి కాలక్రమంలో ఆస్వాదన, ఆహ్లాదం, ఆనందం, తన్మయత్వం, చమత్కారం, ఆత్మానువాదం లేదా బ్రహ్మానందం లాంటి అర్థాలు చెప్పబడ్డాయి. భరతుని కన్నా ముందునుండీ రస శబ్దం వాడబడుతూ ఉంది. శాస్త్రీయంగా రసాన్ని నాటకానికి అన్వయించి సిద్ధాంతీకరించినది భరతుడు. తర్వాత భట్టలోల్లటుడు, భట్ట శంకుశుడు, భట్టనాయకుడు, అభినవ గుప్తుడు మొదలైన వారు రసచర్చను చేపట్టారు. భరతునికి పూర్వం నందికేశ్వరుడు రసాన్ని గురించి చర్చించాడని రాజశేఖరుడు అభిప్రాయపడతాడు.

---

డా॥ కాకుమాని శ్రీనివాసరావు, సెల్ : 8008070775

ఏదేమైనా 'రస' పదానికున్న మౌలికార్థం 'ఆస్వాదన' అని చెప్పవచ్చు. భరతుడు నాట్యశాస్త్రంలో సమాహార కళ అయిన నాటకంలో రసం ఉత్పన్నమవుతుందని, అది ఎనిమిది విధాలుగా ఉండవచ్చునని శృంగారాది రసాలను ఎనిమిదింటిని చెప్పాడు, తర్వాత శాంతరసాన్ని జోడించి నవరసాలను గురించి చెప్పుకొంటున్నాము. భరతుని అభిప్రాయంలో రసం కళల యొక్క అనుభవం. అక్కడ రసం కళాసంబంధి రసాన్ని సాహిత్యానికి అనువర్తింప జేస్తూ వివేచన చేసిన మొదటి వ్యక్తి భట్టలోల్లటుడు. అనంతరం కావ్యాత్మ సిద్ధాంతాలు వెలువరించబడ్డాయి. ప్రస్తుతం రసం సాహిత్య విమర్శకు పనిముట్టుగా పనికి వస్తుందా లేదా అనేది ఈ రచయిత్రి తన పుస్తకంలో చేసిన చర్చ.

సాహిత్యం కళలలో ఒకటి. 'రసం' లలిత కళలు వివేచనకు సంబంధించిన సిద్ధాంతం. అది ఏ దేశమైనా కానివ్వండి, కళలకు సంబంధించి రసాస్వాదనను కాదనే వాడు ఎవ్వడూ లేడు. ఆధునికులు, ప్రాచీనులు అనే దృక్పథమూ, వారి వారి భావజాలాలు వేరని చెప్పే అభిప్రాయాలు కలిగిన కొందరు 'రస సిద్ధాంతం' బూజు పట్టిన సాహిత్య సిద్ధాంతంగా చెబుతున్నారనే బాధ రచయిత్రి కున్నది. దానిని ఖండించే ఉద్దేశంతో కొన్ని వ్యాసాలను గతంలో రాసారు. వాటిని ఇప్పుడు పుస్తక రూపంలో తీసుకొచ్చారు.

అయితే ఈ వ్యాసాలన్నీ ఒక్కసారే రాసినవి కాకపోవటం వల్లనో, ఒకే విషయాన్ని మళ్ళీ మళ్ళీ చెప్పటం వల్లనో ఈ వ్యాససంకలనం కలగూరగంపలా, గందరగోళంగా మారింది, పైగా పునరుక్తులే కాకుండా వైరుధ్యాలు కూడా చోటు చేసుకున్నాయి. మొదటి వ్యాసం సిలబస్ మరిచిపోయి చెప్పిన పాఠంలా సాగింది. మెదడులోని హైపోథాలమస్ (Hypothalamus) అనేది భావాలన్నిటికి మూలస్థానమని తెలుగులో చెప్పటమే ఈ వ్యాసంలో గుర్తించతగిన అంశం. "రసోత్పత్తి ఒక మనోవైజ్ఞానిక పరిశీలన" అనే ఈ వ్యాసంలో Cannon మరియు Bord అనే మనోవైజ్ఞానిక శాస్త్రజ్ఞుల ప్రస్తావనతో సాగిన వివరాలు తెలుగు పాఠకులకు తెలుగులో అందించటం ఒక్కటే నూతనమైన అంశం. "రస శబ్దానికి సమానమైన ఆంగ్ల శబ్దం "mood or sentiment" అని రచయిత్రి చెప్పటం కానీ, దాన్ని అంగీకరించే విషయంలోకానీ భేదాభిప్రాయాలుండ వచ్చు. రసాన్ని ఆధునిక దృష్టితో అర్థం చేసుకోవటం, అన్వయించటం ఈ వ్యాసంలో పెద్దగా జరగలేదు.

రెండో వ్యాసం 'రస సిద్ధాంతం - నవల-1'లో ఈ ప్రయత్నం చేయాలనే తలంపుతో వ్యాసాన్ని ఆరంభించి రచయిత్రి ఫలితం పొందలేక పోయారు. దానికి కారణం ఒకటి రెండు నవలలను విశ్లేషణ కొరకు తీసుకొని ఒక 'ప్రణాళిక ప్రకారం రస సిద్ధాంతాన్ని అన్వయించే పని చేయక పోవటమే. పైగా నవలా లక్షణాలను కొన్నింటిని పేర్కొని, ఆ పద్ధతి ప్రకారం నవలలు సాగితే రస స్ఫూర్తిని కలిగించగలవు అని పేర్కొనటం వ్యాసం ప్రయోజనాన్ని దెబ్బతీసింది.

ఇప్పటి నవలలు బహు ముఖోన్ముఖంగా యధార్థ జీవితాల్ని చిత్రిస్తూ, ఆధునిక ఇతిహాసాలుగా రూపు దిద్దుకొంటున్న నేపథ్యంలో "నిజమే పూర్తిగా ప్రాచీన కావ్యాలకు అన్వయం చేసినట్లుగా రస సిద్ధాంతాన్ని ఈ నవలలకు అన్వయం చేయలేము... రస సిద్ధాంతం ప్రాచీన వివరణలతో కాక కొంత కొత్త వ్యాఖ్యానాలతో పెంపుదలతో నవలకు అన్వయింపబడుతుందని చెప్పవచ్చు'' అని రచయిత్రి పేర్కొనటంతో వ్యాసగౌరవం దెబ్బతిన్నది. అలాగే చాలా చోట్ల "ఇదే రసానుభూతి! ఇదే రసానందం" అని చెబుతూ ఇచ్చిన నిర్వచనాలు కుదరలేదు.

'రససిద్ధాంతం - నవల-1' అనే వ్యాసంలో జరిగిన తప్పిదాలను రచయిత్రే గుర్తించి "నవలలకు రససిద్ధాంతం ఎట్లా అనువర్తితం అవుతుందో స్థూలంగా చెప్పాను. ఒక నవలలను గాని కొన్ని నవలల్లోని సంఘటనలను పాత్రలనుగాని తీసుకొని వివరించలేదు'' అని ప్రతి విమర్శకులకు సమాధానంతో రాశారు.

'రససిద్ధాంతం - నవల-2' అన్న వ్యాసం మరో రెండేళ్ళ తర్వాత రాయబడింది. ఈ వ్యాసంలో రచయిత్ర సంయమనం పాటిస్తూ కొన్ని నవలల్ని స్థాలీపులాక న్యాయంగా ఎత్తి చూపుతూ రస సిద్ధాంతాన్ని ఆయా నవలలకు అన్వయించే ప్రయత్నం చేశారు. 'చైతన్యం' రసం కాదా! అన్న తర్వాతి వ్యాసంలో రచయిత్రి ప్రతిపాదనలు పరస్పర వైరుధ్యంతో సాగుతాయి. అంతకుముందు నవలలు కూడా వాక్యాలే అని చెప్పి, ఈ వ్యాసంలో ఆధునిక కవిత్వంలో ప్రాచీన కావ్యాల్లోవలె పాత్రలుండవు, కవి భావానుభూతులుంటాయి. కనుక ఈ

భావాలకు రసస్ఫూర్తిని కలిగించే శక్తి ఉండదంటూ ఆధునిక కవిత్వం చేత రససృష్టి చేయటం జరగదని (పుట 67) రచయిత్రి ప్రకటిస్తారు. ఆధునిక కవిత్వం ఇచ్చే చైతన్యం (తెలివి, స్పృహ) వల్ల 'కార్యోన్ముఖత్వం' అనేది జరగదు, రామాయణాది కావ్యాల పఠనంవల్ల రస స్థితిని పొందిన పఠితలు కార్యోన్ముఖులవుతారు' అని రచయిత్రి చెబుతారు. అలా అని అదే వ్యాసంలో శ్రీశ్రీ వ్రాసిన మహాప్రస్థానం గీతాలలో వీర రసానందం ఉందని ఆమె చెబుతారు.

"సత్యం అహింస ధర్మం కర్తవ్యాలను సహృదయునికి అవగాహన కలిగించటమే ప్రాచీన కవుల ధ్యేయం" (పేజి నెం. 68), "ఆధునిక సాహిత్యానికి వ్యక్తి నిర్మాణం మీద దృష్టిలేదు" (పేజి నెం. 68) లాంటి వాక్యాలు రచయిత్రి దృక్పథాన్ని తెలియజేస్తాయి. ఇదే వ్యాసంలో మరో చోట "మనిషి బాహ్య ప్రాపంచిక చైతన్యానికి అతీతంగా ఆలంకారికులు రసానందాన్ని వర్ణించారని, రస సిద్ధాంతంలో ఎక్కడా సామాజిక వాతావరణం కన్పించదని, భావవాద అంశాలు మాత్రం పుష్కలంగా వున్నాయని, ఆధునికులు అది అశాస్త్రీయం అని అంటారు" అని రాశారు. కానీ అలా అన్న ఆధునికులెవరో, వారి సిద్ధాంతమేదో తెలియజేసి దానిని సోపపత్తికంగా ఖండిస్తే బాగుండేది. 'ఆధునికులు' అన్న పేరుతో అనేక అనౌచిత్యాలు ఆపాదించటం సులభం.

"నవలల్లో వస్తు ధ్వని" అనే తర్వాతి వ్యాసంలో తెలుగు సాహిత్యంలో కొన్ని నవలలను, వాటి ఇతివృత్తాలను, ఆయా నవలలను రాయటం వెనుక రచయిత ఉద్దేశాలను వస్తు ధ్వని పేరుతో అనేక వివరాల్ని అందించారు. తర్వాతి వ్యాసంలో శ్రీశ్రీ మహాప్రస్థాన గేయం వీర రసంలో నిండి ఉంది, ఆ ఉత్సాహం పాఠకుణ్ణి ఉగ్రూతలూగిస్తుంది. "ఉత్సాహం అంటే కార్యాచరణవైపు నడిపించే శక్తి. ఆ గేయపఠనం వల్ల పాఠకుడు ఉత్సాహ భావంతో తన్మయుడై పోతాడు. తాదాత్మ్యం రామాది పాత్రలతోనే కానక్కరలేదు. చక్కగా ప్రస్తుతీకరించిన భావం చేత కూడా సహృదయుడు రసావిష్టుడు అవుతాడు" (పుట 81) అని ఆధునిక కవిత్వమైన శ్రీశ్రీ గేయాన్ని గురించి ఈ రచయిత్రి వెల్లడించిన అభిప్రాయాలు అంతకు ముందు వెలువరించిన అభిప్రాయాలకు విరుద్ధంగా ఉన్న సంగతి (పుట 67) పాఠకుడు గమనించగలడు. మరొక చోట శ్రీశ్రీ కవితల్లో రౌద్రరసం కూడా ఉందని చెబుతారు. దిగంబర కవులు బీభత్స రసంతో కూడిన కవితలు రాసారని, దాని ద్వారా సమాజంపై జుగుప్స కలిగి అది ఆ అమర్షం (కోపం)గా మారి, అది ఉద్వేగంగా, ధర్మాగ్రహంగా మారి సంఘర్షణ తిరుగుబాటుకు పాఠకుడ్ని ఉన్ముఖం చేస్తున్నది (పుట 84) అని రచయిత్రి చెప్పిన మాటలకు, అంతకుముందు ఆధునిక కవిత్వంలోని చైతన్యం పాఠకుణ్ణి కార్యోన్ముఖతవైపు నడిపించజాలదని (పుట 67), రసస్ఫూర్తిని ఆధునిక కవిత్వం కలిగించలేకపోతున్నదని (పుట 67) రచయిత్రి చెప్పిన మాటలకు పరస్పర వైరుధ్యాన్ని గుర్తించవచ్చు.

అలాగే రసాలన్నీ నిర్మాణాత్మకమైనవి కావనీ, అన్ని రసాలూ అభ్యుదయం వైపు నడిపించేవి కావనీ (పుట 82) రచయిత్రి చెబుతూ, రసాల్లో కొన్ని సకారాత్మక వ్యక్తిత్వ వికాసాన్నీ, కొన్ని నకారాత్మక వ్యక్తిత్వ వికాసాన్నీ కలిగిస్తాయని (పుట 82) చెప్పటం విస్తుపోయేట్లు చేస్తుంది. రసాస్వాదన బ్రహ్మానంద సహోదర తుల్యమైనవనీ, అలౌకికానందాన్ని కలిగించేవని రచయిత్రికున్న విశ్వాసం ఈ వ్యాసాల్లో చాలా చోట్ల చూడవచ్చు, కాగా ఇప్పుడు వీటిలోనే నకారాత్మక, సకారాత్మక వ్యక్తిత్వ వికాసాల ప్రభావం ఎత్తి చూపడం ఆక్షేపణీయంగా అనిపిస్తుంది.

ఈ రకంగా 'రస చర్చ – ఆధునికత' అన్న ఈ వ్యాసాల సంకలనం రససిద్ధాంతాన్ని ఆధునిక సాహిత్యానికి అన్వయించే క్రమంలో సఫలం కాలేదని చెప్పాలి. అలాగని రససిద్ధాంతం ఆధునిక సాహిత్య ప్రక్రియలకు అనువర్తింప చేయలేమా? అనే సందేహం పొందాల్సిన పని లేదు, రచయిత్రి ప్రయత్నం సఫలం కాలేదనే చెప్పాలి. దానికి కారణాలు పుస్తకంలోనే దొరుకుతాయి. వ్యాసాల్లో విశ్లేషణ, అన్వయం సమగ్రంగా సాగి, వైరుధ్యాలు పరిహరింప చేసుకొని సాధ్యమైనంత వరకు నిర్దుష్టంగా వ్యాసరచన సాగి ఉంటే రచయిత్రి ప్రయత్నం ఫలించేది. చివరి మాట ఏమంటే సాహిత్యం లలిత కళలలో అంతర్భాగం, లలిత కళల తత్త్వం 'రసం'. రసమే కళలోని అమృతం. ఈ రసాస్వాదనే కళలపట్ల మానవునికున్న ఆకర్షణకి కారణం. రసదృష్టితో సాహిత్యాన్నే కాదు, అన్ని కళలను విమర్శించి, నిగ్గు తేల్చే అవకాశం, అవసరం ఉంది. మొత్తానికి ఈ రకమైన చర్చ జరిగే అవకాశానికి కారణమైన శ్రీమతి ముదిగంటి సుజాతారెడ్డి గారిని అభినందించక తప్పదు.

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా రూ. 200/– తో పాటు పంపండి.

**మిసిమి** *నెలనెలా విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**1. పేరు :** ..............................

**2. చిరునామా :**

ఇం.నెం. ..............................

వీథి ..............................

పేట ..............................

ఊరు ..............................

పిన్ ..............................

**3. సంతకం :** ..............................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 0523600004 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

---

చందాలు ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.

**మిసిమి**
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
Visit us at : www.misimi-monthly.com

ఈ క్రింది **మిసిమి** ప్రచురణలు, వేమన ఫౌండేషన్, ధర్మదీపం ఫౌండేషన్ వారి పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.

| | | | |
|---|---|---|---|
| **I.** | **మిసిమి ప్రచురణలు** | | **రూ.** |
| 1. | బాపు బొమ్మలు | (హార్డ్ బౌండ్) | 200.00 |
| | ***అన్నపరెడ్డి రచనలు:*** | | |
| 1. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | (హార్డ్ బౌండ్) | 500.00 |
| 2. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు | | 200.00 |
| 3. | ఆచార్య నాగార్జునుడు | | 150.00 |
| **II.** | **వేమన ఫౌండేషన్ ప్రచురణలు** | | |
| 1. | లోకకవి వేమన – *మరుపూరు కోదండ రామిరెడ్డి* | | 100.00 |
| 2. | మన వేమన – *ఆరుద్ర* | | 80.00 |
| 3. | వేమన – *నార్ల వెంకటేశ్వరరావు* | | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | | 50.00 |
| 6. | విశ్వకవి వేమన – *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం *(మూలం : ప్రొ. హరిమోహన్ ఝా, అనువాదం : జె. లక్ష్మిరెడ్డి)* | | 100.00 |
| 8. | THE FIRST POETIC READER - *K. Jitendra* | | 50.00 |
| 9. | వేమన – *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం – *ఎస్.ఎమ్. సుభాని* | | 25.00 |
| **III.** | **ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు** | | |
| 1. | బౌద్ధ ధర్మ దర్శనమ్ *రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్* | | 70.00 |
| 2. | మహామానవ బుద్ధ *రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి* | | 75.00 |
| 3. | మిళింద పన్హ : ఉపమలు – *బోధ చైతన్య* | | 75.00 |
| 4. | మహా పరిత్తం – *బోధ చైతన్య* | | 100.00 |
| 5. | జాతక కథలు – *శివశంకర స్వామి* | | 60.00 |

---


**మిసిమి**
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in ; Visit us at : www.misimi-monthly.com



దామెర్ల సృష్టించిన నిరంబర

**'అమాయిక'**

MISIMI / **మాసపత్రిక** / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2009-11



పెండ్లికూతురు